RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 06 సెప్టెంబర్ 2025 శనివారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:82

## ఖైరతాబాద్ మహాగణపతి ని దర్శించుకున్న రేవంత్ రెడ్డి



**ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఖైరతాబాద్ మహాగణపతి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఖైరతాబాద్ గణపతి ఉత్సవాలు 71 ఏండ్లు పూర్తి చేసుకుంది

దేశంలోనే గణేశ్ ఉత్సవాలంటే ఖైరతాబాద్ గణపతి అని చర్చించుకునేలా ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందిస్తున్నా

దేశంలో ఏ రాష్ట్రంలో, ఏ నగరంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వలేదు కానీ మన రాష్ట్రంలో గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ అందించింది భక్తితో ఉత్సవాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాం

ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటూ అధికారులను సమన్వయం చేస్తూ పరిష్కరించుకుంటూ ఉత్సవాలకు ఆటంకం కలగకుండా చూశాం

అన్ని మతాలను గౌరవిస్తూ హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

నిమజ్జనాలకు ఇబ్బంది కలగకుండా ట్యాంక్ బండ్ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశాం

భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా



**ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఖైరతాబాద్ మహాగణేష్ దర్శించిన టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి అనంతరం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపిసిసి చీఫ్.గణపతి ప్రతిమను మహేష్ కుమార్ గౌడ్ కి బహూకరించిన ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ సభ్యులు



ప్రజాబలం

06 సెప్టెంబర్ 2025 శనివారం

# అమెరికాను కట్టడి చేయలేమా!

భారత్‌లో ఆనాటి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీనే మించిపోయింది ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదం. మన దేశాభివృద్ధికి మన పాలకులు అనుసరించే ఆర్థిక అభివృద్ధి, సంరక్షణ విధానాలను ప్రశ్నించేందుకు, ఎదిరించేందుకు అమెరికా ప్రెసిడెంట్ ఎవరు? వ్యవసాయం, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ మొదలైన ప్రాథమిక రంగాల నుంచి పారిశ్రామిక రక్షణ రంగాల వరకు మనం చేపట్టే విధానాలను ఎప్పుడూ వ్యతిరేకించడమేనా? అమెరికా పని. ఇలాంటి బెదిరింపులకు భారత్ లొంగకుండా స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి. జాతీయవాదంతో మనం వలస పాలనను పారదోలినట్టు ఈ సామ్రాజ్యవాదుల నయా వలస పాలనను కూడా పారదోలాలి. అమెరికాలో 50 లక్షల మంది ఇండియన్ అమెరికన్లు ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని తరచూ అభినందిస్తూ ఉంటారు. వీరు పెద్ద టెక్ సంస్థలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫైనాన్షియల్ సంస్థలను నడుపుతున్నారు. విద్యా విధాన నిర్ణయాత్మక సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారు. అమెరికాకు మనవాళ్లు ఇంత చేస్తున్నా.. ఇండియా పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరు చూసి వారికి విచారం వేయడం న్యాయమే కదా!

అమెరికా తాను ఆపాదించుకున్న ప్రపంచ పెద్దన్న పెద్దరికంతో తాను విశ్వసనీయ భాగస్వామిగా గుర్తించాలంటే అమెరికా కనుసనాల్లో ఉండాల్సిందేనా? వ్యతిరేకిస్తే నియంతగా వ్యవహరిస్తారా? భారతదేశపు మార్కెట్ చాలా పెద్దదని అమెరికాకు తెలుసు. అమెరికాతో మనం శాస్త్ర సాంకేతిక రంగాలలో పోటీ పడుతున్నామని కూడా తెలుసు. మన మానవ వనరులు అమెరికా దేశాభివృద్ధికి ఎలా తోడ్పడుతున్నాయో తెలుసు.. మన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, విద్యావంతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌గా, డాక్టర్స్‌గా ఇతర సేవా రంగాలు, అమెరికా శాస్త్ర సాంకేతిక రంగాలలో తోడ్పడుతున్నారు. మార్కెట్ రీత్యా గాని మానవ వనరుల అభివృద్ధి పరంగా గాని భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అయితే పటిష్టవంతమైన ఆర్థిక విధానాలు, ప్రభుత్వ నియంత్రణ లేనందున స్వయం పోషకత్వంలో చైనా లాగా మనం నిలదొక్కులేకపోతున్నాం. సామ్యవాద తరహా సమాజం నుంచి పెట్టుబడిదారి సమాజం వైపు అడుగులు వేశాం. దీనివలన ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల కనుసనల్లో ముఖ్యంగా అమెరికా విధానాలకు లోబడిపోయే పరిస్థితి ఏర్పడింది.78 సంవత్సరాలుగా అనేక సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాదం తన ఆదేశాలను పాటించాలని ఇండియా ను బెదిరిస్తుంది. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలినియర్ల రాజ్యం వైపుగా భారత్ ఇప్పటికే పునాదులు వేసుకున్నది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమైపోయింది. బడా బుర్జువా వర్గ ప్రయోజనాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను, దేశాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకో గలదా? అగ్రరాజ్యం అని చెప్పుకునే అమెరికా తమ పెట్టు బడిదారులను ప్రోత్సహించి ప్రపంచ పెట్టుబడిదారులను నియంత్రించే పరిస్థితి ఉన్నది. నేడు ప్రభుత్వ పాలన పెట్టు బడిదారీ కనుసన్నల్లో కాకుండా ప్రజలను శాస్త్ర సాంకేతిక రంగాలలో మమేకం చేసి వస్తు ఉత్పత్తి చేస్తే ఎవరికీ ఏమీ మనం తీసిపోం. చైనాలో చాలామంది మంత్రులు శాస్త్ర సాంకేతిక రంగాలలో నిష్ణాతులు కావడం వలన అక్కడ ప్రజలు పాలన ఉత్పత్తి ప్రపంచ పోటీని తట్టుకొని అగ్రరాజ్యం అమెరికాను కూడా భయపెడుతున్నది. అటువంటి ప్రభుత్వాలు మనకు ఏవి? నరేంద్ర మోడీ, నెహ్రూ మాదిరి కాకుండా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. పారిశ్రామిక విధానాలలో అడ్డంకులు లేకుండా చేస్తున్నారు. కీలకమైన ఖనిజాలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ ఎరువులు, తదితర రంగాలు అభివృద్ధి కోసం మనం ప్రయత్నం చేయాలని 79వ స్వాతంత్ర దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించారు. ఇది నెహ్రూ విధానాల కన్నా భిన్నమైనది. స్వావలంబన దిశగా మనదేశం అభివృద్ధి చెందాలంటే స్వదేశీ మార్కెట్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వం అభివృద్ధి చేయాలి. ప్రపంచ మార్కెట్‌ను ఎదుర్కోవడానికి ఏం చేయాలో ప్రణాళిక రూపకల్పన జరగాలి. ఇప్పుడు అగ్రరాజ్యాన్ని సవాల్ చేసే రీతిలో అభివృద్ధి మన దేశంలో జరగాలి. స్వావలంబనకు భారత్ ఇప్పుడు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సామ్రాజ్యవాద పెత్తనం నుండి మన దేశం బయటపడాలి. అమెరికా చేస్తున్న ఎలాంటి బెదిరింపులకు భారత్ లొంగకుండా స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి. జాతీయ వాదంతో మనం వలస పాలన పారదోలినట్టు ఈ సామ్రాజ్యవాదుల నయా వలస పాలన కూడా పారదోలాలి. దేశాన్ని గ్లోబలైజేషన్ అనగా అమెరికా, యూరోప్ దేశాలపై ఆధారపడే ప్రభుత్వ విధానాల నుంచి తప్పించి స్వయం పోషకత్వ విధానాల వైపు ప్రభుత్వ విధానాలు ఉండాలి. ప్రపంచ ఆర్థిక రంగం ఎదుర్కొంటున్న ఈ సుంకాల వలయం నుంచి బయటకు రావాలంటే మన సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాధాన్యత ఇవ్వాలి. మరలా వలస పాలనకు వ్యతిరేకంగా ఆనాడు విదేశీ వస్త్ర బహిష్కరణ చేసి, స్వదేశీ వస్త్రాలైన ఖాదీ ధరించినట్లుగా ప్రస్తుతం భారతీయులు తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని మనం గుర్తించాలి. ముందుగా మన అవసరాలు తీర్చుకోవాలి. విదేశీ ఉత్పత్తులపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థ స్వయం పోష కత్వానికి ప్రాధాన్యతనివ్వాలి.

# గ్రేటర్ లో నిమజ్జనానికి సర్వం సన్నద్ధం

**48 గంటలు ... యంత్రాగం హై అలెర్ట్**

**303 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో సజావుగా శోభాయాత్ర జరిగేలా ఏర్పాట్లు పూర్తి**

**లి3 షిఫ్ట్ లలో స్వచ్ఛత కార్యక్రమాలు ... 25 ఐ 7 గంటలు**

**విధుల్లో 15 వేలకు శానిటేషన్ సిబ్బందిలి**

**లిరోడ్డు సేఫ్టీ డ్రైవ్ లో భాగంగా ఊరేగింపు జరిగే మార్గాలలో రోడ్లకు మరమ్మత్తులు పూర్తి**

**హుస్సేన్ సాగర్ చుట్టూ నిమజ్జనం సాఫీగా, వేగంగా జరిగేలా 11 పెద్ద క్రేన్ లతో సహా 40 క్రేన్ లు ఏర్పాటు**

**బాహుబలి క్రేన్ పాయింట్ 4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం**

**ఊరేగింపు జరిగే మార్గాలలో ఏర్పాటు చేసిన గార్బేజి పాయింట్ లలోనే చెత్తను వేయాలి.**

**చిన్న కలర్ పేపర్ ముక్కలు శోభాయాత్రలో వాడకండి ,భక్తులు, ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి**

హైదరాబాద్, సెప్టెంబర్ 05, 2025:గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈనెల 6 న జరిగే గణేష్ నిమజ్జన కార్యక్రమం సురక్షితంగా,ఎకో ఫ్రెండ్లీ విధానంలో సాఫీగా జరిగేలా జీహెచ్ఎంసీ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పూర్తి సన్నద్ధంగా ఉంది. నిమజ్జనం ముగిసే వరకూ జిహెచ్ఎంసి, పోలీస్, సమన్వయ శాఖలు హై అలెర్ట్ గా ఉండనున్నాయి.

ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి శ్రద్ధలతో నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసేందుకు పోలీస్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, HMDA ,జలమండలి, ట్రాఫిక్ పోలీస్ , ఆర్ అండ్ బి, హైడ్రా, వైద్య ఆరోగ్య, పర్యాటక, సమాచార శాఖ లను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతుంది.

72 కృత్రిమ కొలనుల ఏర్పాటు

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో 20 ప్రధాన లేక్ లతోపాటు జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 72 కృత్రిమ కొలనులలో నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేశారు. దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు దూరం అవ్వడంతో పాటు భక్తులకు సౌలభ్యంగా ఉంటుంది. ప్రధాన జలవనరుల పై ఒత్తిడి తగ్గనుంది.

134 స్థిర క్రేన్ లు, 259 మొబైల్ క్రేన్లు ఒక బాహుబలి క్రేన్, 10 పెద్ద క్రేన్ లు సహా హుస్సేన్ సాగర్ చుట్టూ మొత్తం 20 క్రేన్ లు ఏర్పాటు చేశారు.ఫలితంగా కీలకమైన ఈ హుస్సేన్ సాగర్ లో నిమజ్జనం వేగంగా, స్మూత్ గా జరగనుంది. బాహుబలి క్రేన్ నెంబర్ 4 ద్వారా ఖైరతాబాద్ మహా గణేష్ విగ్రహం నిమజ్జనం చేయనున్నారు.

సురక్షిత నిమజ్జనంకు ప్రాధాన్యత

నిమజ్జన పాయింట్ ల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా హైడ్రా, పర్యాటకశాఖ సమన్వయంతో హుస్సేన్ సాగర్ లో 9 బోట్లను, DRF టీం లను, 200 గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. పోలీసు సహకారంతో 13 కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేశారు.

సజావుగా ఊరేగింపు జరిగేలా 303 కిలో మీటర్ల మార్గం సంసిద్ధం

303.3 కిలోమీటర్ల మేర ప్రధాన ఊరేగింపు మార్గంలో గణేష్ విగ్రహాల నిమజ్జన శోభాయత్రం సజావుగా జరిగేందుకు 160 గణేష్ యాక్షన్ టీం లను జీహెచ్ఎంసీ డిస్ప్లాయ్ చేసింది. ఇప్పటికే ఈ మార్గంలో జీహెచ్ఎంసీ రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేసింది. శోభాయాత్రకు అనువుగా ఎలక్ట్రిసిటీ, కేబుల్ వైర్ లను సరిచేసింది. చెట్ల కొమ్మలు తొలగించింది.

స్వచ్ఛతకు పెద్దపీట

నిమజ్జన కార్యక్రమంలో స్వచ్ఛతకు పెద్దపీట వేసేలా 15 వేల మంది శానిటేషన్ వర్కర్స్ ను మూడు షిఫ్టులలో పని చేస్తున్నారు. వినాయక చవితి ప్రారంభం ఇప్పటి వరకూ 125 జేసీబీ లు, 102 మినీ టిప్పర్ లు ఉపయోగించి 10,500 మెట్రిక్ టన్నుల కు పైగా అధిక వ్యర్థాలను సేకరించి జవహర్ నగర్లోని ప్రాసెసింగ్ సెంటర్ కు తరలించారు. గణేష్ ప్రతిమల నిమజ్జనం జరిగే ప్రదేశాలలో 39 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు.

విద్యుత్ జిగేల్ లు...

నిమజ్జనం జరిగే ప్రదేశాలతో పాటు ఊరేగింపు జరిగే మార్గంలో మొత్తం 56,187 టెంపరరీ లైటింగ్ ను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. నిమజ్జనం పూర్తి అయ్యే వరకూ నూరు శాతం లైట్ లు పని చేసేలా అధికారులు మానిటర్ చేస్తున్నారు.

అందుబాటులో అత్యవసర వైద్య సేవలు

నిమజ్జన పాయింట్ లలో మూడు షిఫ్టులలో పని చేసేలా అంబులెన్స్ లతో సహా 7 మెడికల్ క్యాంపులను సిద్ధంగా ఉంచారు..

సకాలంలో గణేష్ ప్రతిమలను నిమజ్జనానికి తరలించాలి:కమిషనర్

కలర్ పేపర్ ముక్కలు ఊరేగింపులో వాడొద్దు

గణేష్ నిమజ్జనం సజావుగా , సాఫీగా జరిగేలా చూస్తున్నామని కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. సకాలంలో గణేష్ ప్రతిమలను నిమజ్జనానికి తరలించాల్సిందిగా కమిషనర్ నిర్వాహకులకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. గణేష్ ప్రతిమల ఊరేగింపు జరిగే మార్గాలలో నిర్దేశించిన గార్బేజి పాయింట్లు లోనే చెత్తను వేయాలని ప్రజలను, భక్తులను కమిషనర్ కోరారు.

కలర్ పేపర్ ముక్కలు ఊరేగింపులో ఎగురవేయవద్దని భక్తులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీటిని తొలగించడం కష్టతరమని, ప్రయాణికుల కళ్లలో పడతాయని , పర్యావరణానికి హాని చేస్తాయని చెప్పారు

# హైదరాబాద్‌లో నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశాం: జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్

## మేయర్, కమిషనర్ తో కలిసి మంత్రి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన








హైదరాబాద్, సెప్టెంబర్ 05,2024 :ఈ నెల 6 న జరగనున్న గణేష్ నిమజ్జనం ఘనంగా, అంగరంగ వైభవంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

శుక్రవారం హుస్సేన్ సాగర్ క్రేన్ 4, 5 పాయింట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బలమురి వెంకట్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతో కలిసి పరిశీలించారు.

అనంతరం మీడియాతో మాట్లాడారు.

“ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖలతోపాటు అన్ని విభాగాలు వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు.

గణేష్ ఉత్సవ సమితులతో సమన్వయం చేస్తూ రేపటి మహా నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ఇప్పటి వరకూ గ్రేటర్ పరిధిలో 1.50 లక్షల విగ్రహాలు విజయవంతంగా నిమజ్జనం అయ్యాయి. హుస్సేన్ సాగర్ చుట్టూ సజావుగా నిమజ్జనం జరిగేలా ఒక బాహుబలి క్రేన్‌తో సహ మొత్తం 40 క్రేన్‌లు ఏర్పాటు చేశాం. గణేష్ ఉత్సవ సమితి తో సమన్వయం చేసుకుంటూ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం వీలైనంత త్వరగా జరిగేలా చూస్తామన్నారు.

అలాగే ఖైరతాబాద్, బాలాపూర్ శోభాయాత్రలు సాఫీగా సాగేందుకు ఊరేగింపు మార్గం రోడ్ల మరమ్మత్తులు ఇప్పటికే పూర్తి చేశాం. ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాం,” అని మంత్రి వెల్లడించారు.

నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు నిమజ్జన కార్యక్రమాలు, శోభాయాత్ర ఆటంకాలు లేకుండా సాగేందుకు 30 వేల మంది పోలీసులు, షీటీమ్‌లతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

ప్రజలందరికీ ఆహ్వానం

హుస్సేన్ సాగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణంలో కన్నుల పండువగా జరిగే గణేష్ నిమజ్జన వేడుకలు తిలకించేందుకు రావాలని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఆహ్వానం పలికారు.

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పట్టణాలు, పల్లెల్లో కూడా నిమజ్జనం సజావుగా జరిగేందుకు స్థానిక యంత్రాంగాలు కృషి చేయాలనీ మంత్రి అన్నారు.

నగరంలో నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో జరిగేందుకు నిర్వహకులు, భక్తులు, ప్రజలు, సందర్శకులు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ....

నగరంలో రేపటి మహా నిమజ్జనం వేడుకలు ఇన్సిడెంట్ ఫ్రీ గా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని చెప్పారు.

నగర్ వ్యాప్తంగా నిమజ్జన పాయింట్ ల వద్ద 134 స్టాటిక్ క్రేన్ లు, 269 మొబైల్ క్రేన్ లు ఏర్పాటు చేశామన్నారు.

పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖలు, విభాగాల సహకారంతో నిమజ్జనం సజావుగా జరిగేలా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

నిమజ్జన పాయింట్ల లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా 200 స్విమ్మర్స్ ను అందుబాటులో ఉంచామని తెలిపారు. 15 వేల మంది శానిటేషన్ సిబ్బంది తో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా చేపడుతున్నామని,

లేక్ లలో క్లీనింగ్ ను 24 ఐ 7 చేపడుతున్నట్లు తెలిపారు. రేపటి మహా నిమజ్జనంకు 50%-%60 వేల గణేష్ ప్రతిమలు తరలివస్తాయని అంచనా వేసి,ఆ దిశగా ఏర్పాట్లు పూర్తి చేసామని అన్నారు. నిమజ్జన కార్యక్రమం కు అన్ని విధాలుగా సర్వసన్నద్ధంగా ఉన్నట్లు మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు

# కూటమి నేతల్లో ఓవర్ కాన్ఫిడెన్స్

విజయవాడ, సెప్టెంబర్ 5,అత్యధిక స్థానాలు గెలిచినప్పుడు అతి విశ్వాసం ఎక్కువగా ఉంటుంది. ఇక మనకు తిరుగేలేదనిపిస్తుంది. మరో కొన్ని దశాబ్దాల పాటు తమదే విజయం అని భ్రమిస్తుంది. అది ఎవరికైనా అంతే జరగుతుంది. అంతా ఫీల్ గుడ్ ఫ్యాక్టరే కనపడుతుంది. గతంలో వైసీపీ అధినేత జగన్ కూడా 151 నియోజకవర్గాల్లో గెలుపు సాధించగాలనే ఆయనను ఎవరూ పట్టుకోలేకపోయారు. ఇక మరో ముప్ఫయేళ్లు తానే సీఎం అని చెప్పుకొచ్చారు. టీడీపీ పూర్తిగా పతనమయిందని కూడా వ్యాఖ్యానించారు. ఇప్పుడు కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు అదే తరహాలో కనిపిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను చూసి 2029 ఎన్నికల్లోనూ తమదే విజయం అని గట్టిగా నమ్ముతున్నారు. తాము చేస్తున్నసంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి తమను మరోసారి అందలం ఎక్కిస్తుందని గుడ్డి నమ్మకంతో ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అలా లేవు. ఎమ్మెల్యేలపై ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. చంద్రబాబు ఎంత కష్టపడినా, పవన్ కల్యాణ్ తాను నీతి నిజాయితీగా ఉన్నానని చెబుతున్నప్పటికీ లోకల్ పాలిటిక్స్ కూటమిని గెలుపుదిశగా నడిపించలేవన్న విషయాన్ని గ్రహించాలి. ఎమ్మెల్యేలు చేస్తున్న పనికి ఏం చర్యలు తీసుకున్నప్పటికీ రానున్న ఎన్నికల్లో గెలుపు అనేది చాలా కష్టమేనని రాజకీయ విశ్లేషకులు సయితం అంగీకరిస్తున్నారు. ఎందుకంటే ఎమ్మెల్యేలను మార్చినా, వారి ప్రభావం ఖచ్చితంగా నియోజకవర్గంలో పడుతుందని గత ఎన్నికల్లో వైసీపీ అధినేత తీసుకున్న నిర్ణయాలే ఉదాహరణ అని గుర్తుంచుకుంటే మంచిది. గత ఎన్నికల్లో 164 స్థానాల్లో కూటమి గెలిచిన తర్వాత ఎక్కువమంది నియోజక వర్గ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గానికి సామంతరాజుగా మారిపోయారు. అక్కడ చంద్రబాబు, లోకేశ్ ఆదేశాలు చెల్లుబాటు కావు. ప్రతిపక్ష బలహీనంగా ఉండటంతో చంద్రబాబు గుడ్డినమ్మకంతో ముందుకు వెళుతున్నారు. పవన్ కల్యాణ్ కూడా వైసీపీని ఇక అధికారంలోకి రానిచ్చేది లేదని బీరాలు పలుకుతున్నారు. కాని 2024 వరకూ ఆ మాటలను జనం నమ్మారు. ఇక పవన్ కల్యాణ్ మాటలను కూడా జనం విశ్వసించే పరిస్థితుల్లో లేరన్నది వాస్తవం. ఎంత చెప్పినా, ఎన్ని శపథాలు చేసినా.. ఎంత గ్లామర్ ఉన్నప్పటికీ రాజకీయాలనేవి అందలం ఎక్కించినంత సులువుగానే కిందకు పడేస్తాయన్నవిషయాన్ని మరచి ఇద్దరు నేతలు వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ బలంగా వినపడుతున్నాయి. ఎంత బాగా పరిపాలన చేసినా.. ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా.. ఇదిగో అభివృద్ధి అని చాటి చెప్పినా ప్రజలు మార్పు కోరుకుంటారు. అది చంద్రబాబును, పవన్ కల్యాణ్ ను చూసి ఓటెయ్యరు. తమ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు ఈ ఐదేళ్ల పాటు వ్యవహరించిన తీరును బేరీజు వేసుకుని జనం ఓట్లేస్తారు. పథకాలు ఎవరు వచ్చినా ఇస్తారు. అభివృద్ధి అనేది ఎవరు వచ్చినా జరుగుతుందన్న నమ్మకం జనంలో ఉంటుంది. అదే సమయంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యేలను చూసి మాత్రమే ఒక నిర్ణయానికి వచ్చేస్తారు. అది పార్టీలకు శాపంగా మారుతుందని గుర్తుంచుకోవాలి. అందుకే గుడ్డిగా నమ్మకుండా మరో నాలుగేళ్ల సమయంలో ఏదైనా పెనుమార్పులు తీసుకు రాగలిగితే తప్ప కూటమి ఓటమి నుంచి బయటపడే అవకాశాలు లేవన్నది విశ్లేషకులు బలంగా చెబుతున్నారు. మరి చంద్రబాబు ఏం చేస్తారన్నది చూడాలి.

# కొత్త పాలసీలు అక్కరకు వచ్చేనా

విజయవాడ, సెప్టెంబర్ 5,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడుల కోసం అనేక ప్రయత్నాలు చేస్తుంది. ఉపాధి అవకాశాలు పెంచడమే కాకుండా, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలన్న ఉద్దేశ్యంతో పరిశ్రమలకు బంపర్ ఆఫర్ ఇస్తుంది. పారిశ్రామికాభివృద్ధి కోసం విన్నూత్న నిర్ణయాలను తీసుకుంటుంది. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకు వచ్చేందుకు భూములకు తక్కువ ధరకు ఇచ్చేందుకు కూడా సిద్ధపడింది. దీని వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తే తలసరి ఆదాయం పెరిగే అవకాశముందని అంచనా వేసి సరికొత్త విధానాన్ని ప్రకటించింది. ఈ విధానం కింద ఎకరా భూమిని కేవలం 99 పైసల నామమాత్రపు లీజు ధరకు కేటాయించనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. .. ప్రభుత్వం తెచ్చిన 'టెక్‌హబ్ పాలసీ 4.0' ప్రకారం, విశాఖపట్నం, అమరావతి, తిరుపతి నగరాల్లో భూములు కేటాయించనున్నారు. ఫార్చ్యూన్-500, ఫోర్బ్స్ గ్లోబల్ జాబితాలో ఉన్న పెద్ద ఐటీ సంస్థలు మాత్రమే ఈ పథకానికి అర్హులుగా పేర్కొనడంతో బడా కంపెనీలను ఆకట్టుకునే ప్రయత్నమని చెప్పక తప్పదు. కంపెనీలు మూడేళ్లలో కనీసం మూడు ఉద్యోగాలు సృష్టించాలన్నది ప్రభుత్వం విధించిన ప్రధాన షరతు. బెంగళూరు, హైదరాబాద్ వంటి ఐటీ నగరాలతో పోటీపడి, రాష్ట్రాన్ని ఒక ప్రధాన టెక్ హబ్‌గా మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలకు భూములు కేటాయించారు. మరికొన్ని ప్రముఖ కంపెనీలు కూడా క్యూ కట్టే అవకాశముందన్న అంచనాలు వినపడుతున్నాయి.కేబినెట్ ఆమోదం పారిశ్రామికవేత్తలను ఆకర్షించడమే కాకుండా... ఈ పథకం చూడటానికి పారిశ్రామికవేత్తలకు ఆకర్షణ కోసమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగ శాతం తగ్గించేందుకు ఉపయోగపడుతుందని భావించి కొత్త పాలసీని ప్రకటించారు. భూములు కారు చౌకగా ఇస్తున్నందున భూముల కోసమని కాకుండా, తమ కంపెనీ విస్తరణ కోసమయినా రాష్ట్రానికి వస్తారని కూటమి ప్రభుత్వం ఆశగా ఉంది. 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వెనకబడిన ప్రాంతమైన అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను తేవడంతో ఆయన పేరు రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. మొన్నటి ఎన్నికల సమయంలో అది కూడా ఆయన గెలుపునకు తోడ్పడింది. ఇప్పుడు అదే విధంగా తక్కువ ధరకు భూములిచ్చైనా భారీ పరిశ్రమలను తెచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. చంద్రబాబు సర్కార్ చేస్తున్న ఈ ప్రయత్నం ఫలిస్తే మరొకసారి విజయానికి దగ్గరగా వెళతామన్న నమ్మకంతో పార్టీ నేతలున్నారు.

# పిఠాపురం వాసులకు కానుకలే కానుకలు

కాకినాడ, సెప్టెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి మరియు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తన నియోజకవర్గం పిఠాపురంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఒక రోజు ముందుగానే ప్రత్యేకంగా జరిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు 2,000 మంది ఉపాధ్యాయులు , జూనియర్ కళాశాలల్లోని అధ్యాపకులకు ఆయన కానుకలు అందజేశారు. మహిళా ఉపాధ్యాయులకు చీరలు, పురుష ఉపాధ్యాయులకు ప్యాంటు-షర్టు బహుమతులుగా ఇచ్చారు. ఈ కానుకలను పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లోని విద్యాశాఖ కార్యాలయాల ద్వారా ఒక ప్రత్యేక బృందం గురువారం ఉదయం పంపిణీ చేసింది. అధ్యాపకులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కల్యాణ్ ఇటీవల శ్రావణ మాసం సందర్భంగా.. పది వేల మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తన పుట్టింటి ఆడపడుచుల్లాగా చీర, రూపు, పసుపు, కుంకుమ ఇచ్చారు. మనస్ఫూర్తిగా పూజ చేసుకున్నాం అంటూ పలువురు మహిళలు సంతోషం వ్యక్తంచేశారు. అంతకు ముందు రాఖీ సందర్భింగా తాపురం నియోజకవర్గం పరిధిలోని వితంతువులకు, ఒంటరి మహిళలందరికీ సోదరుడిగా నేను ఉన్నాననే భరోసా కల్పిస్తూ కానుకలు పంపించారు. పిఠాపురంలో తల్లిదండ్రులు లేని వారి కోసం పవన్ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. పిఠాపురం నియోజకవర్గంలోని అనాథ పిల్లలకు తన వేతనాన్ని ఇస్తున్నారు. ఒక్కొక్కరికీ రూ. 5వేల చొప్పున సాయం... మిగిలిన వేతనం వారి బాగోగుల కోసం ఖర్చు చేస్తున్నారు. ప్రతి నెలా ఇంటి వద్దనే అందిస్వితున్నారు. ఉపముఖ్యమంత్రిగా వచ్చే జీతం అంతా అనాథలకే వెచ్చిస్తున్నారు

# ఉత్తరాంధ్రపై కూటమి ఫోకస్

విశాఖపట్టణం, సెప్టెంబర్ 5, చంద్రబాబు- పవన్ ఫోకస్ అక్కడే. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమరావతి జపం చేశారని ఉత్తరాంధ్రని విస్మరించారని విమర్శలు ఉన్నాయి. ఏపీలో టీడీపీ కూటమి నేతలు ఉత్తరాంధ్ర మీద పూర్తి ఫోకస్ పెట్టేశారు అందుకే వరుసగా పర్యటనకు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఒకరి తరువాత ఒకరు ఉత్తరాంధ్రాకు వస్తూనే ఉన్నారు. చంద్రబాబు విషయమే తీసుకుంటే గత నెల 29న వచ్చి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న బాబు సెప్టెంబర్ 2న మరోసారి విశాఖ వచ్చి స్థానిక అధికార కార్యక్రమాల్లో పాల్గొన్నారు తిరిగి ఈ నెల 5న ఆయన విశాఖ వస్తున్నారు. ఒక వారంలో మూడు సార్లు బాబు రావడం అంటే రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అయితే గత నేల చివరిలో నాలుగు రోజుల పాటు విశాఖలో ఉన్నారు ఆయన జనసేన పార్టీ సమావేశాలను నిర్వహించారు బహిరంగ సభతో ఆయన విశాఖ జనాలను పలకరించారు. తిరిగి పవన్ కళ్యాణ్ ఈ నెల 5న విశాఖ వెళ్లారు ఆయన అల్లూరి జిల్లా అరకులోని గిరిన ప్రాంతాలలో పర్యటన చేస్తున్నారు. ఆదివాసీల పండుగలో ఆయన పాల్గొంటారు అని అంటున్నారు. నారా లోకేష్ కూడా గత నెలలో మూడు రోజుల పాటు విశాఖలో ఉంటూ స్థానికంగా ప్రభుత్వ ప్రైవేటు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన ఢిల్లీ పర్యటన తరువాత వచ్చే వారంలో విశాఖకు వస్తారని అంటున్నారు. కూటమిలోని ముగ్గురు అగ్ర నాయకులు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర మీద దృష్టి పెట్టడానికి కారణం ఈ ప్రాంతాన్ని తాము విస్మరించడం లేదని బలంగా చెప్పడానికే అని అంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమరావతి జపం చేశారని ఉత్తరాంధ్రని విస్మరించారని విమర్శలు ఉన్నాయి.

దానిని వైసీపీ కూడా హైలెట్ చేసింది. దాంతో 2019 ఎన్నికల్లో టీడీపీ బాగా దెబ్బ తిన్నది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజధాని విశాఖ అని ప్రకటించింది కానీ అమలు చేయలేకపోయింది. విశాఖ వాసులతో పాటు ఉత్తరాంధ్ర ప్రజలు రాజధాని అమరావతిగా ఉండడానికి సమ్మతి తెలిపినా తమ ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలని తీవ్రంగా కోరుకుంటున్నారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ అయితే లేదని అంటున్నారు. ఇపుడు చూస్తే అమరావతి చుట్టూనే కూటమి ప్రభుత్వం ఆలోచనలు ఎక్కువగా తిరుగుతున్నాయని వైసీపీ విమర్శిస్తోంది. తాజాగా వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ మీడియాతో మాట్లాడుతూ విశాఖలో ఈవెంట్లు అమరవతిలో పేమెంట్లు అని హాట్ కామెంట్స్ చేశారు. విశాఖను కేవలం వాడుకుని వదిలేస్తున్నారు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బహుశా ఇలాంటి విమర్శలు కూడా కూటమిని ఆలోచనల్లో పడవేసి ఉంటాయని అంటున్నారు అందుకే ఉత్తరాంధ్రాను తాము ఎంతగానో అభివృద్ధి చేస్తున్నామని చెప్పడానికి వరసగా పర్యటనలు చేయడమే కాకుండా ఎవరో ఒకరు తరచూ అధికారిక పర్యటనలతో ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా జనాలలో ఉండేలా చేసుకుంటున్నారు అని అంటున్నారు. అయితే మాటలు ప్రకటనలు ఎంత ఘనంగా ఉన్నా అభివృద్ధి కూడా అంతే గంభీరంగా సాగితేనే ఫలితం ఉంటుంది అని అంటున్నారు.

## మంత్రి కార్యక్రమంలో ఉద్రిక్తత

నల్లగొండ పట్టణంలోని ఒకటో నంబర్ వినాయకుడి విగ్రహం వద్ద ఉద్రిక్తత నెలకొంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వినాయకుడి పూజలు చేసి సభలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతుండగా.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నిరసనకు దిగారు. దాంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ, తోపులాట జరిగింది. మంత్రి అక్కడ నుంచి వెళ్లిపోయారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు.

# ప్రైవేటీకరణం...

ఏలూరు, సెప్టెంబర్ 5, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై రోజుకో రకమైన ఊహాగానాలు వస్తున్న వేళ.. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను.. నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అదే సమయంలో భవిష్యత్‌లో స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు కొన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. ఇలాంటి ప్రైవేటీకరణ వ్యాఖ్యలు చేసే బాధ్యతారహిత పార్టీలకు చెందిన నేతలు.. ఇక నుంచైనా తమ ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.నష్టాల్లో నడుస్తున్న వైజాగ్ ఉక్కు పరిశ్రమను.. తిరిగి లాభాల్లోకి తీసుకువచ్చేందుకు.. కేంద్రం కొన్ని కఠిన నిర్ణయాలను అమలు చేస్తోందని భూపతిరాజు శ్రీనివాసవర్మ వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తారంటూ ఆరోపణలు చేసేవారు ఇప్పటికైనా అలాంటి మాటలు మాట్లాడొద్దని పేర్కొన్నారు. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్లు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన కేంద్రమంత్రి.. అది పరిశ్రమను కాపాడేందుకేనని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ భవిష్యత్‌ను కూడా కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అంతా సహకరించాలని కోరారు.విశాఖ ఉక్కు పరిశ్రమ భవిష్యత్తుకు ఎలాంటి ఢోకా లేదని ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు, ట్రేడ్ యూనియన్ నేతల సాయంతో తిరిగి పరిశ్రమను లాభాల బాట పట్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉక్కు పరిశ్రమ ప్రయోజనాల కోసం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయంతో దేశంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని కేంద్రమంత్రి వెల్లడించారు. సామాన్యుల జీవితాల్లో సమూల మార్పులు రానున్నాయని పేర్కొన్నారు. 4 శ్లాబులు ఉన్న జీఎస్టీని 2 శ్లాబ్‌లకు తీసుకురావడంతో రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కలగనుందని తెలిపారు.ఇక నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో రైల్వేలు, నేషనల్ హైవేలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని శ్రీనివాసవర్మ వెల్లడించారు. ఎన్‌హెచ్-165 రహదారి విస్తరణకు రూ.3,200 కోట్లతో డీపీఆర్ సిద్ధమైందని స్పష్టం చేశారు. అతి త్వరలోనే నరసాపురం - చెన్నై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం కానున్నట్లు వివరించారు. ఇక నరసాపురం - అరుణాచలం ఎక్స్‌ప్రెస్ రైలును రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇక అన్ని గవర్నమెంట్ ఆఫీసులు ఒకే దగ్గర ఉండేలా కలెక్టరేట్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు.

కార్మిక సంఘాల దోబూచాలాట

విశాఖ స్టీల్ ఉద్యమం కొనసాగుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రయత్నిస్తోందని ఉద్యోగులతో పాటు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ అటువంటిదేమీ లేదని కూటమి నేతలు చెబుతున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ జరగదని తేల్చి చెప్పారు. మరోవైపు స్టీల్ ప్లాంట్ లోని ప్రధాన విభాగాలకు సంబంధించి ప్రైవేటీకరణ జరిగిపోతోంది. ఇటువంటి తరుణంలో కార్మికులతోపాటు ఉద్యోగుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇటువంటి తరుణంలో విశాఖ ఎంపీ శ్రీ భరత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ట్రోల్ చేస్తున్నాయి.వాస్తవానికి ఎంపీ శ్రీ భరత్ కొంతమంది కార్మిక సంఘ నాయకుల విషయంపై మాట్లాడారు. తన వద్దకు వచ్చి ఒకలా మాట్లాడుతున్నారని.. బయటకు వెళ్లి తనపై దుష్ప్రచారం చేస్తున్నారని.. మాటలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది కార్మిక నాయకులకు నైతిక విలువలు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ కాంట్రాక్టు పోస్టులను లక్షలకు లక్షలు అమ్ముకున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఆ నాయకులే కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గాజువాక లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కార్మిక నాయకులది రాజకీయ ఎత్తుగడగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రజలే అలాంటి వారిపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.ఎట్టి పరిస్థితుల్లో విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ జరగదని కూటమినేతలు చెబుతున్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా నిధులను సమకూర్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే ఆ ప్లాంట్ ఉత్పత్తి కోసమే ఈ నిధులను చెబుతుండగా.. అటువంటప్పుడు సొంత గనులు కేటాయించవచ్చు కదా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల 32 విభాగాలకు సంబంధించి ప్రైవేటీకరణ జరిపిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగదని.. కూటమి నేతలు మోసం చేస్తున్నారన్న విమర్శలు వైసీపీ నుంచి వినిపిస్తున్నాయి. అయితే వైసిపి ముసుగులో కొంతమంది కార్మిక నేతలు మాట్లాడుతున్నారన్న అనుమానం టిడిపి నాయకుల్లో ఉంది. అందులో భాగంగానే ఎంపీ శ్రీ భరత్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

# అరుణ... కథ చాలా ఉంది..

నెల్లూరు, సెప్టెంబర్ 5, మన వ్యవస్థ చాలా గొప్పది. అందువల్లే ప్రజాస్వామ్యం ఇప్పటికీ ఇంకా కొనసాగుతూనే ఉంది. కానీ కొంతమంది వ్యక్తుల వల్ల వ్యవస్థ సర్వనాశనమవుతోంది. ప్రజాస్వామ్యం అనే మాటకే తప్పుడు అర్థం వస్తోంది. కొంతమంది వ్యక్తులు చేసే తప్పుడు పనుల వల్ల మన రాజ్యాంగం నగుబాటుకు గురవుతోంది. ఎంతో గొప్ప లక్ష్యంతో మన వ్యవస్థను పెద్దలు నిర్మించారు. కానీ తప్పుడు వ్యక్తుల వల్ల ఆ వ్యవస్థ మొత్తం సర్వనాశనం అవుతోంది. అలాంటిదే ఉదంతం కూడా..మనదేశంలో అన్ని రంగాలను రాజకీయ శక్తి ప్రభావితం చేస్తుంది. ఎంతటి గొప్ప వ్యవస్థ అయినా సరే రాజకీయ నాయకుల ముందు తలవంచాల్సిందే.. అది ఆమెకు నచ్చింది. పుట్టింది సామాన్య కుటుంబంలో అయినప్పటికీ.. గొప్పగా ఎదగాలని.. పదిమందితో జేజేలు కొట్టించుకోవాలని ఆమెకు ఉండేది. వాస్తవానికి ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఆమె సన్మార్గంలో వెళ్తే పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. కానీ కష్టపడే ఓపిక ఆమెకు లేదు. దేన్నైనా సులువుగా సాధించాలని కోరికతో ఆమె అడ్డదారులు తొక్కింది. ఫలితంగా ఆమె అసలు రంగు బయటపడి ఇప్పుడు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తోంది.ఇటీవల కాలంలో నెల్లూరులో అరుణ గురించి విపరీతమైన చర్చ జరిగింది. నేరమయ కార్యకలాపాలతో.. నేరస్తులతో అంటకాగి.. ఆమె ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. బృందాలను నియమించుకొని అడ్డగోలు కార్యకలాపాలకు పాల్పడింది. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఒక యాప్ ను తనకు అనుకూలంగా మార్చుకుంది. దానిని తన రాజకీయ జీవితానికి ప్రచారంగా వాడుకుంది. పోలీసులతో సన్నిహిత సంబంధాలను మొదలుపెట్టింది. వారితో రాసలీలలు కొనసాగించింది. వాటిని వివిధ రూపాలలో చిత్రీకరించడం.. వాటి ద్వారా పోలీసు ఉన్నతాధికారులను బెదిరించడం.. తనకు అనుకూలంగా అన్ని పనులు చేసుకోవడం.. ఇలా సాగిపోయింది ఆమె వ్యవహారం. ఏకంగా ప్రభుత్వ పరిపాలనకు గుండెకాయ లాంటి సచివాలయం దాకా ఆమె వెళ్లగలిగింది. వెళ్లడం మాత్రమే కాదు అందరినీ ప్రభావితం చేసింది. ఒకానొక దశలో 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచి నెల్లూరు జిల్లాలోని ఏదో ఒక అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలని ఆమె అనుకుంది. ఒకవేళ వైసీపీ ప్రభుత్వం గనుక మరలా ఏర్పడితే కచ్చితంగా హోం మంత్రి అవుతానని ఆమె చెప్పుకోవడం మొదలుపెట్టింది. చెప్పుకోవడమే కాదు పలు వర్గాల నుంచి డబ్బు కూడా వసూలు చేసింది.నేరమయ వ్యక్తులు.. చీకటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు.. అసాంఘిక శక్తులు.. వీరంతా కూడా ఆమెకు డబ్బును సర్దుబాటు చేశారు. ఆమె అనుకున్నట్టుగా టికెట్ రాకపోవడంతో కొంత ఇబ్బంది పడినప్పటికీ.. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు కాకపోవడంతో మరింత నిరాశలో కూరుకుపోయింది. ఇదే క్రమంలో 6 నెలలపాటు నిశ్శబ్దంగా ఉండిపోయింది. కూటమి ప్రభుత్వంలోనూ చక్రం తిప్పడం మొదలుపెట్టింది. తనకు అలవాటైన వీడియో రికార్డులను అందుకు ఉపయోగించుకుంది. ఆ తర్వాత అసలు వ్యవహారం మొదలుపెట్టింది. అయితే ఆమె ఆటకు ఆదిలోనే కూటమి ప్రభుత్వ పెద్దలు అడ్డుకట్ట వేయడంతో.. జైలుకు వెళ్ళింది. లేకపోతే కథ మరో విధంగా ఉండేది. ఏది ఏమైనప్పటికీ ఎక్కడో సామాన్య కుటుంబంలో పుట్టిన ఆమె సన్మార్గంలో పయనించాల్సింది పోయి.. అడ్డదారులు తొక్కింది. చివరికి ఇలా జైలు పాలైంది.

## వైసీపీ ఎమ్మెల్యేల్లో చీలిక...

ఒంగోలు, సెప్టెంబర్ 5, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి శాసనసభకు హాజరు కావడం లేదు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు హాజరవుతానని చెబుతున్నారు. తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చే ధైర్యం లేదని చంద్రబాబుకి సవాల్ చేస్తున్నారు. అసలు బుద్ధి జ్ఞానం ఉందా అంటూ చంద్రబాబు ప్రశ్నించిన జగన్ తీరులో మార్పు రావడం లేదు. ఆయుధం ఇవ్వండి యుద్ధం చేస్తా అన్నట్టు ఉంది జగన్మోహన్ రెడ్డి. అంతకుమించింది ఏంటంటే.. అధికార పార్టీపై పోరాటం చేసేందుకు.. అదే అధికార పార్టీకి అనుమతి కోరినట్టు ఉంది. అయితే ప్రస్తుతం జగన్ వైఖరి ఇంటా బయట చర్చ జరుగుతోంది. శాసనమండలి సమావేశాలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. మరి శాసనసభకు ఏం బాధ వచ్చింది అనేవారు ఉన్నారు. పోనీ హోదా ఇస్తే.. గంటలకు గంటలు మాట్లాడే అవకాశం ఇచ్చినా జగన్ మాట్లాడగలరా? ప్రమాణ స్వీకార సమయంలోనే ఆయన పూర్తిగా అయోమయానికి గురయ్యారు. చాలా ఆత్మ నున్యతా భావంతో మాట్లాడారు. అటువంటి వ్యక్తి వచ్చి 164 మంది ఎమ్మెల్యేలను ఎదుర్కోవడం సాధ్యమా? అది అయ్యే పనేనా? అందుకే జగన్తో పని లేకుండా ఓ ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరవుతారని ప్రచారం నడుస్తోందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఈసారి పేరు మోసిన నేతలు ఎవరూ గెలవలేదు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తమ్ముడు ద్వారకానాథ్ రెడ్డి, కడప జిల్లా నుంచి అమర్నాథ్ రెడ్డి, మరో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి లాంటి వారే గెలిచారు. మిగతా వారంతా పెద్దగా తెలియని వారే. అయితే ఇప్పుడు జగన్ అభిప్రాయంతో సంబంధం లేకుండా.. ఓ ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరవుతారని ప్రచారం నడుస్తోంది. అయితే అనర్హత వేటు భయంతోనే వారు సభకు హాజరవుతున్నట్లు సమాచారం. సభకు సమాచారం ఇవ్వకుండా 60 పని దినాలు హాజరు కాకపోతే అనరాహత వేటు వేయవచ్చు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత వైసిపి సభ్యులు హాజరు కాలేదు. ఒకే ఒక్క రోజు గవర్నర్ ప్రసంగం నాడు సభకు హాజరయ్యారు. ఆరోజు హాజరు వేసుకున్నారు. కానీ అది చెల్లదని తేలింది. తరువాత కొందరు దొంగ చాటుగా వచ్చి సంతకాలు పెట్టినట్లు తెలియడంతో స్పీకర్ రూలింగ్ ఇచ్చారు.సెప్టెంబర్ నెలలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలునిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ సమావేశాలకు హాజరు కాకుంటే మాత్రం.. 60 రోజుల కోటా పూర్తి అయిపోతుంది. అందుకే వైసీపీ ఎమ్మెల్యేలు ఒకరితో ఒకరు మాట్లాడుకుని అసెంబ్లీకి హాజరుకావాలని నిర్ణయించుకున్నట్లుగా చెబుతున్నారు. అలా సభకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పాలని భావిస్తున్నారు. అయితే ఆ ఆరుగురు ఎవరు అన్నది మాత్రం తెలియడం లేదు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మాత్రం సభకు హాజరవుతారని బలంగా ప్రచారం జరుగుతోంది. అయితే వారిని కచ్చితంగా ఆపేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తారు. ఆ ఆరుగురు సభ్యులు సభకు హాజరైతే మాత్రం జగన్మోహన్ రెడ్డి బరువు పోవడం ఖాయం. అయితే ఇందులో తొలిసారిగా ఎమ్మెల్యేలు అయిన వారు ఉన్నారు. కనీసం సభలో మాట్లాడకుండా తమ పదవీకాలం ముగిస్తే.. తమకు ఏం ప్రయోజనమని.. కనీసం మాజీ ఎమ్మెల్యేల కోటా కింద పెన్షన్ తో పాటు రాయితీలు తీసుకోలేమని బాధపడుతున్న వారు ఉన్నారు. అందుకే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ఇప్పుడు ఏం చేద్దాం...

## రాధా కార్యకర్తలతో మంతనాలు

విజయవాడ, సెప్టెంబర్ 5, బెజవాడలో ఆ లీడర్‌కి సీనియారిటీ ఉన్నా? కాలం కలిసి రావడం లేదా? వాళ్ళు పోతే వీళ్ళు, వీళ్ళు పోతే వాళ్ళు అంటూ? పదిహేనేళ్ళు వెయిట్ చేశాం. ఇక మావల్ల కాదని ఆ నేత అనుచరగణం ఎందుకు అంటోంది? తమ నాయకుడిని వాళ్ళు ఎలా చూడాలనుకుంటున్నారు? ఇప్పుడాయన ఎలా ఉన్నారు? అసలింతకీ ఎవరా లీడర్? ఏంటాయన ఎదురుచూపుల కథ? బెజవాడ రాజకీయాల్లో వంగవీటి పేరు ఒక బ్రాండ్. ఇంకా చెప్పుకోవాలంటే? ఏపీ పాలిటిక్స్ మొత్తాన్ని కూడా ప్రభావితం చేయగలిగిన పేరు అది. దివంగత వంగవీటి రంగా కుమారుడిగా? రాధాకి కూడా అదే గుర్తింపు ఉంది. తండ్రి ఒకసారి, తల్లి రెండు విడతలు ఎమ్మెల్యేలు అవగా? రాధా ఒక్క విజయానికే పరిమితం అయ్యారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో మూడు సార్లు పోటీ చేసి ఒక్కసారి మాత్రమే గెలవగలిగారాయన. మొత్తం ఐదు ఎన్నికల్ని చూసిన రాధా? రెండు విడతలు పోటీకి దూరంగా ఉన్నారు. అత్యంత చిన్న వయసులో ఎమ్మెల్యే అయిన రికార్డ్ ఆయన పేరిట ఉన్నా? ఆ ఒక్కసారి మినహా? మరెప్పుడూ ఆయన పవర్‌లోలేరు. ఇపుడు అదే? ఆయన సొంత కేడర్‌ని కలవరపెడుతోందట. తొలిసారి 2004లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి మొదటి ప్రయత్నంలోనే ఎమ్మెల్యే అయ్యారు రాధా. అప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూడా అధికారంలోకి వచ్చింది. ఆ ఐదేళ్ళు మాత్రమే ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ తర్వాత నుంచి రాధా పొలిటికల్ కెరీర్ పరిశీలిస్తే.. ఎన్నడూ అధికారంలో లేరు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీలో చేరి ఓడిపోయి అధికారానికి దూరమయ్యారు. 2014లో వైసీపీ తరపున పోటీ చేసి ఓడిపోయి ప్రతిపక్షంలో ఉన్నారు.ఇక 2019లో టిడిపిలో చేరినా?. అప్పుడు ఆ పార్టీకి పవర్ పోయింది.

ఈ క్రమంలో? 2024లో వైసీపీలో చేరాలని ప్రతిపాదనలు వచ్చినా? ఆయన మాత్రం టిడిపిలోనే కొనసాగి 20 ఏళ్ల తర్వాత అధికార పార్టీలో ఉన్నారన్నది వంగవీటి వర్గం మాట. నిలకడ లేకుండా? ప్రతి ఎన్నికల టైంలో గెలవబోయే పార్టీ నుంచి ఓడిపోయే పార్టీలోకి వెళ్ళటం ద్వారా అధికారం, పదవులు రాధాకు దక్కకుండా పోయాయన్నది ఆయన వర్గం మాట. అదంతా ఒక ఎత్తయితే? ఇప్పుడు అధికార పార్టీలో ఉన్నాసరే? ఆయనకు పదవులు దక్కడం లేదన్న ఆవేదన పెరుగుతోందట వంగవీటి అభిమానుల్లో. తెలుగుదేశం పార్టీలో రాధా చేరినప్పుడు ఆయనపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు వచ్చినా ఖాతరు చేయలేదు. పార్టీకి స్టార్ క్యాంపెయినర్ గా ఎన్నికల్లో పనిచేశారు. ఈసారి గెలిచిన తర్వాత రాధాకు కచ్చితంగా ఎమ్మెల్సీ ఇస్తారని ఆశపడింది ఆయన వర్గం. అధిష్టానం కూడా అంతకు ముందే హామీ ఇచ్చిందని, ఈసారి పార్టీ అధికారంలోకి వస్తే రాధాను ఎమ్మెల్సీగా చూస్తామని ఆయన వర్గం వెయిట్ చేసింది. తనకు ఫలానా పదవి కావాలని రాధా ఎప్పుడూ అడగలేదని, ఆయనకు పదవుల మీద పెద్దగా వ్యామోహం లేదని అంటున్నా? మానేతను ఒక హోదాలో చూడాలన్నది వంగవీటి అభిమానుల ఆశగా చెప్పుకుంటున్నారు. ఆ మధ్య ఖాళీ అయిన ఎమ్మెల్సీ సీట్లలో ఛాన్స్ దక్కకపోవడంతో?మళ్ళీ అవకాశం రావాలంటే? 2027దాకా ఎదురు చూడక తప్పని పరిస్థితి. దీంతో ఇంకెన్నాళ్ళు ఈ వెయిటింగ్ అంటూ డీలా పడుతున్నారట మాజీ ఎమ్మెల్యే అనుచరులు. తమ నాయకుడికి పదవులపై ఆశ లేకపోయినా తాము మాత్రం ఆయన్ని చట్టసభలో చూడాలని కోరుతున్నామన్నది వాళ్ళ మాట. అందుకోసం 15 ఏళ్లుగా వెయిట్ చేస్తున్నామని, టీడీపీ అధిష్టానం ఇకనైనా గుర్తించి ఆయన స్థాయికి తగ్గ పదవి ఇవ్వాలని కోరుతున్నారట. ఇన్నాళ్ళు అవకాశం లేక వెయిటింగ్ లో ఉన్నామని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కూడా వెయిటింగ్ అంటే? ఇబ్బందేనంటూ మనసులో మాట బయట పెడుతోందట వంగవీటి అనుచరగణం. దీన్ని టీడీపీ అధిష్టానం ఎలా తీసుకుంటుందో చూడాలి మరి.

# సీఎంకు కొత్త హెలికాప్టర్



విజయవాడ, సెప్టెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భద్రతకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన కోసం అధికారులు కొత్త హెలికాప్టర్‌ను వాడుతున్నారు. సీఎం రెండు వారాలుగా జిల్లాల పర్యటనలకు ఈ కొత్త హెలికాప్టర్‌లోనే వెళ్తున్నారు. గతంలో ఉన్న పాత హెలికాప్టర్‌కు బదులుగా ఎయిర్‌బస్ హెచ్-160 మోడల్ హెలికాప్టర్‌ను ఎంచుకున్నారు. ఈ కొత్త హెలికాప్టర్ అధునాతన ఫీచర్లతో ఉంది. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ప్రయాణించడానికి అనువుగా ఉంటుందని నిపుణులు తెలిపారు. దీనివల్ల సమయం ఆదా అవుతుంది అంటున్నారు.గతంలో వాడుతున్న బెల్ తయారీ హెలికాప్టర్ చాలా పాతది అంటున్నారు. ఆ బెల్ హెలికాప్టర్ ఎక్కువ దూరం ప్రయాణించడానికి పనికి వచ్చేది కాదట. అందుకే కొత్త హెలికాప్టర్‌ను తీసుకున్నారు. పాత హెలికాప్టర్‌లో సీఎం ఉండవల్లిలోని తన నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి వెళ్లేవారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గమ్యస్థానానికి చేరకునేవారు. ఆ తర్వాత అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కార్యక్రమ వేదికకు వెళ్ళేవారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసం నుంచే హెలికాప్టర్‌లో నేరుగా జిల్లాల పర్యటనకు వెళు తున్నారు. దీనివల్ల చాలా సమయం కలిసి వస్తుందంటున్నారు. కొత్త హెలికాప్టర్‌లో పైలట్‌లతో పాటు ఆరుగురు ప్రయాణించవచ్చు. అలాగే ఇది రక్షణ పరంగా కూడా చాలా మంచిది అంటున్నారు. నిపుణులు ఈ హెలికాప్టర్‌ను ఎంచుకోవడానికి కారణం దాని ప్రత్యేక ఫీచర్లే అని చెబుతున్నారు. కొత్త హెలికాప్టర్ వల్ల సీఎం పర్యటనలు వేగంగా జరుగుతున్నాయని.. సమయం ఆదా అవుతుంది అంటున్నారు.ఉంటే.. దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ (విశాఖపట్నం రైల్వే జోన్ జీఎం) సందీప్ మాథుర్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ మేరకు అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసి కొత్త జోన్‌కు సంబంధించి అంశాలపై చర్చించారు. జోన్ కోసం జరుగుతున్న కసరత్తు.. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, రూపొందిస్తున్న డీపీఆర్‌ల గురించి సీఎంకు వివరించారు. ఈ క్రమంలో చంద్రబాబు కూడా కొత్త జోన్‌తో పాటూ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై ఆరా తీసినట్లు తెలుస్తోంది.

## ఎట్లుండె... ఎట్లాయ్యె...

హైదరాబాద్, సెప్టెంబర్ 5, శీర్షిక చదవగానే ఎక్కడో విన్నట్లు ఉంది కదా.. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ స్లోగన్ ‘ఎట్లుండె తెలంగాణ.. ఎట్లమారె తెలంగాణ’ను కాస్త మార్చాం. ఎందుకంటే ఇప్పుడు ఆ స్లోగన్ బీఆర్ఎస్‌కు సరిగ్గా సరిపోతుంది. పవర్ పాలిటిక్స్, ఆధిపత్యపోరు అంతర్గత కలహాలతో పార్టీ సతమతమవుతోంది. తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా ఉన్న పార్టీ, ఇప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో బలంగా ఉద్భవించి, దాదాపు ఒక దశాబ్దంపాటు అధికారంలో కొనసాగిన ఈ పార్టీ, ఇప్పుడు ఓటమి, నాయకుల బయటకు వెళ్లడం, కీలక నాయకుల దూరం వంటి సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. వీటికితోడు తాజాగా అంతర్గత కొట్లాటలు క్యాడర్‌లో అనేక అనుమానాలు, ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ 2001లో కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్)నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం ఏర్పడింది. తెలంగాణ ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన ఈ పార్టీ, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ వ్యూహాత్మక నాయకత్వం, హరీశ్‌రావు, కేటీఆర్, కవిత వంటి కుటుంబ సభ్యుల బలమైన మద్దతు, రాష్ట్ర ప్రజల ఆదరణతో బీఆర్ఎస్‌ను రాజకీయంగా బలమైన శక్తిగా మార్చాయి. 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలతో పార్టీ తన ఆధిపత్యాన్ని స్థిరపరిచింది. అయితే, ఈ విజయాల వెనుక కొన్ని సమస్యలు మొదలయ్యాయి. అధికారంలో ఉండగా, బీఆర్ఎస్‌పై వ్యతిరేకత పెరగడం, ఆరోపణలు, కొన్ని విధానాలపై విమర్శలు బలపడ్డాయి. ప్రజల అసంతృప్తి, ప్రతిపక్షాల బలోపేతం క్రమంగా బీఆర్ఎస్ బలాన్ని సన్నగిల్లేలా చేశాయి.2022లో కేసీఆర్ జాతీయ రాజకీయ ఆకాంక్షలతో టీఆర్ఎస్ పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్ )గా మార్చారు. ఈ నిర్ణయం పార్టీ దృష్టిని తెలంగాణ రాజకీయాల నుంచి జాతీయ స్థాయికి మళ్లించినప్పటికీ, ఇది తెలంగాణలోని స్థానిక సమస్యల నుంచి దృష్టిని మరల్చిందనే విమర్శలు వచ్చాయి. 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఊహించని ఓటమిని చవిచూసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గులాబీ పార్టీ రాజకీయ ఆధిపత్యం క్షీణించింది.2023 ఎన్నికల ఓటమి తర్వాత, బీఆర్ఎస్‌లో అస్థిరత మరింత పెరిగింది. పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరారు. ఇది పార్టీ బలాన్ని మరింత దెబ్బతీసింది. అంతేకాక, కేసీఆర్ కూతురు కవిత ఆధితప్యం కోసం పార్టీ విధానాలను తప్పు పట్టడం అగ్గి రాజేసింది. చివరకు హరీశ్‌రావు, సంతోష్‌రావు టార్గెట్‌గా చేసిన ఆరోపణలు పార్టీ నుంచి సస్పెండ్ చేసే వరకు వెళ్లాయి. కవిత, ఒకప్పుడు పార్టీలో ముఖ్యమైన నాయకురాలిగా ఉండేది. ఇప్పుడు ఆమె దూరం కావడం, ఒకవైపు కుటుంబంలోని అంతర్గత సమస్యలను సూచిస్తుండగా, మరోవైపు పార్టీలో నాయకత్వ సంక్షోభాన్ని స్పష్టం చేస్తోంది. ఈ పరిణామాలు ఆఖ యొక్క భవిష్యత్తుపై ఆందోళనలను పెంచాయి. దీంతో క్యాడర్‌లో కూడా కలవరం మొదలయ్యాయి. అధిష్టానంపై అనేక అనుమానాలు, ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి.

## విద్యుత్ షాక్ తో జాతీయ పక్షి నెమలి మృతి

జగిత్యాల బుగ్గారం మండల కేంద్రంలో విద్యుత్ షాక్ తో జాతీయ పక్షి నెమలి మృతి చెందిది. గ్రామ శివారులో విద్యుత్ పోల్ వద్ద నెమలి పైకి ఎగురుతుండగా పైన వున్న విద్యుత్ తీగలు రెక్కలకు తగిలి విద్యుత్ షాక్ కు గురయింది. గమనించిన గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని జాతీయ పక్షి కి పోస్టుమార్టం నిర్వహించి స్పైల్ (దహనం) చేశారు. నిన్నటి వరకు నిత్యం అటవీ నుండి గ్రామంలో కి వచ్చి గ్రామస్థులను , పాఠశాల విద్యార్థులను ఆనందం పంచిన జాతీయ పక్షి మృతితో విద్యార్థులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

# కర్మ రిటర్న్స్...

రాజకీయాలు చేయవచ్చు కానీ.. ప్రత్యర్థి పార్టీలు లేకుండా చేయాలని.. వాటిని నిర్వీర్యం చేయాలన్న ప్రయత్నం అత్యంత ప్రమాదకరం. అది వికటిస్తే ఏ స్థాయిలో ఉంటుందో ఇప్పుడు తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కు తెలుస్తోంది. సొంత కుమార్తె కవిత ఆరోపణలతో కెసిఆర్ పార్టీ ఇప్పుడు సతమతం అవుతోంది. ఆ పార్టీ అసలు తెలంగాణలో నిలబడుతుందా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గౌరవప్రదమైన సీట్లను సాధించింది కేసీఆర్ పార్టీ. కానీ అక్కడకు ఎనిమిది నెలల వ్యవధిలోనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కలేదు. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమా అని ఆ పార్టీలో ప్రకంపనలు రేగుతున్నాయి. ఒకవైపు పార్టీ పతనం అవుతుండగా.. మరోవైపు ఆ కుటుంబం సైతం ప్రజల్లో చులకన అవుతోంది. అయితే ఈ విషయంలో కెసిఆర్ మాదిరిగానే జగన్ పరిస్థితి ఉంది.తెలంగాణలో తెలుగుదేశం పార్టీకనుమరుగైతే తప్ప తన పార్టీ బతకదని కెసిఆర్ కు తెలుసు. పోనీ తన మాటను గౌరవించి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నైనా గౌరవంతో చూశారా అంటే అది లేదు. ఆ పార్టీని ఎంత దెబ్బతీయాలో అంతలా తీశారు. కాంగ్రెస్ పార్టీ నేతలతోనే కాంగ్రెస్కు వెన్నుపోటు పొడిపించిన ఘనత కూడా కెసిఆర్ కే దక్కుతుంది. అందుకే కర్మఫలం అనేది ఎవ్వరికీ విడిచిపెట్టదు. ఇప్పుడు కెసిఆర్ కు జరుగుతోంది అదే. ముందు ఆ పార్టీ బతుకుతుందా? లేదా? అన్నది చూడాలి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సైతం తెలుగుదేశం పార్టీని పూర్తిగా నాశనం చేయాలని చూశారు. ఆ పార్టీని దారుణంగా దెబ్బతీయాలని ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. చివరకు ఎన్టీఆర్ కూతురు, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ని నిండు సభలో అవమానించారు. తన సహచరులు దారుణ వ్యాఖ్యలు చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. అంతటితో ఆగకుండా చంద్రబాబును జైల్లో పెట్టించారు. అప్పటి కొందరు కేంద్ర పెద్దల సాయంతో తెలుగుదేశం పార్టీ లేకుండా చేయడానికి పన్నాగం పన్నారు. అయితే ఆయన ఒకటి తలిస్తే.. ప్రజలు ఒకటి తలచినట్టు.. తెలుగుదేశం పార్టీకి విజయం అందించి. జగన్మోహన్ రెడ్డి పన్నాగాన్ని తిప్పికొట్టారు ప్రజలు. అయితే ఇప్పుడు కర్మఫలం జగన్మోహన్ రెడ్డికి సైతం విడిచిపెట్టడం లేదు. ఏ పార్టీని నాశనం చేయాలని చూశారో.. ఏ కూటమి పార్టీలను తక్కువ చేసి మాట్లాడారో.. మీరు నా వెంట్రుక కూడా పీకలేరు అన్నారో.. ఇప్పుడు అదే జరిగింది. కర్మఫలం అనేది జగన్మోహన్ రెడ్డికి వెంటాడడం ప్రారంభించింది.తెలంగాణలో కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్.. ఏపీలో జగన్మోహన్ రెడ్డికి మద్యం కుంభకోణం.. ఈ రెండు ఇప్పుడు వెంటాడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో కాసులు కొల్లగొట్టారు నాటి పాలకులు. మద్యం కుంభకోణంలో 18 వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని పక్కకు తప్పించారు. అందుకే ఇప్పుడు ఏ పార్టీలు నిర్వీర్యం కావాలని కోరుకున్నారో.. ఇప్పుడు అదే పార్టీలు కర్మఫలం రూపంలో వెంటాడుతున్నాయి. కర్మ ఫలం అంటే ఇప్పుడు సరికొత్త నిర్వచనం గా కెసిఆర్, జగన్మోహన్ రెడ్డిలను చూపిస్తున్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ ప్రాంతీయ పార్టీల జోలికి పెద్దగా వెళ్లదు. తమ పార్టీలో విలీనం చేసుకునేందుకు ప్రయత్నించదు. అవసరమైన సమయంలో ప్రాంతీయ పార్టీలకు చెందిన రాజ్యసభ సభ్యులను తమ పార్టీకి చేర్చుకుంటుంది కానీ, దేశంలో ప్రాంతీయ పార్టీలను తనలో విలీనం చేసుకునే ప్రయత్నం చేయదు. ఎందుకంటే బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆ రాష్ట్రాల్లో ఎక్కువ శాతం ఓట్లు కలిగి ఉంటాయి. జాతీయ పార్టీలకు మించి ప్రాంతీయ పార్టీలకు ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంటుంది. అందుకే వాటిని భయపెట్టో, బతిమాలో తమకు మద్దతును తెచ్చుకునే ప్రయత్నం చేస్తుంది తప్ప విలీనం అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదన్నది ఇప్పటి వరకూ జరిగిన రాజకీయ పరిణామాలు చూసిన వారికి ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది... మహారాష్ట్రలో కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ వంటి సంస్థలతో భయపెట్టి శివసేనను చీల్చింది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీ జోలికి పోలేదు. ఇక ఢిల్లీలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై కేసులు బనాయించి జైల్లోకి తోసి ఢిల్లీలో అధికారంలోకి రాగలిగింది. అదే సమయంలో తమిళనాడులో డీఎంకే జోలికి కూడా పోలేదు. అక్కడ అన్నా డీఎంకేతో పొత్తు పెట్టుకుంది. ఇప్పుడు విజయ్ పార్టీతో పొత్తుకు ప్రయత్నిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోనూ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలతో కూటమితో ఉన్నప్పటికీ అక్కడ కూటమికి ప్రత్యర్థిగా ఉన్న జగన్ జోలికి బీజేపీ వెళ్లడం లేదు. జగన్ మద్దతు ఎప్పటికైనా తమకు అవసరమని భావించడంతోనే పదకొండు నెలల నుంచి జగన్ పై ఉన్న కేసులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తాజాగా తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని కూడా అదే రకంగా దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తుంది. అవసరమైతే పొత్తు పెట్టుకోవడం లేకుంటే తమకు అవసరమైన సమయంలో మద్దతు ఇచ్చేలా వ్యవహరిస్తుందే తప్ప తన పార్టీలో విలీనం చేసుకునే ప్రయత్నం చేయదు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలని బీజేపీ గట్టిగా భావిస్తుంది. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోమని ఇప్పటికే నేతలు స్పష్టం చేశారు. అవసరమైతే రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి రావడానికి అవసరమైన మద్దతు పొందేందుకు మాత్రమే ప్రయత్నిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో జగన్ ను కానీ, తెలంగాణలో కేసీఆర్ ను కాని బీజేపీ తమకు వ్యతిరేకంగా మలచుకోదు. జగన్, కేసీఆర్ లు కాంగ్రెస్ కు శత్రువులు కావడంతో తమకు మిత్రులుగానే చూడాలనుకుంటుంది. అదే బీజేపీ స్ట్రాటజీ. రానున్న కాలంలోనూ ఏపీ, తెలంగాణలలో అలాగే ఆ పార్టీ రాజకీయంగా అడుగులు వేయనుంది. అందుకే జగన్, కేసీఆర్ లకు వచ్చే ముప్పు లేదన్నది వాస్తవం

# లక్ష చీర గణపతి దర్శనాలు నిలిపివేత

విశాఖపట్నం భక్తి ముసుగులో వ్యాపారానికి తెర లేపిన నిర్వహుకులకి అధికారులు షాక్ ఇచ్చారు. లక్ష చీరల వస్త్ర గణపతి దర్శనాలు నిలిపివేసారు. లక్ష చీరల గాజువాక వస్త్ర గణపతి మండపం నిర్వహుకుల తీరు వివాదాస్పదంగా మారింది. భక్తీ ముసుగులో కమర్షియల్ టికెట్స్, చీరల కొనుగోలు చెయ్యడానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. పోలీసుల అదేశాలు పెడ చెవిన పెట్టి.. దర్శనం ఫీజు, పార్కింగ్ రుసుము, చీరల అమ్మకాలు జరిపారు నిర్వహకులు. భక్తుల భద్రత, సౌకర్యాల పాటించడంలో డొల్ల తనం ఉందని అధికారులు నోటీసులు జారీ చేసారు. భక్తుల భద్రతకి ప్రమాదం ఉన్న నేపథ్యంలో దర్శనాలు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. విద్యుత్ నిలిపి వేసి భక్తులని బయటకి పంపించేసారు

# కొత్త దశలోకి భారత్‌చైనా సంబంధాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత్‌పై ఒత్తిడి పెంచిన నేపథ్యంలో, భారత్?చైనా సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెడుతున్నాయి. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఉద్రిక్తతలతో నిండిన ఈ సంబంధాలు, ఇప్పుడు ఆర్థిక, రాజకీయ అవసరాల ఆధారంగా సానుకూల మార్పుల వైపు సాగుతున్నాయి. మరోవైపు భారత్‌కు అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కానీ మొదటి సమాధానం ట్రంప్ టారిఫ్ వారే చైనా?భారత్‌ను దగ్గర చేశాయి.ట్రంప్ పరిపాలన భారత్‌పై 50 శాతం వరకు టారిఫ్‌లను విధించడం, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను సాకుగా చూపడం ద్వారా భారత్?అమెరికా సంబంధాలకు గట్టి దెబ్బ తీసింది. ఈ టారిఫ్‌లు భారత ఎగుమతులు, ముఖ్యంగా వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా, భారత్ తన ఆర్థిక స్థిరత్వం కోసం చైనాతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. 2024 అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ, షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్-సీఓ) సమావేశాల్లో ఇరు దేశాల నాయకుల సమావేశం ఈ మార్పుకు నాంది పలికింది. అమెరికా ఒత్తిడి ఎదుర్కొనేందుకు భారత్, చైనా కలిసి నిలబడాలనే సందేశాన్ని ఈ సమావేశాలు ఇచ్చాయి. చైనా కూడా ఈ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ, భారత్‌తో సహకారాన్ని పెంచుకునే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో చైనా రాయబారి జు ఫీహాంగ్, ఇరు దేశాల స్నేహం ఆసియా, ప్రపంచ ఆర్థిక వృద్ధికి మేలు చేస్తుందని పేర్కొన్నారు.2020 గల్వాన్ లోయ ఘర్షణలో 20 మంది భారత సైనికులు, నలుగురు చైనా సైనికుల మరణం ఇరు దేశాల మధ్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీసింది. లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి ఇరు దేశాలు భారీగా సైన్యాన్ని మోహరించాయి, ఇది మూడు నాలుగేళ్లపాటు ఉద్రిక్తతలను కొనసాగించింది. అయితే, 2014 తర్వాత చైనా భారత భూభాగంలో ఒక్క అంగుళం కూడా స్వాధీనం చేసుకోలేదని, గల్వాన్, డోక్లాం వంటి ప్రాంతాల్లో భారత సైన్యం దృఢంగా నిలబడిందని గమనించాలి. ఇక 1962 భారత్?చైనా యుద్ధంలో చైనా అక్సాయ్ చిన్‌లో 30 వేల చ.కి.మీ భూమిని ఆక్రమించుకుంది. ఆ తర్వాత కూడా అనేక సందర్భాల్లో చైనా సరిహద్దు అతిక్రమణలకు పాల్పడింది. అయితే, ఇటీవలి కాలంలో చైనా యుద్ధం కాకుండా శాంతి, సహకారాన్ని కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది. 2024లో ఎస్‌సీవో సమావేశం తర్వాత చైనా సైనికులను ఉపసంహరించుకోవడం, కమాండెంట్ స్థాయి చర్చలు, విదేశాంగ మంత్రుల పరస్పర పర్యటనలు ఈ దిశలో సానుకూల సంకేతాలు.భారత ఆర్థిక స్థిరత్వం ఈ కొత్త విధానానికి పునాదిగా నిలుస్తోంది. 655 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు, 1% కన్నా తక్కువ జీడీపీ లోటు, నెలవారీ 68.7 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 2.4% రిటైల్ ఇన్‌ఫ్లేషన్, 8.9% సివిల్ ఉత్పాదక రంగ వృద్ధి, 7.8% స్టీల్ వినియోగం వంటి గణాంకాలు భారత్ యొక్క ఆర్థిక బలాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచంలో ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా, 81 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులతో భారత్ ఆర్థిక శక్తిగా ఉద్భవిస్తోంది. ఈ బలమైన ఆర్థిక నేపథ్యంలో భారత్ యుద్ధాన్ని కోరుకోవడం లేదు. అదే సమయంలో, చైనాతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా చైనాపై ఆధారపడటాన్ని తగ్గించింది. గల్వాన్ ఘటన తర్వాత నీటిలో కరిగే ఎరువుల తయారీ టెక్నాలజీని అభివృద్ధి చేసుకోవడం ద్వారా చైనా నుంచి ఎరువుల దిగుమతులను గణనీయంగా తగ్గించింది.భారత్ చైనాతో సంబంధాలను మెరుగుపరుచుకుంటున్నప్పటికీ, పూర్తిగా నమ్మడం లేదు. 1962 యుద్ధం, నెహ్రూ హయాంలో చైనా దురాక్రమణలు, టిబెట్ విషయంలో అనుమానాలు వంటి గత అనుభవాల నేపథ్యంలో భారత్ అతి జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రతిపాదించిన ఎనిమిది సూత్రాలు సరిహద్దు ఒప్పందాలకు కట్టుబడటం, ఎల్‌ఏసీని గౌరవించడం, శాంతి కొనసాగించడం చైనాతో సంబంధాలను నిర్వహించడంలో భారత్ యొక్క వ్యూహాత్మక దృష్టిని చూపిస్తున్నాయి. అదే సమయంలో, భారత్ అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకు రష్యా, చైనా, జపాన్ వంటి దేశాలతో వాణిజ్య, రాజకీయ సంబంధాలను బలోపేతం చేస్తోంది. జపాన్‌తో 10 బిలియన్ డాలర్ల వాణిజ్య ఒప్పందం, బుల్లెట్ రైలు చర్చలు, ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య ఒప్పందాలు భారత్ యొక్క బహుముఖ విధానాన్ని సూచిస్తున్నాయి. ఈ వ్యూహం ద్వారా భారత్ చైనాకు దగ్గరవుతూనే, దాని ఆధిపత్యానికి లొంగకుండా, అమెరికా ఒత్తిడిని తట్టుకునే సమతూక విధానాన్ని అవలంబిస్తోంది.

# సమాజంలో అధ్యాపకుల పాత్ర కీలకమైనది ఎమ్మెల్యే శ్రీ గణేష్

సికింద్రాబాద్ సమాజంలో విద్యార్థులకు పాఠాలు నేర్పే అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమైనదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో కంటోన్మెంట్ లోని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలకు చెందిన అధ్యాపకులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులతో పాటు ప్రస్తుతం విధులలో ఉన్న ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు వారి సేవలను గుర్తించి ప్రశంస పత్రంతో పాటు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ భావితరాలకు విద్యను అందించే ఉపాధ్యాయులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అన్ని పాఠశాలలో ప్రవేశపెట్టి అందరికీ సాంకేతికత పట్ల మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించాలని కోరారు. పాఠశాల పూర్తయిన అనంతరం బస్తీలలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా విద్యార్థులను ప్రోత్సహించనునట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ సమాజానికి ఉపాధ్యాయులుగా తాము చేస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్యే శ్రీ గణేష్ సన్మానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రోత్సాహం ఉంటే ముమ్ముందు మరిన్ని నూతన కార్యక్రమాలు తీసుకుంటామని అధ్యాపకులు తెలిపారు.

# కవిత ఒంటరి



హైదరాబాద్, సెప్టెంబర్ 5, భారత రాష్ట్ర సమితి చరిత్రలో మహిళా నాయకులు ఎప్పుడు కూడా ఇంత ఐక్యంగా లేరు. నా మీద సస్పెన్షన్ తర్వాత మహిళా నేతలు అందరూ కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సంతోషం. ఇదే నేను కోరుకుంటున్నది. అధ్యక్షుడికి.. కింది స్థాయి కార్యకర్తకు యాక్సిస్ ఉండాలని భావిస్తున్నాను. ఇప్పటికైనా మహిళా నేతలను గుర్తించారు" ఇవీ బుధవారం నాటి విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు.. నిన్నటి విలేకరుల సమావేశంలో ఒంటరిగానే కవిత మాట్లాడారు. యాదృచ్ఛికంగా ఆమెను ఒంటరి చేసే ప్రయత్నాలను గులాబీ పార్టీ విజయవంతంగా చేపడుతోంది. గురువారం హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో గతంలో జాగృతిలో పనిచేసిన వారంతా కవితకు వ్యతిరేకంగా మాట్లాడారు. మేడే రాజీవ్ సాగర్, రాజారామ్ యాదవ్, ప్రశాంత్ వంటి వారు తీవ్ర స్వరంతో కవితను విమర్శించారు. వీరంతా కూడా తెలంగాణ జాగృతిలో కీలకంగా పనిచేశారు. గడచిన 18 సంవత్సరాలుగా వీరంతా కూడా కవిత వెన్నంటే ఉన్నారు. ఎప్పుడైతే కవిత భారత రాష్ట్ర సమితిలో ఉన్న కీలక నాయకుల మీద ఆరోపణలు చేయడం.. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఒక్కసారిగా వీరంతా విలేకరుల సమావేశం ద్వారా అసలు విషయాలను బయటపెట్టారు.. తామంతా గులాబీ పార్టీలోనే ఉంటామని.. కెసిఆర్ తోనే కొనసాగుతామని.. కారు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. దీనికి తోడు కవిత చేసిన వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రస్తావించారు."ఇన్ని రోజులపాటు మేము మీతో పాటు ప్రయాణం చేశాం. ఎన్నడైనా మీరు మా గురించి అడిగారా.. మా గురించి పట్టించుకున్నారా.. మేము ఏం తిన్నాం.. ఎలా ఉన్నాం.. అని అడిగారా లేదు కదా.. అలాంటప్పుడు మిమ్మల్ని కల్వకుంట్ల తారకరామారావు ఎందుకు అడగాలి.. మీ గురించి ఎందుకు పట్టించుకోవాలని" జాగృతి నేతలు ప్రశ్నించారు.కవిత చేసిన వ్యాఖ్యలతో ఒక రకంగా భారత రాష్ట్ర సమితి రాజకీయంగా ఇబ్బందికరమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నది. సోషల్ మీడియాలో కాంగ్రెస్, బిజెపి నాయకులు గులాబీ పార్టీని తీవ్రంగా విమర్శిస్తున్నారు. కవితకు సంఘీభావంగా మాట్లాడుతున్నారు. దీంతో గులాబీ పార్టీ పెద్దలు రంగంలోకి దిగి కవితకు అండగా ఉన్న వారందరినీ కూడా బయటకు పిలిపించి మాట్లాడించారు. ఆమెకు వ్యతిరేక స్వరం వినిపించేలా చేశారు. మొత్తంగా ఆమెను ఒంటరి చేసే ప్రయత్నాన్ని విజయవంతంగా అమలు చేశారు. ఇటీవల జాగృతికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని కవిత ఎంపిక చేసిన క్రమంలో.. వీరందరికీ కూడా స్థానం లభించలేదు. బహుశా అందువల్లే కవిత మీద విమర్శలు చేస్తున్నారని జాగృతి నాయకులు అంటున్నారు.. కీలక నాయకులు కవితకు వ్యతిరేకంగా స్వరం వినిపించిన నేపథ్యంలో.. జాగృతి అధినాయకురాలు ఎలాంటి అడుగులు వేస్తారు.. గులాబీ పార్టీ పెద్దల కుట్రలను ఎలా తిప్పి కొడతారు.. అనే ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది.

## కారు పార్టీని ఇబ్బందుల్లో పెట్టిన కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 5, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. కవిత రేపు పార్టీకి, ఎమ్మెల్సీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కల్వకుంట్ల కవిత కారు పార్టీని రాజకీయంగా పూర్తిగా ఇబ్బందుల్లోకి నెట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిలో హరీశ్ రావు, సంతోష్ రావు ప్రమేయం ఉందని, తన తండ్రి నిర్దోషి అని చెప్పేందుకు కవిత ప్రయత్నం చేశారు. అయితే కల్వకుంట్ల కవిత కేసీఆర్ పై నెగిటివ్ కామెంట్స్ చేయకపోయినా ఆయనకే సూటిగా ఈ విమర్శలు తాకే అవకాశముంది. అది చిన్న పిల్లవాడికైనా అర్థమవుతుంది. కేసీఆర్ ప్రమేయం లేకుండా హరీశ్ రావు, సంతోష్ రావులు అవినీతికి పాల్పడి, వేల కోట్లు సంపాదించుకున్నారని, అక్రమంగా ఆస్తులు కూడబెట్టారంటే నమ్మేవారు ఎవరూ లేరు. ఎందుకంటే గతపదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కు తెలియకుండా ఏమీ జరగదన్న విషయం అందరికీ తెలుసు.కల్వకుంట్ల కవిత మాత్రం తన తండ్రి మంచోడని, వాళ్లిద్దరే విలన్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేసి కేసీఆర్ ను కూడా ఈ వివాదంలోకి లాగేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న సమయంలో కవిత చేసిన వ్యాఖ్యలు పార్టీని ఖచ్చితంగా ఇబ్బందుల్లోకి పడేస్తాయనే చెప్పాలి. పార్టీ నేతగా మాత్రమే కాదు.. కేసీఆర్ కుమార్తెగా కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు జనంలోకి నేరుగా వెళతాయి. అసెంబ్లీ సమావేశాల్లో హరీశ్ రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని కవిత దానిపై నీళ్లు కుమ్మరించినట్లయింది. ఇప్పుడు తెలంగాణ సమాజం కూడా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఖచ్చితంగా నమ్ముతుంది. అది కేసీఆర్ చేశారా? హరీశ్ రావు చేశారా. సంతోష్ రావు చేశారా? అన్నది పక్కన పెట్టి బీఆర్ఎస్ చేసిందన్నది మాత్రం అందరికీ అర్థమయింది. అందువల్లనే కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.ఇన్నాళ్లూ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలు రాజకీయపరమైనవిగా జనానికి చెప్పుకునే ఛాన్స్ ఇప్పుడు కారు పార్టీ కోల్పోయిందనే చెప్పాలి. కవిత తన వ్యక్తిగత కక్షలతో పార్టీని రాజకీయ ఇబ్బందుల్లోకి నెట్టిందనే చెప్పాలి. కవిత ఏం ఆశించి... ఎందుకు ఆగ్రహించి ఈ విమర్శలు చేసినా ఏతావాతా నష్టపోయేది పార్టీ మాత్రమే. అది అందరికీ తెలుసు. కవితపై ఒకవేళ పార్టీ చర్య తీసుకున్నప్పటికీ అప్పటికే జరగాల్సి నష్టం పార్టీకి దారుణంగా జరిగిపోయింది. గత కొన్నాళు ్లగా కవిత చేస్తున్న వ్యాఖ్యలు పార్టీని ఇబ్బందిపెడుతున్న కాళేశ్వరం పై చేసిన కామెంట్స్ తో ఇక కోలుకోలేని దెబ్బతీసిందని గులాబీ పార్టీ కార్యకర్తలే వాపోతున్నారు. కవిత వరసగా తన కుటంబ సభ్యులను, కేసీఆర్ చుట్టూ ఉన్న వారిని టార్గెట్ చేయడంతో ఆ అపఖ్రథ పెద్దాయనకు కూడా చుట్టుకుని పార్టీకి భవిష్యత్ లేకుండా కవిత చేస్తున్నారన్న అభిప్రాయం పార్టీలో బలంగా వినపడుతుంది. . కల్వకుంట్ల కవితపై సస్పెన్షన్ వేటు వేయడం అంటే బహిష్కరణ కాదు. పార్టీ నుంచి పూర్తిగా బయటకు పంపలేదు. తిరిగి కల్వకుంట్ల కవిత నేతలతో సయోధ్య కుదుర్చుకుని పార్టీలోకి వస్తానంటే తీసుకునేందుకు వీలుగా కవితపై సస్పెన్షన్ వేటు వేశారు. గతంలో టీఆర్ఎస్ గా ఉన్నప్పుడు, బీఆర్ఎస్ గా మారిన తర్వాత సస్పెన్షన్ అనే మాట వినిపించలేదు. అందరినీ బహిష్కరించడమే. ఆలె నరేందర్, విజయశాంతి, ఈటల రాజేందర్ వరకూ అందరూ బహిష్కరణకు గురయిన వారే. అయితే పేగు బంధం కవితపై బహిష్కరణ వేటు పడకుండా సస్పెన్షన్ వేటుతోనే సరిపెట్టింది. అంటే కల్వకుంట్ల కవిత మళ్లీ కారు పార్టీలోకి రారన్న గ్యారంటీ అంటూ ఏమీ లేదు. తాత్కాలికంగా పార్టీలో తలెత్తుతున్న సంక్షోభాన్ని రూపుమాపడానికే కల్వకుంట్ల కవితప సస్సెన్షన్ తో సరిపెట్టారన్న కామెంట్స్ అన్ని పార్టీల నుంచి వినిపిస్తున్నయి.

# ఆదివారం రాజన్న ఆలయం మూసివేత

రాజన్న సిరిసిల్ల ఈనెల 7న సంభవించనున్న చంద్రగ్రహణం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ అర్చకులు అధికారులు తెలిపారు. 7వ తేదీ ఆదివారం ఉదయం 11.25 గంటల నుంచి 8వ తేది సోమవారం తెల్లవారు జామున 3.45 గంటల వరకు ఆలయ మూసివేయనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆదివారం ఉదయం శ్రీస్వామి వారికి మహా నివేదన సమర్పించిన అనంతరం 11.30 గంటలకు ఆలయం మూసివేసి, గ్రహణ మోక్షం అనంతరం తెల్లవారుజామున 3.45 గంటలకు ఆలయ సంప్రోక్షణ ఆలయ శుద్ధి, స్వామివారికి ప్రాతఃకాల పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతిస్తామని, ఈ రెండు రోజులపాటు భక్తుల ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటల 56 నిమిషాలకు ప్రారంభమై 1:26 నిమిషాల వరకు దాదాపు మూడున్నర గంటల పాటు రాహు గ్రస్త చంద్రగ్రహణం ఉంటుందని, శతభిష, పూర్వాభాద్ర నక్షత్రం, కుంభ రాశి వారు గ్రహణాన్ని చూడకూడదని గ్రహణ మోక్ష అనంతరం దానాలు నిర్వహించాలని, పిల్లలు వృద్ధులు, గర్భిణీలు జాగ్రత్తలు పాటించాలని ఆలయ అర్చకులు తెలిపారు.

# సామాజిక తెలంగాణ సాధ్యమా

హైదరాబాద్, సెప్టెంబర్ 5,తెలంగాణ రాజకీయాల్లో గత పాతికేళ్లలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొన్ని రాజకీయ పరిణామాలు సరికొత్త శకానికి తెరలేపగా, మరికొన్ని టీ కప్పులో తుపాను మాదిరి సమసిపోయాయి. పాతికేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో టీడీపీ పార్టీ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి సరికొత్త రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. అదే మాదిరిగా ఇప్పుడు ఆయన కుమార్తె కవిత, తండ్రి స్థాపించిన భారతీయ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చి, ఆయన మార్గంలోనే నడుస్తూ కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తారా అనే చర్చ మొదలైంది. కేసీఆర్ ప్రస్థానం ఉద్యమపరంగా, రాజకీయపరంగా ఒక చరిత్ర సృష్టించింది. అదే రీతిలో కల్వకుంట్ల కవిత ప్రస్థానం తెలంగాణ రాజకీయాల్లో ఎలా ఉండనుందనే చర్చ నడుస్తోంది. వీరిద్దరి రాజీనామాల పర్వానికి దారితీసిన పరిస్థితులపై ఈ కథనం విశ్లేషిస్తుంది. 2001 వరకు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలుగుదేశం పార్టీలో ఒక సాధారణ నేతగా మాత్రమే గుర్తింపు పొందారు. అయితే తన రాజకీయ సామర్థ్యంతో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్ వంటి పదవులను అలంకరించారు. పార్టీలో తనకు తగిన గుర్తింపు లభించలేదన్న భావన, మంత్రి పదవి ఇవ్వలేదన్న ఆగ్రహంతోనే కేసీఆర్ టీడీపీ సభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేశారని కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతారు. మరికొందరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పదవులను త్యాగం చేశారని అంటారు. ఏది ఏమైనప్పటికీ, టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి, 2001లో కేసీఆర్ తెలంగాణ సాధనే తన లక్ష్యమని ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారు. అప్పటి నుంచి ఆయన ఉద్యమ కార్యాచరణలో, ఎన్నికల రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. ఆ తర్వాత 2014 నుంచి 2023 వరకు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించారు. ఇలా ఆనాడు కేసీఆర్ టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసిన తర్వాత తన రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చవి చూసినా తెలంగాణ రాజకీయాల్లో తనదైన చరిత్రను లిఖించుకున్నారు.అమెరికాలో ఉన్న కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత 2006లో తెలంగాణ రాజకీయాల్లో అడుగుపెట్టారు. అదే ఏడాది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అనే లక్ష్యంతో తెలంగాణ జాగృతి అనే సంస్థను స్థాపించారు. బతుకమ్మ పండుగను తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేయడంలో ఆమె కృషి చేశారు. 2006 నుంచి తెలంగాణ వచ్చే వరకు అంటే 2014 వరకూ అనేక ఉద్యమ కార్యాచరణలలో ఆమె భాగస్వామిగా ఉన్నారు. 2014లో నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు.

ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఉంటూనే ఇటీవలే పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు.పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం, పార్టీ లైన్కు భిన్నంగా తెలంగాణ జాగృతి పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం వంటివి ఆమె చేశారు. అయితే పార్టీ సీనియర్ లీడర్ హరీశ్ రావు, మరో కీలక నేత సంతోష్ రావు తనపై కుట్రలు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతికి వారే కారకులని సంచలన ఆరోపణలు చేశారు. దీంతో పార్టీ అధ్యక్షుడు, తండ్రి అయిన కేసీఆర్ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ఆమె తన పదవులకు రాజీనామా చేశారు. ఇక తన కార్యాచరణ తనది అని ఆమె మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.ఆనాడు కేసీఆర్ రాజీనామా వ్యవహారం, ఈనాడు కవిత రాజీనామా వ్యవహారం చూస్తే, ఇద్దరూ మరో కొత్త రాజకీయానికి తెరలేపేందుకే అన్న పోలిక స్పష్టంగా తెలుస్తోంది. ఆనాడు కేసీఆర్ టీడీపీలో అవమానాలు భరించలేక, పార్టీలో గుర్తింపు లభించకపోవడం, మంత్రి పదవిని ఇవ్వకపోవడం వంటి కారణాల వల్ల టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసినట్లు చెబుతారు. కవిత కూడా అదే రీతిలో పార్టీలో అంతర్గత సంక్షోభం, నాయకత్వంపై ఆగ్రహంతోను, తనకు సరైన గుర్తింపు ఇవ్వకుండా కుట్రలు చేస్తున్నారన్న కారణాల వల్లే బీఆర్ఎస్కు రాజీనామా చేయడం జరిగిందని తెలుస్తోంది.అయితే ఆనాడు కేసీఆర్కు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అనే ఒక స్పష్టమైన లక్ష్యం ఉంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆయన రాజీనామా నిర్ణయం తీసుకోవడం వల్ల కొత్త పార్టీ పెట్టి లక్ష్యాన్ని సాధించగలిగారు.

కవిత తన భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టత ఇవ్వకపోయినా, 'సామాజిక తెలంగాణ' అనే లక్ష్యం పెట్టుకుని పని చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. తన తండ్రి మాదిరిగానే పార్టీని స్థాపించి, ఆ పార్టీ ద్వారా సామాజిక తెలంగాణ అంటే అన్ని వర్గాల వారికి సమాన వాటా అనే నినాదంతో ముఖ్యంగా బీసీ వర్గాలను ఆకట్టుకునేలా కార్యాచరణ ఉంటుందని తెలుస్తోంది. అయితే తండ్రి బాటలో నడిచి ఆమె సక్సెస్ అవుతారా, ప్రజలు కవిత రాజకీయ ప్రస్థానానికి మద్దతుగా నిలుస్తారా లేదా అన్నది మాత్రం వేచి చూడాలి.

# ఆందోళనలో రైతులు..

వరంగల్, సెప్టెంబర్ 5, యూరియా కోసం రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. యూరియా కోసం గంటల తరబడి లైన్ లో వేచివున్న రైతులకు యూరియా లేదని చెప్పడంతో కోపోద్రిక్తులయ్యారు. ఆగ్రహంతో ఎరువులు అమ్మే షాపుపై దాడి చేశారు. రాళ్ల వర్షం కురిపించారు. అంతేకాకుండా ఆ షాపు గోదాంలో ఉంచిన యూరియా బస్తాలను ఎత్తుకెళ్లారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గ్రోమోర్ షాపు ముందు యూరియా కోసం సుమారు 4 వందల మంది ఉదయం నుంచి వేచి చూస్తున్నారు. తమ వంతు ఎప్పుడు వస్తుందా అని ఆశగా నిద్రాహారాలు మానేసి షాపు ఎదుటే నిలబడి ఉన్నారు. అయితే సాయంత్రానికి యూరయా అయిపోయిందని గ్రోమోర్ షాపు యజమాని మూసేసి వెళ్లిపోయాడు. ఉదయం నుంచి కాళ్లు వాచిపోయేలా నిలబడి ఉన్న రైతులు ఆ మాట విన్నాక ఆగ్రహంతో ఊగిపోయారు. ఎరువులు లేవని చెప్పడం ఏంటని నిలదీశారు. కోపాన్ని పట్టలేని రైతులు కొందరు షాపుపై రాళ్ల దాడి చేశారు. షాపు ఎదుట ఉన్న చెక్కలకు నిప్పు పెట్టారు. ఇన్ని చేసిన ఆగ్రహం చల్లారని రైతులు షాపునకు అనుబంధంగా ఉన్న గోదాంపై దాడి చేశారు. అందులో ఉన్న ఎరువుల బస్తాలు మోసుకెళ్లారు. పరిస్థితి చేయిదాటిపోయందని గ్రహించిన షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు రంగప్రవేశం చేశారు. గోదాం నుంచి ఎరువులు ఎత్తుకెళ్లిపోతున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇటు రైతులు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు సీరియస్ యాక్షన్కు దిగారు. ఉద్రిక్తతను తగ్గించేందుకు కొందు పోలీసులు రైతులతో మాట్లాడి వారిని శాంతింపజేయడంతో వివాదం ముగిసింది. భాగంగా గోదాంలో ఉన్న యూరియా పంపిణీ చేస్తామని రైతులకు పోలీసులు హామీ ఇచ్చారు. దీంతో అప్పటికప్పుడు రైతులను క్యూలో నిలబెట్టి ఒక్కోరైతుకు ఒక్కో బస్తా పంపిణీ చేశారు.

**సీఎం కామెంట్స్**

యూరియా కొరతపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు. యూరియా కొరతపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. యూరియా పంపిణీపై రాష్ట్రంలో అసత్య ప్రచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. 'రైతులు చాలా సేపు లైన్ లో నిలబడి అలిసిపోతున్నారు.. అసలు యూరియానే లేదని చెబుతున్నారు. రాష్ట్రంలో యూరియా సరిపడా అందుబాటులో ఉంది. అయితే అందరూ ఒకే దగ్గర ఉండేసరికి లైన్ పెద్దగా ఉంటుంది. క్యూలో చివర ఉన్న వాడికి యూరియా పంపిణీ చేయాలంటే 8 గంటల సమయం పడుతుంది. ఆ 8 గంటలు లైన్ లో నిలబడలేక సహనం లేక ధర్నాలకు దిగుతున్నారు. యూరియా కేంద్రం వద్ద ఉన్న రైతులను కొంత మంది కావాలనే తీసుకెళ్లి, రోడ్డుపై కూర్చోపెడుతున్నారు. ధర్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# కల్వకుంట్ల పొయో...దేవనపల్లి వచ్చె

హైదరాబాద్, సెప్టెంబర్ 5, మారిన కవిత ఇంటిపేరు! రాజకీయాలు క్రూరమైనవి. తేడా వస్తే తల్లి, తండ్రి, మామ, కూతురు, అల్లుడు ఏవీ గుర్తుకు రావు. ప్రయోజనాలు ఒక్కటే ప్రధానం. రాజకీయాలు క్రూరమైనవి. తేడా వస్తే తల్లి, తండ్రి, మామ, కూతురు, అల్లుడు ఏవీ గుర్తుకు రావు. ప్రయోజనాలు ఒక్కటే ప్రధానం. బీఆర్ఎస్కు కొరకరాని కొయ్యగా మారిన కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవిత, సొంత పార్టీ శ్రేణులకు టార్గెట్ అయ్యారు. రాజకీయ ప్రత్యర్థుల అస్త్రాలను అందిస్తూ, పార్టీని బద్నాం చేస్తోందని కవితపై బీఆర్ఎస్ కార్యకర్తలు , నాయకులు రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల నాడు కవితను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. ఆ మరుసటి రోజు బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవికి ఆమె రాజీనామా చేశారు.

దీంతో ఆమెకు బీఆర్ఎస్తో సంబంధాలు తెగిపోయాయి. ఇదే సందర్భంలో కల్వకుట్ల కవిత ఇంటి పేరును కూడా బీఆర్ఎస్ మార్చేసింది. దేవనపల్లి కవిత అని ఆమెను పిలవడం ఆసక్తికర పరిణామం. కవిత భర్త అనిల్కుమార్ ఇంటిపేరు దేవనపల్లి. ఇంతకాలం కవిత తన పుట్టింటి ద్వారా సంక్రమించిన ఇంటిపేరుతోనే రాజకీయంగా పాపులర్ అయ్యారు. అయితే కుటుంబ సభ్యులతో ఏర్పడిన విభేదాలు కాస్త, రాజకీయ రంగు పులుము కోవడంతో అటు వైపు నుంచి కూడా అదే రేంజ్లో ఎదురు దాడికి దిగుతున్నారు. అందుకే కవితకు కల్వకుంట్ల ఇంటి పేరుకు సంబంధం లేదని ప్రచారం మొదలు పెట్టారు. ఇకపై మెట్టినింటి ఇంటిపేరుతోనే రాజకీయంగా ఏదైనా చూసుకోవాలని బీఆర్ఎస్ అభిప్రాయం. వైఎస్ జగన్తో రాజకీయంగా విభేదించిన షర్మిల విషయంలోనూ వైసీపీ ఇదే స్టాండ్ తీసుకున్న సంగతి తెలిసిందే. షర్మిల భర్త అనిల్కుమార్ ఇంటి పేరు మొరుసుపల్లి. అయితే షర్మిల మాత్రం తన తండ్రి వైఎస్సార్ పేరు ప్రతిష్టలను వాడుకుంటున్నారు. షర్మిల రాజకీయ అడుగులు తమ నాయకుడు జగన్కు నష్టం తెస్తుండడంతో ఆమెతో వైఎస్సార్ కుటుంబానికి సంబంధం లేదని వైసీపీ నాయకులు, కార్యకర్తలు అంటున్న మాట.

అందుకే ఆమె వైఎస్ షర్మిల కాదు?మొరుసుపల్లి అని వైసీపీ శ్రేణులు చెప్పడం.బీఆర్ఎస్ కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత తన ట్విట్టర్ హ్యాండిల్ లో కూడా ఆ మార్పులు చేశారు. ఇంతకు ముందు ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అని పెట్టుకున్న కవిత ఇప్పుడు వాటిని తీసేశారు. కేవలం మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు అని పెట్టుకున్నారు. అదే విధంగా ట్విట్టర్ అకౌంట్ లో బీఆర్ఎస్ లోగోను కూడా తీసేశారు. ఎడుమ వైపు ఉన్న కారు గుర్తును తొలగించారు కల్వకుంట్ల కవిత. మూడు రోజులు క్రితం కవిత మీడియా సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.. వ్యాఖ్యలు చేసిన అనంతరం బీఆర్ఎస్ సంచలన నిర్ణయం తీసుకోవడం.. మళ్లీ కవిత కొత్త విషయాలు చెప్పడం అన్నీ రెండు రోజుల గ్యాప్ ల్లోనే అయిపోయాయి. ముందుగా కేసీఆర్ బద్నాం కావడానికి కారణం ఇద్దరు, ముగ్గురే కారణం అని చెప్పింది.. 'హరీష్ రావు, సంతోష్ రావు, మెగా కృష్ణా రెడ్డి వల్లే కేసీఆర్ ఇన్ని మాటలు పడుతున్నారు. నా మీద కూడా అనేక ఆరోపణలు చేశారు. కానీ నేను వాటిని తట్టుకుని నిలబడ్డాను. హరీష్ రావు, సంతోష్ లు అవినీతి అనకొండలు.

కేసీఆర్ చుట్టూ అవినీతి అనకొండలు చేరి మరకలంటిస్తున్నారు' అని ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. అన్నంత పనే చేసిందిగా.. ఇద్దరి ఇరిగేషన్ అధికారుల వద్ద వందల కోట్లు దొరికాయని కూడా కవిత ఆరోపణలు చేశారు. 'అధికారుల వెనుక ఎవరున్నారో దర్యాప్తు చేయండి.. కాళేశ్వరం అవినీతిలో హరీష్ రావు పాత్ర లేదా..? అందుకే హరీష్ ను ఇరిగేషన్ మంత్రిగా తొలగించారు.. వాళ్ల స్వార్థం కోసమే అవనీతికి పాల్పడ్డారు' అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పై సీబీఐ కేసుల దాకా వచ్చాక పార్టీ ఉంటే ఎంత, పోతే ఎంత? అని కూడా మాట్లాడారు. ఇప్పుడు అన్నట్టుగానే బీఆర్ఎస్ పేరు, లోగోను ట్విట్టర్ నుంచి తీసేశారు

# మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ మా లక్ష్యం

**యువ తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతుంది**

**విద్యారంగంపై ఊహించని రీతిలో పెట్టుబడులు**

**ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**










తెలంగాణ రైజింగ్– 2047, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ యువ రాష్ట్రం వేగంగా పరుగులు తీస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (%ఙంఎ%)లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవం అనంతరం ప్రసంగించారు. యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడుతుంది రాష్ట్ర అభివృద్ధికి ISB విద్యార్థులు సహకరించాలని డిప్యూటీ సీఎం కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ఎవరు ఊహించని రీతిలో పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. విద్య పై పెట్టుబడి రాష్ట్ర నిర్మాణానికి ఉపయోగపడుతుందని ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా భావిస్తుందని వివరించారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తి గా ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నాం అన్నారు. 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాల నిర్మిస్తున్నాం, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణం ప్రారంభించినట్టు వివరించారు. విద్యార్థులు కళాశాల బయటికి వెళ్ళగానే ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ ఎలా ఉండాలి అనేది పారిశ్రామికవేత్తలతో మాట్లాడి డిజైన్ చేసినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చాకలి ఐలమ్మ పేరిట మహిళా యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆనంద్ మహీంద్రా వంటి దిగ్గజాన్ని చైర్మన్ గా నియమించి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ఐ ఎస్ బి నిర్వాహకులు స్కిల్ యూనివర్సిటీని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ను సందర్శించి వాటికి అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం కోరారు. అవి ప్రారంభ దశలో ఉన్నందున ఇప్పుడు ఐ ఎస్ బి నుంచి సూచనలు అందితే అది రాష్ట్ర భవిష్యత్తుకు ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఐ ఎస్ బి విద్యార్థులు గొప్ప అదృష్టవంతులు ఒక్కో తరగతి గది 1.50 కోట్ల నుంచి రెండు కోట్ల వరకు వెచ్చించి నిర్మించారు. తాను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సింగిల్ టీచర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకున్నానని, రాసుకునేందుకు పలకలు కూడా లేక పోవడంతో మా గురువులు ఇసుక పైనే అక్షరాలు దిద్దిన సందర్భాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. గురుపూజ దినోత్సవం రోజు ఐ ఎస్ బి వంటి గొప్ప విద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభించుకోవడం అభినందనీయం అన్నారు. తాను ఈ స్థానానికి రావడానికి కృషి చేసిన గురువర్యులందరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో, ఆశయాలు మరియు ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచే మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం తనకు గౌరవంగా, సంతోషంగా ఉంది అన్నారు. ఈ రోజు మనం కేవలం దాతృత్వాన్ని కాదు, దానిని మించే ఒక భావాన్ని సాక్షాత్కరిస్తున్నాం అన్నారు..

మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ఇచ్చిన సహకారం ఒక విరాళం మాత్రమే కాదు, అది జ్ఞానం, నాయకత్వం, మరియు మన సమిష్టి భవిష్యత్తుపై ఉంచిన విశ్వాసానికి ప్రతీక అన్నారు. మనం తరచూ ప్రభుత్వాలు రోడ్లు కడతాయి అంటాం, కానీ దూరదృష్టి ఉన్న దాతృత్వం మాత్రం నేర్చుకునే ద్వారాలను నిర్మిస్తుంది. అలాంటి ద్వారం మన ముందుకు తెరిచినందుకు మోతీలాల్ ఓస్వాల్ కు ధన్యవాదాలు తెలిపారు. %ఙూదీ% అనేది అలాంటి ద్వారాల ప్రభావానికి సజీవ సాక్ష్యం.

వయస్సులో చిన్నదే అయినా, ఖ్యాతిలో విశిష్ట స్థానంలో నిలిచింది.

ఇది ప్రపంచ స్థాయిని, స్థానిక సందర్భాన్ని సమన్వయం చేసిందనీ వివరించారు.

ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ అనేది అక్షరాభ్యాసం కాదు, అది నమ్మకాన్ని పదును పెట్టడం, ప్రతిసారి నేర్చుకుంటూ అమలు చేసే చక్రాన్ని ఆపకుండా ఉంచడం అన్నారు.

ఇక్కడికి వచ్చే నాయకులు కేవలం సమకాలీనంగా ఉండరు, చాలా సార్లు వారు కొత్త దిశను చూపిస్తారు అన్నారు.

గత ఒక్క సంవత్సరంలోనే %ఙూదీ% దాదాపు 200 ప్రోగ్రాముల ద్వారా 6,000 మందికి పైగా ప్రొఫెషనల్స్‌ను శిక్షణ ఇవ్వడం గొప్ప విషయం అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం %ఙూదీ% నీ ఒక విద్యాసంస్థ గానే కాదు, భాగస్వామి గా చూస్తుందని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య అధికారులకు శిక్షణ ఇవ్వడం నుండి, చేతివృత్తులు, ఎన్నికలు లేదా మెట్రో రైలు వంటి రంగాలపై స్వతంత్ర అధ్యయనాలు నిర్వహించడం వరకు, %ఙూదీ% తన పరిశోధన ద్వారా విధానాలను ఎలా మలచవచ్చో చూపిందనీ తెలిపారు. ముఖ్యంగా, సెంటర్ ఫర్ అనలిటికల్ ఫైనాన్స్ మాతో కలిసి "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వామ్యం అవుతోంది, ఽమూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు మా ప్రయాణం.

విధానాన్ని హామీగా, హామీని పురోగతిగా మార్చుకుంటూ ముందుకు సాగుతున్నాం అని డిప్యూటీ సీఎం వివరించారు.

ఇవాళ మనం విఘాతం (disruption) సాధారణం అయ్యిన కాలంలో జీవిస్తున్నాం, డిజిటలైజేషన్, సస్టైనబిలిటీ, సమానమైన వృద్ధి. ఇవి ఏవీ ఒంటరిగా పరిష్కరించలేం అన్నారు.

ప్రభుత్వం విధానాన్ని, దృష్టిని ఇస్తుంది, పరిశ్రమ వనరులు, అమలు ఇస్తుంది, విద్యాసంస్థలు జ్ఞానం, పరిశోధన ఇస్తాయి, ఈ మూడూ కలిసినప్పుడు మాత్రమే నిజమైన పరివర్తన సాధ్యం అవుతుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు.

అందుకే ఈ కొత్త ఎగ్జిక్యూటివ్ సెంటర్ ఒక భవనం మాత్రమే కాదు, ఇది క్లాస్‌రూమ్‌లు, బోర్డు రూమ్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు కలిసే ఒక కుళాయిలా (crucible) మారి, ఆలోచనలను పరిష్కారాలుగా మలిచే స్థలం అవుతుందనీ విశ్వాసం వ్యక్తం చేశారు. తదుపరి దశాబ్దం భారతదేశానికి నిర్ణాయకం.

తెలంగాణ %ఙూదీ% వంటి సంస్థలతో, యంగ్ ఇండియా వంటి కార్యక్రమాలతో మార్పులో భాగమవడమే కాకుండా, దానికి నాయకత్వం వహించాలని సంకల్పించిందన్నారు.

దాదాపు 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ సెంటర్, లెక్చర్ హాల్స్, చర్చా స్థలాలు, మౌనంగా ఆలోచించడానికి మూలలు, ఆ ఆశయానికి ఓ నంగరంలా నిలుస్తుందన్నారు.

ఈ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సందర్భంలో, సహకారం అనే కొత్త యుగాన్ని కూడా ప్రారంభిద్దాం, రాష్ట్రం, విద్యాసంస్థలు, పరిశ్రమ కలిసి భారతదేశ భవిష్యత్తును మలచే మార్గంలో పయనిద్దాం అని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ దారిలో ధృఢ నిశ్చయంతో నడుస్తుందనీ తెలిపారు.

విద్య అనేది కేవలం ప్రొఫెషనల్స్ తయారు చేయడమే కాకుండా, సమాజం కోసం, మానవత్వం కోసం నాయకులను తీర్చిదిద్దాలన్నది మా ప్రజా ప్రభుత్వ సంకల్పం అని తెలిపారు.

ఈ సెంటర్ భవిష్యత్ తరాలకు దిక్సూచి ఇలా మారి, వారిని అగ్రగామిత్వం, సమానత్వం, ఆవిష్కరణల వైపు దారి చూపాలని కోరుకుంటున్నాను అన్నారు.

స్కిల్స్ యూనివర్సిటీ ఇప్పటికే ప్రారంభమై, తొలి సంవత్సరంలోనే వందలాది విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది.

2025 నాటికి దాని శాశ్వత కాంపస్ "ఫ్యూచర్ సిటీ"లో ఏర్పడుతుంది.

అలాగే, మొదటి దశలో 58 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ?11,000 కోట్లకు పైగా పెట్టుబడితో, విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దడానికి, అకాడమిక్ నుంచి పోటీ పరీక్షల వరకు నిర్మితమవుతున్నాయి.

మీ సహకారంమార్గదర్శకత్వం, నిధులు లేదా భాగస్వామ్యం రూపంలో వాటి ప్రభావాన్ని మరింత పెంచి, ఈ రోజు మనం జరుపుకుంటున్న రాష్ట్రనిర్మాణం (%ఖ్‌అశీఅ–ఎబఙశ్రీఎఅఙఅస్త్ర%) భావనను మరింత విస్తరించగలదనీ డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సెంటర్ మనకు ఒక సత్యాన్ని గుర్తు చేస్తుంది, ఎంత సీనియర్ అయినా నేర్చుకోవడం ఆగదు.

కొన్నిసార్లు, ఉత్తమ నాయకులు అంటే ఉత్తమ విద్యార్థులే అని డిప్యూటీ సీఎం వివరించారు.

ఈ సెంటర్ కేవలం MBA\T, CEOలు మాత్రమే కాకుండా భారతదేశం గర్వపడేలా సమస్యలకు పరిష్కారాలు కనుగొనే వ్యక్తులను తయారు చేయాలి అన్నారు.

నేర్చుకోవడం ఎప్పటికీ ముగియదని మనకు గుర్తు చేస్తే, తాను కూడా ఐ ఎస్ బి లో విద్యార్థిగా అడ్మిషన్ తీసుకోవాలని భావిస్తున్నానని %ఙంఎ %డీన్ మదన్ గమనించాలన్నారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం నేర్చుకోవడానికి ఇష్టపడతారని, రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు %ఙూదీ% లో ఐదు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను డిప్యూటీ సీఎం కోరారు. కార్యక్రమంలో మోతిలాల్ ఓస్వాల్ డీన్ మదన్ పిల్లుట్ల, ప్రభాత్ సిన్హా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# సీబీఐ కేసు తేలేనా...

# బీజేపీ కోర్టులోకి బంతిని నెత్తిన రేవంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 5, ఇటీవల కాలంలో రాష్ట్రమంతా కాళేశ్వరం ప్రాజెక్టు, కేసీఆర్, హరీశ్‌రావు పేర్లు విస్తృతంగా వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ద్వారా విచారణ చేపట్టి, ఆ కమిషన్ నివేదికపై అసెంబ్లీలోనూ చర్చ జరపడమే. చర్చ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోని లోపాలు, అవినీతి ఆరోపణలు, జరి గిన అవకతవకలను బయటపెట్టేందుకు కేసును సీబీఐకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభు త్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కానీ దర్యాప్తు చేపట్టే సీబీఐపైనే పెదవి విరుపులు కనిపిస్తున్నాయి. గత కొన్ని ఏళ్లుగా సీబీఐ చేపట్టిన కేసులు, శిక్షా రేటు, నేర నిరూపణ వంటి అంశాలు ఈ నిర్లిప్తతకు కారణం అవుతున్నాయి. సీబీఐ పనితీరు రోజురోజుకీ నిరాశాజనకంగా ఉంటోందనే వాదన వినిపిస్తోంది. అవినీతి కట్టడికి ప్రతి రాష్ట్రంలో ఏసీబీ ఉన్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఉండాలనే ఉద్దేశంతో సంక్లిష్టమైన, హైప్రొఫైల్ కేసుల్ని సీబీఐకి అప్పగిస్తూ వస్తున్నారు. కానీ గత రెండు దశాబ్దాలుగా కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా సీబీఐకి మాత్రం చెడ్డపేరు వస్తున్నది. సీబీఐ గణాంకాలు పరిశీలిస్తే ఆ సంస్థ ఛేదించిన కేసుల కంటే, పెండింగ్ కేసులే అధికంగా ఉన్నాయని స్పష్టమవుతున్నది. సీబీఐ దర్యాప్తు చేస్తున్న 7,072 అవినీతి కేసుల విచారణ వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 379 కేసులు 20 సంవత్సరాలకు పైగా ఉన్నాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) తాజా వార్షిక నివేదిక తెలిపింది. డిసెంబర్ 31, 2024 నాటికి మొ త్తం కేసుల్లో 1,506 కేసులు మూడు సంవత్సరాల కంటే తక్కువ కాలం, 791 కేసులు మూడు నుంచి ఐదు ఏళ్ల మధ్య, 2,115 కేసు లు ఐదు నుంచి 10 ఏళ్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. 2,281 అవినీతి కేసు లు 10 నుంచి 20 ఏళ్లుగా, 379 కేసులు 20 ఏళ్ల కంటే ఎక్కువ కాలం విచారణ పెండింగ్‌లో ఉన్నాయని యాంటీ కరప్షన్ వాచ్ డాగ్ ఇటీవల విడుదల చేసిన నివేదిక తెలిపింది. నివేదిక ప్రకారం సీబీఐ, నిందితులు దాఖలు చేసిన 13,100 అప్పీళ్లు వివిధ హైకోర్టులు, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నా యి. వీటిలో 606 అప్పీళ్లు 20 ఏళ్లకు పైగా, 1,227 అప్పీళ్లు 15 నుంచి 20 ఏళ్లు, 2,989 అప్పీళ్లు 10 నుంచి 15 ఏళ్లు, 4,059 అప్పీళ్లు ఐదు నుంచి 10 ఏళ్లు, 1,778 అప్పీళ్లు రెండు నుంచి ఐదు ఏళ్లు, 2,441 అప్పీళ్లు రెండేళ్ల లోపు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. 2024లో 644 కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. వీటిలో 392 కేసుల్లో దోషులు, 154 కేసుల్లో నిర్దోషులుగా తేలారు. 21 కేసులను డిస్‌ఛార్జ్ చేయగా, 77 కేసులను ఇతర కారణాలతో కొట్టివేసినట్టు తెలిపింది. 2024 చివరి నాటికి, అవినీతియేతర కేసులు సహా 11,384 కోర్టు కేసులు వివిధ కోర్టులలో విచారణలో పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టం చేసింది. 2024లో సీబీఐ 807 కేసులు నమోదు చేసిందని, వాటిలో 674 సాధారణ కేసులు కాగా, 133 ప్రాథమిక విచార ణలు ఉన్నాయని సీవీసీ నివేదిక పేర్కొంది. 807 కేసుల్లో 111 కేసులు న్యాయస్థానాల ఆదేశాల మేరకు, 61 కేసులు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చి న సూచనల ఆధారంగా విచారణ చేపట్టినట్టు తెలిపింది. 2024లో 1,005 కేసుల్లో సీబీఐ దర్యాప్తు పూర్తి చేయగా ఏడాది చివరినాటికి మొత్తం 832 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది.

డిసెంబర్ 31, 2024 నాటికి సీబీఐ నమోదు చేసిన మొ త్తం 529 అవినీతి కేసులు దర్యాప్తు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 56 కేసులు ఐదేళ్లకు పైగా, 60 కేసులు మూడేళ్లకుపైగా, 64 కేసు లు రెండేళ్లకుపైగా, 64 కేసులు మూడేళ్లకుపైగా, 108 కేసులు ఏడాది నుంచి రెండేళ్ల లోపు, 241 కేసులు ఏడాది కంటే తక్కువ కా లంగా పెండింగ్‌లో ఉన్నాయి.

సీబీఐతో పాటు ఈడీని కుడా రాజకీయ జోక్యం లేకుండా స్వయం ప్రతిపత్తి గల సం స్థలుగా తీర్చిదిద్దనంతవరకు ఆ సంస్థలు ప్ర త్యర్థి రాజకీయ నాయకులపై చేసే దాడులు, పెట్టే కేసులపై అనేక అనుమానాలు, ప్రశ్నలు వస్తూనే ఉంటాయి. సీబీఐ విచారించిన కేసు ల్లో 2021 నాటికి శిక్షా రేటు 60 శాతంగా ఉంది. ఈ శిక్షా రేటు 2010కి ముందు 70 శాతం వరకు ఉండేది. మద్రాస్ హైకోర్టుకు సమర్పించిన సమాచారాన్ని బట్టి సీబీఐ పెట్టిన కేసుల్లో 40 శాతం కూడా నేర నిరూపణ కాలేదు. సీబీఐ నేరారోపణ చేసినట్ల యతే నేరం నిరూపించాల్సిన బాధ్యత సీబీఐపైనే ఉంటుంది. కానీ సగం కేసుల్లో కూడా నేర నిరూపణ చేయకపోవడం గమనార్హం. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నేరం ఆరోపిస్తుంది. ఆరోపణలు ఎదుర్కొనే వ్యక్తి తాను నిర్దోషినని నిరూపించుకోవాలి. కానీ ఈడీకి నేర నిరూపణ బాధ్యత ఉండదు. లో క్‌సభలో ఆర్థికశాఖ సహాయ మంత్రి చెప్పిన వివరాల ప్రకారం 2004– మధ్యకాలం లో 112 ఈడీ సోదాలు జరిగాయి. వీటిలో రూ. 5,346.16 కోట్ల ఆస్తులను అటాచ్ చేశా రు. 104 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు నమోదయ్యాయి. కానీ మోడీ హయాంలో 2014– 22 మధ్యకాలంలో ఏకంగా 2,974 సోదా లు జరిగాయి. రూ. 95,432.08 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంట్లు, 839 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు నమోదైనట్టు గణాంకాలు చెబు తున్నాయి. సీబీఐ గత పదేళ్లలో టేకప్ చేసి న కేసుల్లో అధిక శాతం కొలిక్కిరాకపోవడం కూడా దర్యాప్తు సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసింది. సీబీఐ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ ఓ కేసు విషయం లో ఘర్షణ పడటం సీబీఐని మరిం త భ్రష్టు పట్టించింది. కోల్ స్కామ్, కామన్వెల్త్ స్కామ్ వంటి చాలా కేసు లు ఇంకా తేలలేదు. కేవలం కేసుల నమోదు సమయంలో సెన్సేషనే తప్ప.. ఫలితం మాత్రం వెలువడటం లేదు. సీబీఐకి చిత్తం వచ్చినట్టుగా దర్యాప్తు వేగవంతం చేయడం, ఇష్టం లేకపోతే కేసులు సాగదీయటం లాం టి ధోరణులు కూడా విమర్శలకు కారణమవుతున్నాయి. సీబీఐ కేసు లు నమోదు చేసినంత స్థాయిలో శిక్ష లు పడకపోడవం ఆ సంస్థ విశ్వసనీయతకు భంగం కలిగిస్తోంది.

కేంద్రం లో అధికారంలో ఉన్నవారి ఆదేశాల మేరకు విచారణ చేసే తీరు కూడా సీబీఐకి తలవంపులు తెచ్చింది. లక్ష ల కోట్ల కుంభకోణం జరిగిపోయిం ది.. దేశ సంపద లూటీ చేశారనే సం చలన ఆరోపణలతో కేసులు నమో దు చేసే సీబీఐ, ఏళ్ల తరబడి విచారణ సాగదీసి.. కొండను తవ్వి ఎలు కను పడుతోంది. గతంలో సీబీఐ దర్యాపులంటే అవినీతిపరుల్లో భ యం ఉండేది. కానీ ఇప్పుడు సీబీఐని మేనేజ్ చేయడానికి చాలా పద్ధతులున్నాయన్న దుస్థితి వచ్చిం ది. సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు పారదర్శకంగా ఉండాలి. కానీ స్వ యం ప్రతి పత్తి గల సంస్థలపై అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఆధిపత్యం ప్రదర్శించాలని చూడ టం వాటికి చెడపేరు తెస్తున్నది. కేసులను దర్యాప్తు చేయడంలో సీబీ ఐ అవలంభిస్తున్న జాప్యం చేసే ధోరణిపై సర్వత్రా అనుమానాలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కాళేశ్వరం అవినీతి కేసు ను సీబీఐకి అప్పగించింది. ప్రాజెక్టు స్థలం మార్పు, నిర్మాణ వ్యయాన్ని ఏకంగా లక్ష కోట్లకుపైగా పెంచిన నేపథ్యంలో దీనిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటి పారుదల శాఖ మం త్రి హరీష్‌రావు ప్రధాన నిందితులుగా ఉన్నారు. వాస్తవానికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కో ల్పోవడానికి కాళేశ్వరం ప్రాజెక్టులోని బ రాజ్ కుంగుబాటే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో 2028 అసెంబ్లీ ఎన్నికల లో పు కాళేశ్వరం అవినీతిపై దర్యాప్తు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. కానీ సీబీఐ దర్యాప్తులో జరిగే జాప్యం పరిశీలిస్తే అంత త్వరగా కాళేశ్వరం కేసు దర్యా ప్తు పూర్తి అవుతుందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జనరల్ కన్సెంట్‌ను ఎత్తేసి మరీ సీబీఐని రాష్ట్రంలోకి ఆహ్వానించి కాళేశ్వరం కేసు అప్పగించింది. ఈ క్రమంలో సీబీఐ కేసు దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయడంపై దృష్టి సారిస్తుందో, లేదో చూడాలి. అయి తే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై కమిషన్ వేసి విచారణ జరిపించింది. కేసును సీబీఐకి అప్పగించింది.

దర్యాప్తు పూర్తిచేసి దోషులను బయటపెడితే కాంగ్రెస్‌కు రాజకీయంగా కలిసి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఆ రకమైన అవకాశం ఇవ్వడానికి కేంద్రంలోని బీజేపీ సిద్ధంగా లేనిపక్షంలో సీబీఐ దర్యాప్తులో తప్పనిసరిగా జాప్యం జరుగుతుంది. ఈ క్రమంలో నిందితులుగా భావిస్తున్న వారు తప్పించుకునే అవకాశం ఉన్నది. దీంతో కాళేశ్వరం కేసులో సీబీఐ దర్యాప్తు తీరుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ప్రభుత్వ విద్య గురించి మాట్లాడితే ఏపీ గురించి మాట్లాడాలి

**అందరం కలిసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను సాకారం చేద్దాం**

**నేను స్టాన్ ఫోర్డ్ వరకు వెళ్లానంటే దానికి కారణం నా ఉపాధ్యాయులు**

**ప్రభుత్వ పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డులు పెట్టారంటే కారణం ఉపాధ్యాయులే**

**లీప్(LEAP) మోడల్ ను పకడ్బందీగా అమలుచేయాలి**

**డీఎస్సీ అంటే చంద్రబాబు గారు.. చంద్రబాబు గారంటే డీఎస్సీ**

**గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు వైన్ షాపుల ముందు కాపలా కాసే పరిస్థితి**

**విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన గురుపూజోత్సవంలో మంత్రి నారా లోకేష్**

**సీఎం చంద్రబాబు గారితో కలిసి 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేత**





విజయవాడః ప్రభుత్వ విద్య గురించి మాట్లాడితే ఏపీ గురించి మాట్లాడాలని, అందరం కలిసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను సాకారం చేద్దామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మానవ వనరులు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన గురుపూజోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడు గారితో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. సీఎం గారితో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. నా లైఫ్ టీచర్ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులందరికీ నమస్కారం. ఈ రోజు ఈ కార్యక్రమం ఏర్పాటుచేశామంటే ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించే కార్యక్రమం. ఈ వేడుకలో పాల్గొన్న మీ అందరికీ పేరుపేరునా నమస్కారాలు. మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ. తల్లీ దైవం, తండ్రీ దైవం, గురువు కూడా దైవమే. గురువులకే గురువు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా విద్యావ్యవస్థకు, దేశానికి ఆయన అందించిన సేవలు స్మరించుకుందాం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చెప్పినట్టు The true teachers are those who help us think for ourselves అనేది గురువులంతా ఆచరిస్తే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ మిషన్ (లీప్) సక్సెస్ అవుతుంది.

చదువు ఒక వ్యక్తిని పేదరికం నుంచి బయటకు తీసుకువస్తుంది

ఒక చిన్న కథ చెబుతాను..ఇది నిజంగా జరిగిన కథ. పందొమ్మిదేళ్ళ యువకుడు 50 ఏళ్ల వ్యక్తికి డ్రైవరుగా వచ్చాడు. కారులో వెళ్తుండగా ఏం చదివావు అని అడిగాడు పెద్దాయన.. టెన్త్ ఇంగ్లీషులో ఫెయిలయ్యాను అని చెప్పాడు డ్రైవర్. నేను హెల్ప్ చేస్తాను పాసవ్వాలి అని చెప్పి... ఆఫీసు అయ్యాక ఆ డ్రైవరుకి ఇంగ్లీషు పాఠాలు చెప్పాడు ఆ పెద్దాయన. టెన్త్ పాసైన డ్రైవరుకి ఇంటర్ ఫీజు కట్టి పుస్తకాలిచ్చాడు. ఆఫీసు అయ్యాక డ్రైవరు ఇంటర్ పుస్తకాలు, పెద్దాయన లైబ్రరీ పుస్తకాలు పోటా పోటీగా చదివేవారు. ఇంటర్ అయ్యింది.. ఈ సారి బీఏ టార్గెట్. అదీ కంప్లీట్ అయింది. పీజీ చెయ్ అన్నాడాయన. డ్రైవరు ఆలోచించాడు. తనను చదివిస్తున్న వ్యక్తి గ్రాడ్యుయేట్. పోస్ట్ గ్రాడ్యుయేషన్ అంటే అతన్ని దాటిపోతానేమో అని భయపడ్డాడు. పెద్దాయన డ్రైవరుకి విమానం టిక్కెట్టు కొని మరీ పరీక్షలకు పంపాడు. గొప్ప గురువులెప్పుడూ తమ శిష్యులు తమకంటే పైకి ఎదగాలని కోరుకుంటారు. టెన్త్ పోయిన ఆ అబ్బాయి పీహెచ్ డీ పూర్తి చేశారు.. ఆ గొప్ప గురువు మిస్సైల్ మేన్ అబ్దుల్ కలాం గారు. ఆ డ్రైవర్ పేరు కదిరేశన్. చదువు ఒక వ్యక్తిని పేదరికం నుంచి బయటకు తీసుకువస్తుంది అనేందుకు ఇదో ఉదాహరణ. %Teaching is a very noble profession that shapes the character, caliber, and future of an individual. If the people remember me as a good teacher, that will be the biggest honour for me% nq• %A.P.J.Abdul Kalam% గారి స్ఫూర్తితో పనిచేస్తున్న గురువులందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నాను..

నేను స్టాన్ ఫోర్డ్ వరకు వెళ్లానంటే దానికి కారణం నా ఉపాధ్యాయులు

మిమ్మల్ని చూసిన తరువాత నాకు నా స్కూల్ డేస్ గుర్తొచ్చాయి. నేను స్టూడెంట్ గా ఉన్నప్పుడు బాగా అల్లరి చేసే వాడిని. మాది రౌడీ, గోల బ్యాచ్. మేం బ్యాంక్ బెంచర్స్. బ్యాక్ బెంచ్ నుండి స్టాన్ ఫోర్డ్ వరకూ వెళ్ళానంటే అందుకు కారణం గురువులు చూపించిన దారి. నన్ను తీర్చిదిద్దింది మంజులా మేడమ్ గారు, ప్రిన్సిపల్ రమాదేవి గారు. ఆ తర్వాత పి.నారాయణ గారు, ప్రొఫెసర్ రాజిరెడ్డి గారు. ఈ రోజు విద్యాశాఖ మంత్రిగా మీ ముందు ఉన్నానంటే కారణం ఈ నలుగురు. నేను మొదట గౌరవించేది నా తల్లి గారిని, తర్వాత ఉపాధ్యాయులను. నేను విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత బెస్ట్ టీచింగ్ ప్రాక్టీసెస్ అమలు చేస్తున్న టీచర్లను వారానికి ఒకరిని పిలిచి షైనింగ్ టీచర్ పేరుతో వారిని గౌరవిస్తున్నాను. వారి నుంచి బెస్ట్ ప్రాక్టీసెస్ తెలుసుకుంటున్నాను.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలనే పిలుపునకు టీచర్లు అద్భుతంగా స్పందించారు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి అని నేను ఇచ్చిన పిలుపుకు ఉపాధ్యాయులు స్పందించిన తీరు అద్భుతం. కొంతమంది టీచర్లు స్కూటర్ కు మైక్ కట్టుకొని ఊరిలో ఉన్న అన్ని వీధులు తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం చేశారు. ఒక మహిళా టీచర్ మాట్లాడిన మాటలు నాకు చాలా బాగా గుర్తుండిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు పిల్లలను ఎందుకు చేర్చాలి అని ఒక జర్నలిస్టు మహిళా టీచర్ ను అడిగారు. ఆమె చెప్పిన సమాధానం.. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే తల్లితండ్రులకు జీరో ఇన్వెస్ట్మెంట్.. హై రిటర్న్స్ అన్నారు ఆమె. ఎలా అని ప్రశ్నించారు ఆ జర్నలిస్ట్. ప్రైవేట్ స్కూల్ లో చేర్పిస్తే ఫీజు కట్టాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజు జీరో అన్నారు. ప్రైవేట్ స్కూల్ లో యూనిఫామ్, టై, బెల్ట్, షూస్, టెక్ట్స్ బుక్స్, నోట్స్ అన్నింటికీ డబ్బులు కట్టాలి. అదే గవర్నమెంట్ స్కూల్ లో అయితే యూనిఫామ్, టై, బెల్ట్, షూస్, టెక్ట్స్ బుక్స్, నోట్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అన్నీ ఫ్రీ. అంతే కాదు మా దగ్గర క్వాలిఫైడ్ అండ్ క్వాలిటీ టీచర్లు ఉంటారని ఆమె గర్వంగా చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డులు పెట్టారంటే కారణం ఉపాధ్యాయులే

చంద్రబాబు గారి నాయకత్వంలో చరిత్రలో మొదటిసారి కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్లు బోర్డులు పెట్టారు. ఇందుకు కారణం ఇక్కడున్న ఉపాధ్యాయులు. ముఖ్యమంత్రి గారితో పనిచేయడం అంత తేలిక కాదు. ఎప్పుడూ లేనివిధంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాం. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, విద్యార్థులను అనుసంధానం చేశాం. చాలా మంది నేను విద్యాశాఖ మంత్రి అవుతున్నానంటే అవసరమా అని చెప్పారు. ఛాలెంజ్ అంటే చాలా ఇష్టం అని వారికి చెప్పా. గడిచిన ఏడాదిలో విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చాం. మీ అందరితో చర్చించే తీసుకువచ్చాం. అన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం లేదు. మీ స్వరం విన్న తర్వాతనే సంస్కరణలు తీసుకువచ్చాం. మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయి. వచ్చే నాలుగేళ్లు సంస్కరణలు ఉండవు.

లీప్ మోడల్ ను పకడ్బందీగా అమలుచేయాలని కోరుతున్నా

ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్(%ౌజూ్ఱా%)లీప్ మోడల్ ను పకడ్బందీగా మీరు అమలుచేయాలని కోరుతున్నా. కరిక్యులమ్ లో అనేక మార్పులు తీసుకువచ్చాం. ప్రైమరీ స్కూల్స్ లో తరగతికో ఉపాధ్యాయుడు విధానం తీసుకువచ్చాం. 9,600 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుచేశాం. సెమిస్టర్ వైజ్ టెక్ట్స్ బుక్స్ ను అందిస్తున్నాం. ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి యోగా, ఎన్ సీసీ, ఎన్ ఎస్ఎస్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వ విద్యలో రాజకీయాలను దూరంగా పెట్టాం. ఇక్కడున్న బోర్డులో సీఎం ఫోటో కూడా లేదు. పిల్లల యూనిఫామ్స్, పుస్తకాల్లో రాజకీయ నేతలు ఫోటోలు లేవు. వివిధ కార్యక్రమాలకు గొప్ప వాళ్ల పేర్లు పెట్టాం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పెట్టాం. కడప జిల్లాలో కలెక్టర్ గారి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం కోసం సెంట్రలైజ్డ్ కిచెన్ మోడల్ ప్రారంభించాం. రాబోయే రోజుల్లో అద్భుతమైన న్యూట్రిషియస్ ఫుడ్ అందించేలా ముందుకు వెళ్తున్నాం.

డీఎస్సీ అంటే చంద్రబాబు గారు.. చంద్రబాబు గారంటే డీఎస్సీ

పారదర్శకంగా టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తీసుకువచ్చాం. మొదటి సారి సీనియర్ లిస్ట్ ఫిక్స్ చేశాం. ఎప్పుడూ లేనివిధంగా ప్రమోషన్లు కల్పించాం. సుమారు 80శాతం మంది ఉపాధ్యాయులు చంద్రబాబు గారి హయాంలో నియమితులైన వారేనని బలంగా నమ్ముతున్నాను. డీఎస్సీ అంటే చంద్రబాబు గారు.. చంద్రబాబు గారంటే డీఎస్సీ. 13 డీఎస్సీ ల ద్వారా లక్షా 80వేల మంది ఉపాధ్యాయులను నియమించారు. మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేశారు. యువకుడిని, విద్యావంతుడిని. కానీ డీఎస్సీ అంటే ఎంత ఛాలెంజింగ్ మీ అందరికీ తెలుసు. డీఎస్సీ విషయంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా ఏడాదిలోనే పూర్తిచేయడం చాలా కష్టమైన పని. చంద్రబాబు గారి డైరెక్షన్ లో పూర్తిచేయడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులను కూడా అభినందిస్తున్నా. గతంలో ఇచ్చిన అన్ని డీఎస్సీ నోటిఫికేషన్లు చదవాలని చెప్పా. డీఎస్సీ ఆగకూడదని చెప్పా. ఇప్పటికే దాదాపు 70 కేసులు నమోదయ్యాయి. కానీ డీఎస్సీ ఎక్కడా ఆగలేదు. సెప్టెంబర్ లో 16,347 మంది ఉపాధ్యాయులు టీచింగ్ కు వస్తారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా పాఠ్యాంశాలు రూపకల్పన

చాగంటి కోటేశ్వరరావు గారి నాయకత్వంలో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా పాఠ్యాంశాలు రూపొందించడం జరిగింది. ఇంటర్ లో కరిక్యులమ్ రీవ్యాంప్ చేయడం జరిగింది. ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతోంది. యూనివర్సిటీల్లో నియామకాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది పూర్తిచేస్తాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో ఆంధ్రా యూనివర్సిటీ గతంలో 7వ స్థానం నుంచి ఇప్పుడు 4వ స్థానానికి చేరుకుంది. స్టేట్ యూనివర్సిటీ కోటాలో ఫస్ట్ ర్యాంక్ వచ్చే దిశగా పనిచేస్తాం. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కరిక్యులమ్ మెరుగుపర్చాలి. స్థానికంగా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు లింక్ చేయాలని సీఎం గారు చెప్పారు. ఆ దిశగా ప్రయాణిస్తున్నాం.

గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు వైన్ షాపుల ముందు కాపలా కాసే పరిస్థితి

ఇక్కడున్న ఉపాధ్యాయులు కూడా ఆలోచించాలి. 2019 నుంచి 2024 వరకు ఒక విచిత్రమైన పాలన చూశాం. ప్రతి రోజూ కొత్త సంస్కరణ తీసుకురావడం వల్ల దాదాపు 12 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరం అయ్యారు. న్యాస్, ఏఎస్ఆర్ నివేదికలో కూడా లెర్నింగ్ అవుట్ కమ్స్ లో వెనుకబడిన పరిస్థితి. ఉపాధ్యాయులు ఏకంగా వైన్ షాపుల ముందు కాపలా కాసే పరిస్థితి. ఉపాధ్యాయ బదిలీల విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. ఉపాధ్యాయులను ఎలక్షన్ డ్యూటీ తప్పించాలని గత ప్రభుత్వం ప్రయత్నించింది. ఇన్ని కష్టాలను ఎదుర్కొని.. ఆంధ్ర రాష్ట్రంలో అద్భుత ఫలితాలు రాబోతున్నాయని మొత్తం దేశం మనవైపు చూసేవిధంగా మీరు చేసినందుకు ఉపాధ్యాయులందరికీ నా ధన్యవాదాలు.

గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ పై దృష్టి పెట్టాలి

మంత్రిగా మీ ముందు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం నా ఉపాధ్యాయులు. అందుకే ఉపాధ్యాయులను కొన్ని విషయాలను కోరాలనుకుంటున్నాను. మొదటిది గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్. మన పిల్లలకు మ్యాథ్స్, లాంగ్వేజెస్ లో బేసిక్స్ రావాల్సిన అవసరం ఉంది. నేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. న్యాస్, అసర్ నివేదిక చూస్తే.. జాతీయ సగటు కంటే ఏపీ తక్కువగా ఉంది. ఇందులో చాలా ఇంప్రూవ్ కావాల్సిన అవసరం ఉంది. బ్రిడ్జి కోర్సుల వల్ల నేను చాలా నేర్చుకున్నాను. పిల్లలకు కూడా బ్రిడ్జ్ కోర్సు చాలా అవసరం. దీనివల్ల ఈ ఎవాల్యూషన్ లో కూడా టాప్ -3 రాష్ట్రాల్లో ఏపీ నిలబడాలని, ఇందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరుతున్నాను.

ప్రభుత్వ విద్య గురించి మాట్లాడితే ఏపీ గురించి మాట్లాడాలి

పోటీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పెద్దఎత్తున ర్యాంకులు సాధించాలి. మనకు అద్భుతమైన ఉపాధ్యాయులు ఉన్నారు. కంటెంట్, మెటీరియల్ ఇస్తాం. మనకు వచ్చే పిల్లలు నిరుపేద కుటుంబాల నుంచి వస్తారు. వారికి సరైన దిశానిర్దేశం చేస్తే అద్భుతాలు చేస్తారు. అది చేసి చూపించాల్సిన బాధ్యత మనందరిది. విద్యలో ఢిల్లీలో మేజిక్ జరుగుతోందని అంటున్నారు. దానికి ఫుల్ స్టాప్ పెట్టాలని నేను భావిస్తున్నాను. ప్రభుత్వ విద్య గురించి ఎవరైనా మాట్లాడితే ఏపీ గురించి మాట్లాడాలి. చేసి చూపించే శక్తి మనందరికీ ఉంది. మనకు చాలా పాజిటివ్ లీడర్ షిప్ ఉంది. అందరం కలసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను కేవలం దేశానికే కాదు.. ప్రపంచానికి చేసి చూపించాలని ఉపాధ్యాయులందరినీ కోరుతున్నానన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ చీఫ్ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, బోండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్, సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పిల్లలకు ఆస్తులు ఇవ్వడం కన్నా చదివిస్తే ఊహించనంత ఎత్తుకు ఎదుగుతారు.

**చంద్రబాబు, ముఖ్యమంత్రి**



ప్రతి పాఠశాలలో ఓ సోషల్ మీడియా ఫ్లాట్ ఫాం ఏర్పాటు చేయాలి.

పాఠశాల పాత స్టూడెంట్ తో పాటు తల్లిదండ్రులను అందులో భాగస్వామ్యం చేయండి.

2014-19 మధ్య రాష్ట్రం కోసం కష్టపడ్డాను.. కానీ ఆ తర్వాత రకరకాల కారణాల వల్ల ఓడిపోయాను.

నేను రాజకీయాలపై ఫోకస్ పెట్టిన ప్రతిసారీ గెలిచాను.

2019-24 మధ్య కాలంలో విభజన కంటే ఎక్కువ నష్టం జరిగింది.

2024లో ప్రజలు మాపై నమ్మకంతో గెలిపించారు... 94 శాతం స్ట్రైక్ రేట్ వచ్చింది.

ప్రజలకు మరింత మేలు కలిగేలా పని చేస్తున్నాం.

కేంద్ర సాయంతో ఏపీని అభివృద్ధి చేస్తాం... పెట్టుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తాం.

నా ప్రయత్నాలకు ఉపాధ్యాయుల సహకారం అవసరం... టీచర్ల చేతుల్లోనే భవిష్యత్ ఉంటుంది.

ఏ విషయంలోనైనా కాస్తో కూస్తో నిర్లక్ష్యం చేస్తానేమో కానీ... విద్యాశాఖను మాత్రం నిర్లక్ష్యం చేయను.

మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టాను.. వివాదాలు లేకుండా అద్భుతంగా డీఎస్సీ నిర్వహించారు.

విద్యా వ్యవస్థలో చాలా మార్పులు తెచ్చాను.

ఒకప్పుడు విద్యా వ్యవస్థ జెడ్పీ ఛైర్మన్ల చేతుల్లో ఉండేది.. ట్రాన్స్ఫర్ల కోసం ఉపాధ్యాయులు జెడ్పీ ఛైర్మన్ల ప్రాపకం కోసం వెళ్లేవారు.

విధిలేని పరిస్థితుల్లో టీచర్లు రాజకీయ నాయకుల చుట్టూ తిరిగేవారు.

టీచర్లు ఆత్మగౌరవం దెబ్బతినకూడదని టీచర్ల ట్రాన్స్ఫర్లల్లో తొలిసారి కౌన్సిలింగ్ విధానం తెచ్చాను.

బ్రిడ్జి స్కూళ్లు పెట్టాం... బడికిపోదాం కార్యక్రమం పెట్టాం.

ఇప్పుడు తల్లికి వందనం ద్వారా పేద విద్యార్థులకు చదువు అందేలా చేస్తున్నాం.

కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో చక్కటి సంస్కరణలు తెచ్చాం.

రాజకీయ నేతల పేర్లను పెట్టకుండా... విద్యా వ్యవస్థను పవిత్రంగా ఉంచుతున్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ వంటి పేర్లతో రాజకీయాలకతీతంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దడం శుభ పరిణామం.

పిల్లలకు పుస్తకాల బరువు తగ్గేలా నో బ్యాగ్ డే ప్రవేశపెట్టారు.

పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు... విలువలు నేర్పాలి.

సంపదతో పాటు... విలువలు కాపాడుకోగలిగితే అన్నింటిలోనూ.. అగ్ర భాగాన ఉండగలం.

జీతాలిస్తున్నాం కానీ... ఇంకా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి.

నేను ఏ పరిస్థితుల్లో సీఎం అయ్యానో మీకు తెలుసు.

ప్రజలకు హామీలు ఇచ్చాం... నేను సీఎంగా ఉన్నప్పుడు ఉద్యోగస్తులను ఇబ్బంది పెట్టలేదు.. ఇబ్బంది రానివ్వను.

ఉద్యోగులు, టీచర్లు ఈ ప్రభుత్వం నుంచి ఏం ఆశిస్తున్నారో... అవన్నీ రానున్న రోజుల్లో అందించే బాధ్యత తీసుకుంటాం.

ఒకప్పుడు ఐటీ అర్థమయ్యేది కాదు... కానీ ఇప్పుడు ఐటీ రియాల్టీ.

టీచర్లు ఐటీ నాలెడ్జ్ కూడా పెంచుకోవాలి... టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి.

ఏఐ వంటి టూల్స్ ఉపయోగించి విద్యార్థులకు చాలా నేర్పించవచ్చు.

క్వాంటం కంప్యూటింగ్ తెస్తున్నాం... క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిలబస్ లో మార్పులు చేసుకోవాలి.

పిల్లలు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు... కొన్ని విషయాల్లో నాకంటే నా మనవడు దేవాన్ష్ ఫాస్టుగా ఉంటాడు.

అలాగే టెక్నాలజీ విషయంలో మీకంటే... పిల్లలు వేగంగా ఉంటే.. అది టీచర్లకు ఛాలెంజ్ లాంటిది.

యువత అవసరాలను... ప్రస్తుత ట్రెండ్సును తెలుసుకుంటూ అప్డేట్ కావడం నాకు అవసరం... మీకూ అవసరం.

థియరీనే కాకుండా... వినూత్నమైన ఆలోచనలతో చదువు చెప్పాలి.

టెక్నాలజీ విషయంలో నాకంటే లోకేష్ మెరుగ్గా ఉంటారు... నేను థియరిటికల్ పర్సన్.. విజన్ ఉంది.

కంప్యూటర్ సైన్స్ బ్యాక్ గ్రౌండ్, స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీ ఎంబీఏ పట్టా లోకేష్ కు అడ్వాంటేజ్.

అయితే లోకేష్ నాతో పోటీ పడదమంటే చాలా కష్టం.

టీచర్ల బాగోగులు చూసుకునే బాధ్యత నాది... విద్యార్థుల బాధ్యత టీచర్లది.. భావి భారత పౌరులను తీర్చిదిద్దాలి.

నాకంటే వేరే రాష్ట్రం మెరుగ్గా ఉంటే నేను తట్టుకోలేను.

ఎప్పుడూ రాష్ట్రాన్ని నెంబర్-1గా ఉండాలనే కోరుకుంటున్నాను.

రాష్ట్రాన్ని నెంబర్-1గా చేసేందుకు అవసరమైన వసతులు కల్పించే బాధ్యత నాది... దాన్ని అందిపుచ్చుకునే బాధ్యత టీచర్లది

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన కలెక్టర్ రాజార్షిషా




**అదిలాబాద్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** శుక్రవారం ఇంద్రవెల్లి మండలం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల కార్యక్రమం లో భాగంగా శుక్రవారం pvtg లబ్ధిదారులకు ఎంపి గేడెం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, శాసన సభ్యులు వెడ్మ బొజ్జు లు అందజేశారు.

ఈ సందర్భంగా ఇంద్రవెల్లి , సిరికొండ మండలాలు కలిపి 402 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు .

ఈ సందర్భంగా ఎంపి, ఎంఎల్ఏ, కలెక్టర్ మాట్లాడుతూ. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, ఆదిలాబాద్ జిల్లాలోని వెనుకబడిన గ (%ఫ్రాఖ+%) లబ్ధిదారులకు నూటికి నూరు శాతం శాచురేషన్ మోడ్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.

లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనాల్సిన పరిస్థితుల్లో స్వయం సహాయ సంఘాల (SHGs) ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని, సూచించారు.

ప్రతి మండలానికి ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఒక అసిస్టెంట్ ఇంజనీర్ (AE) ను నియమించామని, వారు పర్యవేక్షణతో పాటు సాంకేతిక సహాయాన్ని అందిస్తారని తెలిపారు.

ఇందుకు సంబంధించి అధికారులకు తగిన ఆదేశాలు ఇప్పటికే జారీ చేశామని తెలిపారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టేన్సన్ భేటి

## రెండు దేశాల మధ్య వాణిజ్య,పారిశ్రామిక సంబందాల పై చర్చ

## తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం



డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టేన్సన్ శుక్రవారం రోజున రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మర్యాద పూర్వకంగా భేటి అయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డెన్మార్క్ రాయబారితో జరిగిన భేటీలో

వాణిజ్య,పారిశ్రామిక రంగంలో రెండు దేశాల మధ్య మరింత బలపడాలని ఆకాంక్షించారు.

ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటి అని ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అన్ని రకాలుగా అనుకూల వాతావరణం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందుతున్న హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణా రాష్ట్ర విశిష్టతను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయనకు వివరించారు.

ఐ. టి రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరంలో ఇక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆధునిక వసతులు,ఫార్మా రంగంలో పురోగతిని ఆయన వివరించారు.

ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుండి పారిశ్రామిక వేత్తలు తరలి వస్తుంన్నారని డెన్మార్క్ లాంటి దేశం కుడా ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు.

# రెండు ఆర్వోబీలు...

మెదక్, సెప్టెంబర్ 5, తెలంగాణలో చాలా వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు లేక ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాంటి వారి కోసం కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల ఆ బ్రిడ్జి నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. తాజాగా మెదక్ ఎంపీ.. చేగుంట ప్రాంతంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఏళ్లుగా చేగుంట పరిసర ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చివరికి ఆరంభం కానుంది. గురువారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొని శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రతి రోజూ రైల్వే గేట్ మూసేయడంతో ప్రజలు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు.పాఠశాలకు వెళ్లే పిల్లలు, ఉద్యోగానికి వెళ్లే కార్మికులు, అత్యవసర పనులతో బయటకు బయలుదేరిన సాధారణ ప్రజలు గడచిన దశాబ్దాలుగా తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి కేంద్రం ముందుకొచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యేకంగా నిధులు కేటాయించడం వల్లే ఈ ప్రాజెక్ట్ సాధ్యమైంది అని అన్నారు.2016లో కేంద్రం సగం నిధులు మంజూరు చేసినా.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని ఆయన గుర్తు చేశారు. తాజాగా కేంద్రం పూర్తి నిధులు కేటాయించడం వల్ల ప్రజల కల నిజమవుతోందని వివరించారు. “నేను ఎంపీగా ఢిల్లీలో కూర్చొని ఉండే వ్యక్తిని కాను. గెలిచినప్పటి నుంచి నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలు వింటూ పరిష్కారానికి కృషి చేస్తున్నాను” అని అన్నారు. అలాగే.. ఈ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా కాంట్రాక్టర్ వేగంగా పని చేయాలని సూచించారు. అవసరమైతే రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారం తీసుకోవాలని అన్నారుప్రజల కోరిక మేరకు చిన్న శంకరంపేట, మసాయిపేట ప్రాంత ప్రజల సౌలభ్యం కోసం దేవగిరి ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లను చేగుంట వద్ద ఆపాలని రైల్వే అధికారులను కోరారు. రైల్వే డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ మాట్లాడుతూ.. రోజూ దాదాపు లక్షా ఇరవై వేల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ రోడ్డు ఓవర్ బ్రిడ్జి పూర్తయితే వారికి మంచి భద్రత, సమయపాలన కలుగుతుందని చెప్పారు. త్వరలో వడియారం రైల్వే స్టేషన్‌లో కొత్త ప్లాట్‌ఫారమ్, రిజర్వేషన్ కౌంటర్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు

# నెల తరవాత దేవుడి సొమ్మును తిరిగి అక్కడే ఉంచిన దొంగలు

అనంతపురం జిల్లాలో ఈ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. నెల క్రితం ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లిన దొంగలు.. అందులోని డబ్బును తిరిగి తెచ్చి అక్కడే పెట్టి వెళ్లారు. బుక్కరాయసముద్రం దగ్గర చెరువు కట్ట వద్ధ వున్న ముసలమ్మ ఆలయం లో హుండీ ని ఎట్టుకెళ్లిన దొంగలు. హుండీలోని డబ్బు తో పాటు, దొంగలు ఒక లేఖ కూడా అక్కడ వదిలి వెళ్లారు. హుండీ లోని 1,86, 486 రూపాయల డబ్బు ను గుడిలో పెట్టారు. డబ్బులు దొంగలించిన తర్వాత తమ పిల్లల ఆరోగ్యం బాగాలేదని అందుకే డబ్బును తిరిగి గుడిలో పెడుతున్నామని దొంగలు లేఖ లో పేర్కొన్నారు.

# ‘రైజింగ్ తెలంగాణ’లో భాగస్వామ్యం అవ్వండి

## పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలం పెట్టుబడులు పెట్టండి... రాష్ట్ర పురోగతిలో పాలు పంచుకోండి

## గల్ఫ్ పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

‘రైజింగ్ తెలంగాణ’లో భాగస్వామ్యం కావాలని గల్ఫ్ పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ‘సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ వీకెండ్ %-% దుబాయి 2025’లో భాగంగా యూఏఈలో నిర్వహించిన సౌత్ ఇండియన్ బిజినెస్ అచీవర్స్ అవార్డు(సైబా)ల ప్రదానోత్సవానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణ పురోగతిని, భవిష్యత్ ప్రణాళికలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ‘భౌగోళిక విస్తీర్ణంలో 11, జనాభా పరంగా తెలంగాణ 12వ స్థానంలో ఉంది. అయినా... దేశ జీడీపీలో మా వాటా 5 శాతం కంటే ఎక్కువే. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. గత 18 నెలల్లో తెలంగాణ లైఫ్ సైన్సెస్, ఈవీ, ఏరోస్పేస్, లాజిస్టిక్స్, ఏఐ, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాల్లో రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది’ అని చెప్పారు. ‘ఎలీ లిల్లీ లాంటి అనేక ప్రపంచ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా మార్చుకున్నాయి. ఇప్పటికే యూఏఈ పెట్టుబడిదారులు రూ.2వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. ఇది తెలంగాణ – దుబాయ్ మధ్య రోజురోజుకీ బలపడుతున్న వాణిజ్య సంబంధాలకు చిహ్నంగా భావిస్తున్నాం’ అని చెప్పారు. ‘ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారిని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదు. మా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామిగా పరిగణిస్తున్నాం. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, డిజిటల్ ఎకానమీ, స్మార్ట్ మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, లాజిస్టిక్స్, వేర్ హౌజింగ్, ట్రేడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవీ, ఏరో స్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ తదితర రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటాం. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలి’ అని పిలుపునిచ్చారు.

# న్యాక్ ట్రైనర్ కు జాతీయ అవార్డు రావడం పట్ల మంత్రి కోమటి రెడ్డి హర్షం

**రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్నేహలతను అభినందించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న స్నేహలత**

**నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్ష న్ ను బలోపేతం చేస్తున్నామన్న మంత్రి**

**వేల మందికి నాణ్యమైన నైపుణ్య శిక్షణ ఇస్తూ..ఉపాధి కల్పన పెంపొందించడం పై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక దృష్టి**



హైదరాబాద్:నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్ష న్(%చీూజ%) ను అత్యుత్తమ స్కిల్ డెవల్మపెంట్ వేదికగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చేస్తున్న కృషికి ఫలితం దక్కుతోంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవల్మపెంట్ పెంపొందించాలనే లక్ష్యంతో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవల్మపెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నది.

అందులో భాగంగా హైదరాబాద్ వేదికగా,జిల్లాల్లో న్యాక్ ద్వారా శిక్షణ ఇవ్వడమే కాకుండా..100 శాతం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా %చీూజ% వైస్ ఛైర్మన్,మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మంత్రి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.

ఈ నేపథ్యంలోనే.. టీచర్స్ డే పురస్కరించుకొని న్యాక్ ట్రైనర్ స్నేహలతకు రాష్ట్ర పతి చేతుల మీదుగా జాతీయ అవార్డు రావడం పట్ల మంత్రి తన హర్షం వ్యక్తం చేశారు.

మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా శుక్రవారం ఢిల్లీలో జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న న్యాక్ ట్రైనర్ స్నేహలతకు ఫోన్ చేసి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు

ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని కొనియాడారు.

దేశ వ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి న్యాక్ ఇన్ స్ట్రక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్మకొండకు చెందిన నక్క స్నేహలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణం అన్నారు.

నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్ష న్ ను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు దక్కడంతో న్యాక్ ఫ్యాకల్టీ,సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు.

స్నేహలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ ని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

రాష్ట్ర పతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్నేహలతకు న్యాక్ డైరెక్టర్ జనరల్(డీజీ),ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ అభినందనలు తెలిపారు.

# అధికారులలో కాళేశ్వరం టెన్షన్..

హైదరాబాద్, సెప్టెంబర్ 5, ఆ అధికారులకు కొత్త టెన్షన్ పట్టుకుందా? గండం గట్టెక్కాంరా.. దేవుడా అని ఊపిరి పీల్చుకుంటున్న టైంలో? పిడుగు పడ్డట్టయిందా? మళ్ళీ క్వశ్చన్ టైం వచ్చేసిందంటూ టెన్షన్ పడుతున్నారా? చివరికి కొందరు రిటైర్డ్ ఐఎఎస్‌లకు కూడా మనశ్శాంతి లేకుండా పోయిందా? ఎవరా ఆఫీసర్స్? ఎందుకు వాళ్ళలో టెన్షన్ పెరుగుతోంది? తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో సంచలన నిర్ణయం తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం. అదే ఇప్పుడు స్టేట్‌లోని పలువురు సీనియర్ ఐఏఎస్‌లను టెన్షన్ పెడుతోందట. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగుబాటుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో పెట్టింది ప్రభుత్వం. దాని మీద సుదీర్ఘ చర్చ జరిగాక సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది సర్కార్. ఆ నిర్ణయమే ఐఎఎస్‌లను షేక్ చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం కుంగుబాటుపై విచారణ కోసం కమిషన్‌ను నియమించగా? 15 నెలల తర్వాత 665 పేజీల నివేదిక అందజేసింది.

ఆ నివేదికలో మాజీ సీఎస్ ఎస్కే జోషి, అప్పటి సీఎం సెక్రటరీ స్మితా సభర్వాల్ పని తీరును తప్పు పట్టింది కమిషన్. సుమారు పది మంది ఐఏఎస్ లను విచారించి ఇద్దరినే తప్పుపట్టింది. అందర్నీ క్రాస్ ఎగ్జామిన్ చేసి ఫైనల్‌గా ఆ నిర్ణయం తీసుకుంది కమిషన్. అంతకు ముందు ప్రాజెక్టులో పని చేసిన వివిధ స్థాయిల్లోని ఇంజనీర్లను కూడా ప్రశ్నించింది. మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ బి.హరిరామ్‌లను, ఆ తర్వాత సీఎంవో మాజీ కార్యదర్శి స్మితా సభర్వాల్, మాజీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు ఎస్కే జోషి, సోమేశ్‌కుమార్, ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులను కూడా సాక్షులుగా పిలిచి విచారించింది. అంతా ఒక ఎత్తయితే? ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించడంతో? గతంలో ఊపిరి తీసుకున్న అధికారుల్లో కూడా భయం పట్టుకున్నట్టు తెలుస్తోంది. కమిషన్ పిలిచి ప్రశ్నించడానికి, సీబీఐ దర్యాప్తునకు చాలా తేడా ఉంటుంది. ఒక్కసారి ఆ దర్యాప్తు సంస్థ అడుగుపెడితే? బాగా లోతుల్లోకి వెళ్తుంది.

అది ఎట్నుంచి ఎటు తిరుగుతుందో తెలియదు. అందుకే గతంలో? ఈ ఇష్యూలో పేర్లు నలిగి, తర్వాత కమిషన్ రిపోర్ట్‌లో లేని అధికారుల్లో టెన్షన్ మొదలైనట్టు తెలుస్తోంది. గతంలో పీసీ ఘోష్ కమిషన్ విచారణ సందర్భంగా ఇబ్బందులు పడ్డామని భావిస్తున్న అధికారులు కూడా? ఇప్పుడు సిబిఐ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. తమకు ఏమీ తెలియదని, నాటి ప్రభుత్వ పెద్దలు చెబితేనే పనులు చేశామని, మూడేళ్ళ కిందటి విషయాలు మాకు గుర్తుకు లేవని కమిషన్‌కు సమాధానాలు చెప్పారట చాలా మంది అధికారులు. మరిప్పుడు సీబీఐ అధికారులు ఎంటరై వాళ్ళ స్టైల్‌లో ప్రశ్నలు సంధిస్తే? వీళ్ళేం సమాధానం చెబుతారోనన్న చర్చ జరుగుతోంది

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ చామకూరి వెంకట్ నారాయణ



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజాబలం)** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల 19వ డివిజన్ లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వార్డు ఆఫీసర్ అనురాధ మరియు డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ ముగ్గు పోసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసినాడు ఈకార్యక్రమంలో పాషా నర్సిరెడ్డి భాస్కర్ బాల శివరాం శ్యామల రాజు వరికోటి భాస్కర్ విజయలక్ష్మి కంపసాటి వెంకన్న కన్నెబోయిన ముత్తయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

# యోగాతో మానసిక ప్రశాంతత

## ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 5:** శామీర్పేట మండలం అలంకృత రిసార్ట్ లో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా బోధి స్కూల్ ఆఫ్ యోగ జాతీయస్థాయి అవార్డుల పంపిణీ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి.

ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన 200 మంది యోగ ప్రతిభావంతులకు అవార్డులు పంపిణీ చేసిన చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి.

పాల్గొన్న మిస్ ఇండియా రష్మిక, ఆధ్యాత్మిక వేత్త గౌరీ రొక్కం, సత్యవాణి, బోధి యోగ స్కూల్ ఫౌండర్ అశోక్, సలహాదారు ధనుంజయ.

అనునిత్యం బిజీగా ఉండే జీవితంలో ప్రశాంతత, ఏకాగ్రత, ఆరోగ్యం కోసం యోగ ఎంతో అవసరం.

విద్యార్థులు, యువత మొదలుకొని ఉద్యోగస్తులు, ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి వరకు యోగ కొనసాగిస్తూ ఉన్నతులు అవుతున్నారు.

యోగ ప్రాచీన భారత సంస్కృతి, సంప్రదాయంలో ఒక భాగం. ఇటీవల భారతదేశ ప్రధాని మోడీ యోగా ప్రాధాన్యతను ప్రపంచానికి చాటారు.

అవార్డు గ్రహీతలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, శిక్షకులు యోగాను మరింత విస్తృతంగా కులమతాలకు, ప్రాంతాలకు, అతీతంగా ప్రచారం చేసి మానవాళికి మేలు చేయాలి అని కోరారు

# రేషన్ డీలర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి.

## ఒక్కరోజు నిరసనగా రేషన్ షాపులు మూసివేసిన డీలర్లు.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలలుగా రేషన్ డీలర్లకు కమిషన్లు చెల్లించకపోవడంపై ఆగ్రహించిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం పిలుపుమేరకు వేములవాడ మండలంలో శుక్రవారం రోజున రేషన్ షాపులు ఒకరోజు బంద్ నిర్వహించారు.

ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మాట్లాడుతూ ప్రతి రేషన్ డీలర్ కు నెలకు 5000 గౌరవ వేతనం ఇస్తామని, కమిషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 21 నెలలు గడిచిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, ఉన్న కమిషన్లను కూడా ఐదు నెలలగా బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు.

ప్రజలకు ముఖ్యమైన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంను ఇలా నిర్లక్ష్యం చేస్తే, డీలర్ల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపులను ఒకరోజు బంద్ చేస్తున్నట్లు వేములవాడ మండల రేషన్ డీలర్లు పేర్కొన్నారు

# ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు...

## అందంగా అలంకరించిన రథాల్లో శోభయాత్ర

## గణనాధునికి వీడుకోలు పలుకుతున్న భక్తులు

కరీంనగర్ ఆదిదేవుడు విఘ్నాలను తొలగించే వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు ముగిసాయి. విభిన్న ఆకృతుల్లో వాడవాడన కొలువైన గణనాధునికి నిమజ్జనంతో వీడ్కోలు పలుకుతున్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు కన్నుల పండువలా జరుగుతున్నాయి. ఊరు వాడ తేడా లేకుండా గల్లి గల్లిన విభిన్న ఆకృతుల్లో వెలిసిన గణనాధులను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన రథాలలో గణనాధుని శోభయాత్ర నిర్వహిస్తున్నారు. ఆటపాటలతో గణనాధున్ని కొలుస్తూ ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు అభిషేకాలు అందుకున్న బొజ్జ గణపతయ్యను గంగమ్మ ఒడికి సాగనంపారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలో నిన్నటి నుంచే నిమజ్జనోత్సవం జరుగుతుంది. నిమజ్జనోత్సవం లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గీతే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరీంనగర్ లో వెలసిన దాదాపు 3000 విగ్రహాలను కరీంనగర్ సమీపంలోని చింతకుంట కెనా ల్ మానకొండూరు చెరువులో కొత్తపెల్లి చెరువులో నిమజ్జనం చేస్తున్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా కరీంనగర్ లో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. కరీంనగర్ వరంగల్, జగిత్యాల రూట్లో వాహనాలను దారి మళ్లించారు. నిమజ్జనం శాంతియుతంగా కొనసాగేలా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా గణేశుని శోభయాత్ర సాగుతూ నిమజ్జనం జగుతుంది. శోభయాత్ర ద్వారా చారిత్రాత్మకమైన టవర్ సర్కిల్ ప్రాంతానికి గణేష్ విగ్రహాలు చేరుతుండగా అధికారులు రాజకీయ పార్టీల నేతలు పుర ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించి ముందు నిమజ్జనానికి పంపిస్తున్నాను. బై బై గణేశా అంటూ గంగమ్మ ఒడికి సాగనంపారు.

## యూరియా కోసం కొట్టుకున్న మహిళా రైతులు

మహబూబాబాద్ మహిళలు ఆర్టీసీ బస్సుల్లో సీట్ల కోసం పంచాయతీ పెట్టుకోవడం....జుట్లు జట్లు పట్టుకొని కొట్టుకోవడం చూసాం కానీ మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో యూరియా బస్తాల కోసం 2 మహిళలు జుట్లు జుట్లు పట్టుకొని పొట్టు..పొట్టుగా కొట్టుకున్నారు. ప్రధాన రహదారిపై పొర్లాడుతూ కొట్టుకోవడం అందర్నీ విస్మయపరిచింది. చుట్టుపక్కల వారు ఆపుతున్నా ఆగకుండా కొట్టుకున్నారు. చివరకు ఇద్దరు వ్యక్తులు ధైర్యం చేసి ఆ ఇద్దరు మహిళలను బలవంతంగా ఆపారు. మహబూబాబాద్ పట్టణం లోని వివేకానంద సెంటర్ లో గల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ముందు మహిళలు , పురుషులు ఆధార్ కార్డు జిరాక్స్ లు పట్టు కొని పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఒకరికొకరు నెట్టుకోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఈ సమయంలోనే ఇద్దరు మహిళలు తీవ్రంగా కొట్టుకున్నారు. ఈ దృశ్యాలు వాట్సప్ లో వైరల్ గా మారాయి.

# హైదరాబాద్ హైటెక్స్‌లో "కొలువుల పండుగ"కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** గత పదేళ్ల బీఆరెస్ పాలనలో ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా వారి సమస్య పరిష్కరించలేదు

రెవెన్యూ శాఖ సిబ్బందిని ఒక దొంగలుగా, దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు

తెలంగాణ చరిత్రలో పోరాటాలన్నీ భూమి కోసం జరిగినవే

కొమురంభీం, చాకలి అయిలమ్మ, రావి నారాయణరెడ్డి లాంటి వాళ్లు భూమి కోసమే పోరాడారు

భూమి కోసం పోరాటాలే కాదు భూదాన్ ఉద్యమానికి పునాదులు పడింది కూడా తెలంగాణ ప్రాంతంలోనే

వెదిరె రామచంద్రా రెడ్డి వేలాది ఎకరాలు పేదలకు పంచి భూదానోద్యమం చేశారు

ఆనాడు పీవీ నర్సింహారావు అగ్రికల్చర్ సీలింగ్ యాక్ట్ తీసుకొచ్చి అసైన్డ్ భూములను పేదలకు పంచారు

భూమిని చెరబట్టిన వారిని తెలంగాణ ప్రజలు దిగంతాలకు తరిమారు

గత ప్రభుత్వంలో ధరణి భూతాన్ని తెచ్చి భూములను కొల్లగొట్టాలని చూశారు

తమ దోపిడీకి వీఆర్వో వీఆర్ఏ లు అడ్డుగా ఉన్నారని వారిని దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు

మిమ్మల్ని దోపిడీదారులుగా చిత్రీకరించారు

ధరణి తెచ్చిన సమస్యలతో విసిగిపోయిన ఓ రైతు ఇబ్రహీంపట్నంలో అధికారిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు

సిరిసిల్లలో అధికారులపై తాళి బొట్టు విసిరిన పరిస్థితి

ఇది అధికారుల వల్ల జరగలేదు.. ఇది నాటి పాలకులు సృష్టించినవైరస్


ధరణిని బంగాళాఖాతంలో విసిరేస్తామని ఆనాడు చెప్పాం

ఇచ్చిన మాట ప్రకారం ధరణి మహమ్మారిని వదిలించి భూ భారతి చట్టం తీసుకొచ్చాం

ధరణితో పట్టుకున్న దరిద్రాన్ని భూభారతితో పరిష్కరించే ప్రయత్నం చేశాం

ప్రభుత్వానికి పేద ప్రజలకు మీరు వారధులుగా నిలవాలి

పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మిమ్మల్ని తిరిగి నియమించాం




ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇల్లు తగలబెట్టుకుంటామా ఎవరో కొందరు తప్పులు చేశారని మొత్తం వ్యవస్థనే రద్దు చేస్తారా?

వాళ్లు చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారు.

లక్ష కోట్లు కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలేశ్వరం అయింది.. మరి వాళ్ళనేం చేయాలి.

తెలంగాణ సాధనలో, ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములైన మీరు ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పనిచేయాలి

భూ భారతి చట్టాలను అమలు చేయడమే కాదు.. సాదా బైనామాల సమస్య పరిష్కరించాలి

ఇది మీ ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్య

గత పాలకులు మిమ్మల్ని తెలంగాణా సమాజంలో దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు

మీ మీద పడ్డ మచ్చను చెరుపుకునే అవకాశం మీకు వచ్చింది ఆ ముద్రను చెరిపేసి.. ఆనాటి పాలకుల తప్పుడు విధానాలను ప్రజలకు వివరించండి మీపై చేసిన ఆరోపణలు తప్పు అని నిరూపించుసుకునేలా పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించండి




# రుద్రారం గణేష్ గడ్డ బ్రహ్మోత్సవాలు?.

## నూతన చైర్మన్ ఎన్నిక?

## జాతరకు ఏర్పాట్లు పూర్తి

పటాన్ చెరు సంగారెడ్డి జిల్లా పటన్ చెరు రుద్రారం గణేష్ దేవస్థానంలో జరగనున్న బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయంలో కొత్తగా ముగ్గురు ధర్మకర్తలను ఎన్నుకుని, వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అదే విధంగా, హరి ప్రసాద్ రెడ్డిని ఏకగ్రీవంగా కొత్త చైర్మన్గా ఎన్నుకున్నారు. అనంతరం తెలంగాణ ఇండస్ట్రియల్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి నూతనంగా ఎన్నికైన చైర్మన్ ని, అభినందించారు.

ఈ సందర్భంగా ఆలయ ఈవో లావణ్య మాట్లాడుతూ, ఆరో తారీకున జరగనున్న జాతర బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు ఆమె వివరించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా, స్వామివారికి ప్రతిరోజూ అభిషేకం, పల్లకి సేవలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

జాతర రోజున ఉదయం స్వామివారికి అభిషేకం, హోమాలు, పల్లకి సేవ, లడ్డు వేలం పాట, మరియు ముఖ్యంగా రథోత్సవం వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆమె వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈశ్వర్,ధర్మకర్తల మండలి సభ్యులు, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ప్రభు, పిఏసిఎస్ చైర్మన్ పాండు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకన్న,గోపాల్,మధువరెడ్డి, లక్ష్మారెడ్డి,నర్సింహారెడ్డి,గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు

# ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతులకు తప్పని యూరియా కష్టాలు

### హుజురాబాద్ లో వేకువజామునుంచే బాలురు తీరిన రైతులు

### పోలీస్ పహారాలో రైతులకు టోకెన్ల పంపిణీ

### సరిపడు యూరియా అందక అన్నదాతలు ఆందోళ

కరీంనగర్ రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. రోజురోజుకు ఆందోళనలు ఉదృతం అవుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలుచోట్ల రైతులు యూరియా కోసం రోడ్డెక్కారు. యూరియా కావాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. హుజూరాబాద్ లో వేకువజామునుంచే రైతన్నల యూరియా కోసం సొసైటీ వద్ద బారులు తీరారు. సొసైటీ వద్దకు ఈరోజు యూరియా వస్తుందని సమాచారంతో తెల్లవారుజాము వరకే వందలాదిమంది అక్కడికి చేరుకుని క్యూ కట్టారు. పోలీసులు సొసైటీ గేటు వేసి ఐదుగురు చొప్పున లోపలికి అనుమతించి టోకెన్లు పంపిణీ చేశారు. రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. రైతులకు కావలసిన యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు. రోజుల తరబడి సొసైటీల చుట్టూ తిరిగిన ఒకటి రెండు బస్తాల కంటే ఎక్కువ దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# శ్రీనగర్‌లో గల స్టేమ్‌స్పార్క్‌రెజొనెన్స్ స్కూల్ గురుపూజోత్సవం




**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజాబలం)** ఖమ్మం కార్పొరేషన్ లో గలస్థానిక శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్ లో ప్రముఖ తత్వవేత్త, భారతదేశ ద్వితీయ రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా ఘనంగా టీచర్స్ డేని కన్నుల పండుగగా నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు శ్రీ డా సర్వేపల్లిరాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు ఆదికాలం నుండి ఆధునిక కాలం వరకు ఉపాధ్యాయుని పట్ల గౌరవం పెరుగుతూనే ఉందనీ, కావున గురుతర బాధ్యతగా ప్రతి ఉపాధ్యాయుడు తమ బాధ్యతను నిస్వార్ధంగా నిర్వర్తించాలనీ మరియు ప్రతీ విద్యార్ధి తమ జీవితానికి మార్గదర్శకుడ్కైన తమ గురువును మరువరాదని గురువు పట్ల ఎంతో భక్తి శ్రద్దలతో మెలగాలని ఆయన ఈ సంధర్భంగా చిన్నారులకు సందేశమిచ్చారు రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ విద్యార్థిని విద్యార్థులను ఉత్తమ బావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి దేశాభివృద్ధిలో ముందు వరుసలో నిలబెట్టడానికి మా అనుభవజ్ఞుల్కైన ఉత్తమ ఉపాధ్యాయుల ద్వారా స్కూల్ యాజమాన్యం చక్కటి ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తామని తెలియజేస్తూ అందరికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు స్కూల్ డైరెక్టర్ శ్రీమతి కొండాకృష్ణవేణి మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని తెలిపారు. గొప్పతత్వ వేత్తగా పేరుపొంది భారత ప్రధమ పౌరుడిగా సేవలందించిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ మనదేశంలో నే కాదు ప్రపంచదేశాలలో కూడా తన ప్రతిభను చాటి, భారతదేశం గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేశాడంటూ, జ్ఞాన సమాజ నిర్మాతల్కైనా ఉపాధ్యాయులందరికి అభినందలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ యాజమాన్యం మరియు విద్యార్థులు టీచర్స్‌డే సందర్భంగా ఉపాధ్యాయిని ఉపాద్యాయులను ఎంతో గౌరవంతో సన్మానించి ఉపాధ్యాయ వృత్తి పట్ల అభిమానాన్ని చాటి ఉపాధ్యాయ బృందాన్ని ప్రోత్సహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.వి.ఆర్.మురళీమోహన్ ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు

## అమృతభాండాన్ని మంత్రికి అందజేసిన వీర అభిమాని

### ఘణనాథుని చేతిలోని అమృతభాండం

### 35 వేలకు వేలంపాటలో దక్కించుకున్న అభిమాని



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (సెప్టెంబర్ 05 ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అందోల్ నియోజకవర్గం పుల్కల్ మండల పరిధిలో గల ఎస్ ఇటిక్యాల గ్రామంలో హనుమాన్ టెంపుల్ వద్ద ఉన్న ఘణనాథుని చేతిలోని అమృత బాండాన్ని నిన్న గురువారం రాత్రి వేలం వేయగా ఇదే గ్రామానికి చెందిన, మాసి రెడ్డి గారి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహపై,ఉన్న అభిమానంతో అమృత భాండాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని, అలాగే ఈ అమృత బాండాన్ని మంత్రికి, అందజేయాలనే దృఢ సంకల్పంతో, రాత్రి జరిగిన వేలం పాటలో 35,వేలకు అమృత భాండాన్ని,దక్కించుకొని,ఈరోజు శుక్రవారం ఉదయం సంగారెడ్డి లోని మంత్రి నివాసంలో మంత్రి దామోదర్ రాజనర్సింహకు, ఈ యొక్క అమృతభాండాన్ని అందజేయడం జరిగింది, ఇంతకుముందు 2019లో స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ మీద మంత్రి దామోదర్ రాజనర్సింహ,మీద ఉన్న అభిమానంతో తాను స్వయంగా సొంత ఖర్చులతో ఎస్,ఇటిక్యాల, గ్రామ ప్రజల అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించాడు, అంతేకాకుండా తాను ఏ అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజల పక్షాన, గ్రామంలోని అధికార పార్టీ నాయకులను, గ్రామ అభివృద్ధి గురించి నిలదీసే వాడు, ఇలాంటి యువ కార్యకర్త గ్రామంలోని కాంగ్రెస్ పార్టీకి ఎంతో అవసరం అని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు....

## బీసీ రిజర్వేషన్లకు అడ్డు వస్తే ప్రళయమే

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణమాచారి**




**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజాబలం)** ఖమ్మం నగరంలోని ఖానాపురంలో జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటే రాష్ట్రంలో ప్రళయం సృష్టిస్తామని తెలియచేశారు జనాభాలో 56 శాతం ఉన్న ప్రజలకు న్యాయం చేయటం కోసం అందరూ సహకరించాలని లేకుంటే ఏ రాజకీయ పార్టీని వదిలిపెట్టమని ఆ పార్టీలను శాశ్వతంగా బీసీలకు దూరం చేస్తామని బీసీల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి మాట్లాడుతూ సంఘ నిర్మాణ కోసం ప్రతి కార్యకర్త బీసీ బిడ్డ ముందుకు రావాలని ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయాలని లేకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కార్యదర్శిగా మసనం శివరామకృష్ణను నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ తనని కార్యదర్శిగా ఎన్నిక చేసిన జిల్లా అధ్యక్షులు కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కి, కార్యనిర్వక అధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, నగర అధ్యక్షులు గద్దె వెంకటరామయ్య, సీనియర్ నాయకులు బొడ్డు కృష్ణ



మోడేపల్లి వెంకటాచారి ఎనుముల రాము యాదవ్ పద్మశాలి సంఘం జిల్లా నాయకులు రచ్చ శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు పులిపాటి సంపత్ గుడ్ల శ్రీను దరిపల్లి సాంబయ్య చందా వీరభద్రం అమృతం మల్లికార్జున్ కమర్థపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# పత్తి పంటలో గంజాయి సాగు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 05 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** అందోల్ నియోజకవర్గం లోని వట్టిపల్లి మండల పరిధిలో గల బిజిలిపూర్,గ్రామంలో ఓ రైతు పత్తి పంటలో అంతర్గత పంటగా, గంజాయి సాగు చేస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం అందిన మేరకు, జోగిపేట సిఐ,అనిల్ కుమార్, స్థానిక ఎస్సై లవ కుమార్, తహసిల్దార్ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి శ్రీనివాసులతో, కలిసి రైతు పంట పొలాల్లోకి వెళ్లి పరిశీలించగా, పంటలో ఆరు గంజాయి మొక్కలు లభించాయని, బిజిలి పూర్, గ్రామానికి చెందిన గట్టుమీది రాములు, అనే వ్యక్తి తన పత్తి పంటలో గంజాయి మొక్కలు నాటుకొని సాగు చేస్తున్నాడని,6, మొక్కలను స్వాధీనపరచుకొని, గంజాయి సాగు చేస్తున్న పంట యజమానిపై, వట్టిపల్లి, పోలీసులు కేసు నమోదు చేశారు, ఈ సందర్భంగా సిఐ,అనిల్ కుమార్,మాట్లాడుతూ, ఎవరైనా పంట పొలాల్లో అంతర్గత పంటగా గంజాయి సాగు చేస్తే, పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు, వారు అక్రమ వ్యాపారులకు పాల్పడితే, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు...

## లయన్ ప్రకాష్ కాలేవార్ వంజరి కి గిన్నిస్ వరల్డ్ రికార్డ్



**సెప్టెంబర్ 05 ఆదిలాబాద్ (ప్రజాబలం ప్రతినిధి) :** ఎల్ఐసీకి చెందిన చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ (మార్కెటింగ్) లయన్ ప్రకాష్ కాలేవార్ వంజరి గారు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈ అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు ఎల్ఐసీ ఆదిలాబాద్ అధికారులు, ఉద్యోగులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ అధికారులు మాట్లాడుతూ, కాలేవార్ గారి కృషి, అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సంస్థ అభివృద్ధికి, తోటి ఉద్యోగులకు ఆయన ఒక ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని విజయాలు సాధించాలని, సంస్థకు మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేములవాడ రూరల్ బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శుక్రవారం రోజున వేములవాడ పట్టణంలో బిజెపి రూరల్ పార్టీ అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ నిత్యవసర వస్తువులపై జిఎస్టి బారాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ లో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో అగ్రస్థానానికి అడుగులు వేస్తున్న ఈ తరుణంలో అగ్రరాజ్యమైన అమెరికా, భారతదేశ ఎదుగుదలను గౌరవ లేక భారత దిగుమతులపై పన్ను శాతం పెంచుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను చిన్నబిన్నం చేస్తున్న పరిస్థితులలో కూడా నరేంద్ర మోడీ పేద మరియు మద్దతు ప్రజల శ్రేయస్సు కోసం జీఎస్టీ పన్నును మరింత తక్కువ చేయడం శుభ పరిణామం అన్నారు. అదేవిధంగా దేశ ప్రజలు స్వదేశీ వస్తు వినియోగం చేయాలని తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, వనపర్తి పరశురాములు, మండల ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య, కార్యదర్శులు మంద రాజేందర్, శక్తి కేంద్రం ఇన్చార్జి ఉప్పుల గౌతం, చింతకుంట గౌతమ్, బూత్ అధ్యక్షులు ఆది జలంధర్, సింగర్ వేణి హరీష్, చొప్పరి కరుణాకర్, ముష్కం సంజీవ్, సీనియర్ నాయకులు ఆవునూరి తిరుపతి, గుండెల్ని వేణుగోపాల్, జంగేటి శ్రీనివాస్, దుద్దేటి వర్ధన్, మందా నిశాంత్, జయ్యారపు పవన్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జన వేడుకలు.

**ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన.**

**రాజన్న గుడి చెరువులో నిమజ్జన ప్రక్రియను బోటులో వెళ్లి పరిశీలించిన విప్, కలెక్టర్, ఎస్పీ.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో గణేష్ నిమజ్జనానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గణేష్ శోభాయాత్ర వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అనంతరం గణేష్ విగ్రహానికి పూజలు చేశారు. నిమజ్జన స్థలం వద్ద అధికారులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు భక్తి గీతాలు, ఇతర కళాకారుల మ్యాజిక్ షో భక్తులను ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆసక్తిగా తిలకించారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ ఏ ఎస్ పి శేషాద్రిని రెడ్డి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ అర్బన్ తహసీల్దార్ విజయ్ ప్రకాష్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, పోలీసులు, రెవిన్యూ శాఖ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాహకుడిని అభినందించిన మున్సిపల్ కమిషనర్, రూరల్ సీఐ శ్రీనివాస్.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలో గురువారం రోజు జరిగిన గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమంలో పట్టణంలోని నాలుగో వార్డు మహాలక్ష్మి వీధి న్యూ పోలింగ్ బూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ శోభాయాత్ర ఈ సంవత్సరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆధునిక యుగంలో ట్రాక్టర్లు, లారీలు, ట్రాలీలు సాధారణమైపోయిన వేళ, పాత కాలపు సంప్రదాయాన్ని మళ్లీ గుర్తు చేస్తూ గణేష్ మంటపనిర్వాకులు విగ్నేశ్వరుని ఎద్దుల బండి పై నిమజ్జనానికి తీసుకువెళ్లారు. చాలా కాలం క్రితం వరకు పల్లెలలో గణేశుని విగ్రహాలను ఎద్దుల బండ్ల పైననే ఉంచి నిమజ్జనానికి శోభాయాత్రగా తీసుకువెళ్లడం ఆనవాయితీగా ఉండేది. ఆ కాలపు అహ్లాదం, పల్లె వాతావరణ సంస్కృతి ప్రతిబింబమైన ఎద్దుల బండి దృశ్యాన్ని మళ్లీ సజీవం చేయాలన్న ఆలోచనతో గణేష్ మంటపనిర్వాకులు ఈ వినూత్న ప్రయత్నం చేశారు. ఎద్దుల బండి మీద అలంకరించిన గణేష్ ని విగ్రహం, పూలదండలు, గజమాలతో అందంగా తీర్చిదిద్దిన వేదిక, ఎద్దుల బండి ముందు, వెనక నడిచిన భక్తుల నినాదాలు, గణేష్ ని శోభాయాత్రను చూసిన ప్రతి ఒక్కరికి పల్లె జ్ఞాపకాలను మళ్లీ మేల్కొల్పాయి. వేములవాడ పట్టణంలోని గుడి చెరువు నిమజ్జన ప్రాంగణంలో పలువురు భక్తులు, వేములవాడ పట్టణవాసులు, ఎద్దుల బండిని ఆపి గణేష్ ని దర్శించుకుని, సెల్ఫీ ఫోటోలు తీసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వినూత్న శోభాయాత్ర పల్లె సంప్రదాయం, పర్యావరణ హితం, ఆధ్యాత్మికత కలగలిపి అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులను వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, వేములవాడ రూరల్ ఎస్సై శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

# గురువులను గౌరవించడం మన బాధ్యత. మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** గురుబ్రహ్మ గురు విష్ణు గురుదేవో మహేశ్వర, గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః.

నవ సమాజానికి ఉత్తమ పౌరులను అందించే పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అహర్నిశలు శ్రమిస్తున్న గురువులకు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు చల్ల సత్తయ్య, తంగుడిక కోటేశ్వర శర్మ, కామారపు సాంబశివరావు, సిద్ధంశెట్టి రాజేశం,



తిరుపతి, చారి, కనపర్తి శ్రీనివాస్ మరియు ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న పొలాస రాజేందర్, మహిళా ఉపాధ్యాయురాలు రాపర్తి వాణి, ఎలుగందుల సమత, కొమురవెల్లి దీపికలను మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

విశ్రాంత ఉపాధ్యాయులు తంగుడికి కోటేశ్వర్ శర్మ, కామారపు సాంబశివరావు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని, దాదాపు 5 సంవత్సరాలుగా మై వేములవాడ చార్టర్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని, మమ్మల్ని గుర్తించి సన్మానించడం ఆనందంగా ఉందని, మా వంతు సహాయ సహకారాలు పై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ కు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు ట్రస్టు సభ్యులు మధు మహేష్, డాక్టర్ బెజ్జకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పాత సంతోష్, పొలాస రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ మనోహర్ రావు కన్నుమూత. చందుర్తి మండలం లో అలుముకున్న విషాద ఛాయలు.



**చందుర్తి, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సింగిల్ విండో మాజీ చైర్మన్, మనోహర్ రావు గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాదులోని తన సొంత నివాసంలో తుది శ్వాస విడిచారు. చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి సర్పంచ్ గా వరుసగా ఆరుసార్లు ఎన్నికై తిమ్మాపూర్ గ్రామ అభివృద్ధికి విశేష సేవలందించారు. అలాగే చందుర్తి సింగిల్ విండో చైర్మన్ గా వ్యవసాయ రంగంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మనోహర్ రావు ను నక్సలైట్లు టార్గెట్ చేయడంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆయనకు వన్ ప్లస్ వన్ పద్ధతిలో గన్ మెన్లను ఏర్పాటు చేసింది. దాదాపు 25 సంవత్సరాల క్రితం చందుర్తి మండలం మూడో పెల్లి గ్రామ బస్టాండ్ వద్ద అప్పటి జనశక్తి నాయకుడు రణధీర్ జరిపిన కాల్పులలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న మనోహర్రావు చాకచక్యంగా తప్పించుకొని ప్రాణాలతో బయటపడినాడు. మనోహర్రావు మృతితో తిమ్మాపూర్ గ్రామం తో పాటు మొత్తం చందుర్తి మండలం లో విషాద ఛాయలు అలుముకున్నాయి. తిమ్మాపూర్ గ్రామ ప్రజలు, చందుర్తి మండల వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసినారు.

# సరూర్ నగర్ కట్టను పరిశీలించిన రాచకొండ సీపీ

హైదరాబాద్ రాచకొండ సీనీ సుధీర్ బాబు శుక్రవారం నాడు సరూర్ నగర్ కట్టను సందర్శించి చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సిపి మాట్లాడుతూ.. వినాయక నిమర్జనం ఇప్పటివరకు 3వేలు గణనాధులు నిమజ్జనం కాగా, ఇంకా 20 వేల విగ్రహాల వరకు రాచకొండ పరిధిలోని పలు చెరువులు కుంటలలో నిమజ్జనానికి సిద్ధంగా ఉన్నాయని సుధీర్ బాబు తెలిపారు అలాగే ఇక్కడ ఎలాంటి ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఆటంకం కలగకుండా అధికారులు, పోలీసులు షీ టీమ్స్ మరియు ఎస్ఓటీ టీం మరియు మెడికల్ ట్రీట్మెంట్ టీమ్స్ కూడా సిద్ధంగా ఉంచామని సుధీర్ బాబు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సైతం పరిశీలించి అధికారులకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 12 వేల మంది పోలీసు అధికారులతో ఈ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది. అధికారులతో కలిసి సరూర్ నగర్ చెవులో ఉన్న బోటులో ఎక్కి అక్కడి వాతావరణాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 5 ( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా:వికారాబాద్ మండలం లోని లబ్ధిదారులకు మంజూరైన 16 కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కు లను, 40 సీఎంఆర్ఎఫ్,చెక్కులను మరియు వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన 38 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో అందజేసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు పేదల పాలిట ఆపద్బాంధవుని లాంటిదని బాధ్యత కుటుంబాలు చెక్కులు తీసుకుంటూ ఆనందం వ్యక్తపరిచారు

# పంచలింగాల్ ఘనంగా వినాయక పూజ మంత్రి గారి డాక్టర్ కృష్ణ గౌడ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 5( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా: మర్పల్లి / పంచలింగాల్ ఘనంగా వినాయక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిగారి డాక్టర్ కృష్ణ గౌడ్ ప్రతి ఒక్కరూ పూజా కార్యక్రమంలో పాల్గొనాలి ప్రతి ఒక్కరు దైవభక్తితో ఉండాలని తెలిపారు వినాయక యాత్రలో పాటలు పాడుతూ భజనలు చేస్తూ భక్తిశ్రద్ధలతో పవిత్ర గంగాలో వినాయక నిమజ్జనం చేయాలని మంత్రిగారి డాక్టర్ కృష్ణ గౌడ్ తెలిపారు పూజా కార్యక్రమంలో మంత్రిగారి డాక్టర్ కృష్ణ గౌడ్ శంకర్ రెడ్డి మంత్రిగారి హరీష్ గౌడ్,నరేష్ గౌడ్ బలవంత రెడ్డి బయన్న పాపయ్య సంజు యాదవ్ ప్రశాంత్ మానేయ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు

# భావితరాల నిర్మాతలు ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం), సెప్టెంబర్ 5:**క్రీస్తు శేషులు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని ములుగు జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ సిద్ధార్థరెడ్డి గారు అధ్యక్షత వహించగా, జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టిఎస్ గారు ముఖ్య అతిథిగా, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి రేగ కళ్యాణి గారు మరియు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంపత్ రావు గారు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గారు మాట్లాడుతూ, “ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలు. వారి చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మంచి సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలి” అని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి గారు మాట్లాడుతూ, “గిరిజన ప్రాంతమైన ములుగు జిల్లాలో అధిక సంఖ్యలో గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ సేవలందిస్తున్న ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయము. విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలి” అని అన్నారు.

అనంతరం ములుగు జిల్లాలో 33 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అతిథుల చేతుల మీదుగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి ఈ.సూర్యనారాయణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, గుళ్లపెల్లి సాంబయ్య, మండల విద్యాధికారులు, అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మరియు జిల్లా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గురుపూజ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 5 ( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా’జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్న పరిగి, చేవెళ్ల శాసనసభ్యులు టి. రామ్మోహన్ రెడ్డి కాలే యాదయ్య, ఎం ఎల్ సి , శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ లు, జిల్లా ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు.

ఈసందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను బహుకరించి సన్మానించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ ఉత్తమ టీచర్ల పట్ల సంతోషం వ్యక్తపరిచారు .

# గణేష్ నిమజ్జనం కీ ఏర్పాట్లు పూర్తి.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) సెప్టెంబర్ 5 :** జిల్లా కేంద్రం లోని తోపు కుంటలో ములుగు, వెంకటపూర్ మండలాకు సంబంధించిన ..150.... గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉంది. అదేవిధంగా ముల్లకట్ట, ఏటూరునాగారం నందు 250 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉంది. ఏటూరునాగారం, మంగపేట, వాజెడ్ మండలాల కు సంబందించిన అన్ని గణేష్ విగ్రహాలు నిమజ్జనం చెయ్యడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చెయడం జరిగింది.

ఈ కార్యక్రమం లో డీపీవో ఓ దేవరాజు, మున్సిపల్ కమిషనర్ సంపత్, ములుగు తహసిల్దార్ విజయభాస్కర్, ఏటూరునాగారం మండలం స్పెషల్



ఆఫీసర్ రాంపతి, ఏటూరునాగారం, వాజెడ్ ఎంపీడీఓ లు శ్రీనివాస్, శ్రీకాంత్, ఎంపీవో కుమార్, ఏటూరునాగారం పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఏటూరునాగారం, వాజెడు పంచాయతీ కార్యదర్శులు, ఎం పి డబ్ల్యూ లు, గజ ఈత గాళ్ళు పాల్గొన్నారు.

# జయా – చైతన్య రెడ్డి దంపతులను ఆశీర్వదించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

## సంగారెడ్డి లోని ఇంటికి వచ్చి కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించిన దత్తాత్రేయ



**సంగారెడ్డి సెప్టెంబర్ 5 (ప్రజాబలం న్యూస్ )**నూతన దంపతులు జయా – చైతన్య రెడ్డి లను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆశీర్వదించారు.శుక్రవారం సంగారెడ్డి లోని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గ రెడ్డి ఇంటికి వచ్చి కొత్త బట్టలు పెట్టి దత్తాత్రేయ ఆశీర్వదించేరు. ఈ సందర్భంగా ...తాను రాసిన 'ప్రజల కథే నా ఆత్మకథ ' పుస్తకాన్ని జగ్గారెడ్డికి దత్తాత్రేయ అందించారు.అలాగే ...అక్టోబర్ 3న హైదరాబాద్ లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి జగ్గారెడ్డిని ఆహ్వానించారు.ఈ సందర్భంగా దత్తాత్రేయ, జగ్గారెడ్డి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది.దత్తాత్రేయతో తనకున్న అనుబంధాన్ని జగ్గారెడ్డి గుర్తు చేసుకున్నారు.... పార్టీలకతీతంగా మీరు ఏవిధంగానైతే మీరు సేవలు చేశారో మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని నేను మీలాగే పార్టీలకతీతంగా సేవ చేస్తున్నానని జగ్గారెడ్డి..దత్తాత్రేయ కు తెలిపారు. ఆరోజుల్లో పనికోసం తన వద్దకు వచ్చే వారికి దత్తాత్రేయ చిట్టీ రాసిచ్చేవారనీ , పని పూర్తయిందా ? లేదా? అన్న విషయాన్ని సైతం వాకబు చేసేవారని జగ్గారెడ్డి గుర్తు చేశారు.... తానూ దత్తాత్రేయ నుండి కొన్ని విషయాలను నేర్చుకున్నాననీ ఆయన స్ఫూర్తి తో ప్రజా సేవ చేస్తున్నానని జగ్గారెడ్డి దత్తాత్రేయ కు వివరించారు....లాలాగూడ రామాలయంలో దత్తాత్రేయ సమక్షంలోనే తన పెళ్లి జరిగిందని జగ్గారెడ్డి గుర్తు చేశారు..... గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా మీరు పార్టీ కోసం ఎంతో పనిచేశారన్నారు.....మీకు నియోజకవర్గం లో ప్రోటోకాల్ ఉండాలని, సీఎం గా తన కోటాలో నా భార్య నిర్మల కు కార్పొరేషన్ చైర్మెన్ ఇస్తానని అన్నారు... ఈ పదవి సీఎం గా నా కోటాలో ఇస్తున్నానని, రాహుల్ గాంధీ గారి కి కూడా ఇదే విషయం చెబుతానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని దత్తాత్రేయ కు జగ్గారెడ్డి.... వివరించారు. టీజీఐఐసి చైర్మెన్ ఇవ్వాలని తాను అడిగానని, అడిగిన విధంగానే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చాడని జగ్గారెడ్డి దత్తాత్రేయ కు తెలిపారు.. ఆరోజుల్లో నలభై ఏళ్ల క్రితం దత్తాత్రేయ తో కలిసి పనిచేసిన పన్యాల ప్రభాకర్, బిహెచ్ఈఎల్ అంజయ్య, మిఠాయి నారాయణ, మిఠాయి వీరన్న, రెడ్డి పల్లి విఠల్ గౌడ్, బెస్త నర్సింగ్, తోపాజి అనంత్ కిషన్ తదితరుల జ్ఞాపకాల ను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు

# మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ను సందర్శించిన..

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఎస్.పి. శబరిష్.

**కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం గద్దెల ప్రకారం విస్తరణ ప్రణాళికలు. కొత్త మాస్టర్ ప్లాన్ అమలు లో భాగంగా భక్తుల సౌలభ్యం కొరకు క్యూలైన్ ల ఏర్పాటు కు చర్యలు.**



ములుగు జిల్లా ప్రతినిధి, (ప్రజాబలం) సెప్టెంబర్ 5 : శుక్రవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం లోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,

ఎస్.పి. శబరిష్., కొత్త మాస్టర్ ప్లాన్ అమలు లో భాగంగా గద్దెల ప్రకారం విస్తరణ ప్రణాళికలకు దేవాదాయ శాఖ అధికారులతో పాటు, పోలీస్ అధికారులు భద్రతా ఏర్పాట్లకు అనుగుణంగా స్థలాన్ని పర్యవేక్షించారు.


ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పి, శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ప్రాంతం చుట్టూ కలియ తిరుగుతూ

కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలు వరుస ప్రకారం విస్తరణ ప్రణాళికలు, సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనం కొరకు భక్తులు సౌలభ్యం గా క్యూలైన్ ల ఏర్పాటు, వి ఐ పి, వి వి ఐ పి ల, ఎంట్రి తదితర అంశాలను క్షుణ్ణంగా చర్చించారు.



ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, ములుగు డి.ఎస్.పి రవీందర్, దేవదాయ శాఖ డి ఈ సి హెచ్ రమేష్ బాబు, సంబంధిత అధికారులు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సూరజ్ నగర్ కాలనీలో గనేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గుర్రాల వెంకటేశ్ యాదవ్



**మేడ్చల్ సెప్టెంబర్ 5 (ప్రజాబలం న్యూస్ )**బోడుప్పల్ మునిసిపల్ పరిధి లోని 15 వార్డ్ లో గల సూరజ్ నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన గనేశునికి బోడుప్పల్ 24వ వార్డ్ మాజీ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్ యాదవ్ ప్రతేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనను సూరజ్ నగర్ వేల్ఫేర్ అసోషేషన్ సభ్యులు ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూరజ్ కాలనీకి సిసి రోడ్డు రావడానికి ప్రధాన కారకుడు వెంకటేష్ అని మన కాలనీ డ్రైనేజీ వ్యవస్థ కోసం పది లక్షలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.అంటే కాకుండా సూరజ్ నగర్ పార్కు స్థలంలో వాటర్ ట్యాంకు కొరకు 55000 (అక్షరాల 55 వేల రూపాయలు) ఇచ్చినట్లు పేర్కొన్నారు.అనంతరం గుర్రాల రమా వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ సూరజ్ నగర్ కాలనీ అభివృద్ధి కోసం ఎల్లవేళలా తన సహాయ సహాకారాలు ఉంటాయని తెలిపారు.

# సూరజ్ నగర్ కాలనీలో లడ్డు వేలం పాటలో 57వేలకు లడ్డును కైవశం చేసుకున్న పవన్ కుమార్ దంపతులు



**బోడుప్పల్ సెప్టెంబర్ 5 (ప్రజాబలం న్యూస్ )**బోడుప్పల్ మునిసిపల్ పరిధి లోని 15 వార్డ్ లో గల సూరజ్ నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన గనేశుని నవరాత్రోత్సవాళ్ళో జరిగిన లడ్డు వేలం పాటలో లో స్ట్రీట్ నంబర్ 7 కు చెందిన పవన్ కుమార్ దంపతులు 57వేలకు పాటపాడి లడ్డును గెలుచుకున్నారు.అలాగే కలశం ను శ్రీనివాస్,గజమాలని దేవేందర్ గెలుచుకున్నారు. ఈ కార్యక్రమం లో కాలని అద్యక్షులు రవి చంద్ర, కాలని మాజీ ప్రదాన కార్యదర్శి సోమ నర్సింహ చారి, శ్వేత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 15, 516లు పలికిన రంగమ్మ గూడెం వినాయక లడ్డు

## లడ్డు దక్కించుకున్న వంగాల అవినాష్



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం రంగమ్మగూడెం వినాయక లడ్డు 15,516 పలికింది. రంగమ్మ గూడెం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం వినాయకుని చెంతన నిర్వహించిన లడ్డు పాటలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విఘ్నాలను తొలగించే వినాయకుడి లడ్డు కైవసం చేసుకునేందుకు గ్రామ వాసులు పోటీపడ్డారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడి లడ్డును గ్రామవాసి వంగాల అవినాష్ 15,516కు పాడి కైవసం చేసుకున్నారు. హైదరాబాద్



మహానగరంలో నివసిస్తున్న తనకు స్వగ్రామం అంటే ఎంతో ఇష్టమని అందులోనూ గ్రామ వాసులందరూ కలిసిమెలిసి జరుపుకునే వినాయక ఉత్సవాలు మరింత ఇష్టమని అన్నారు. ప్రతి ఏడాది జరిగే ఉత్సవాలకు తప్పనిసరిగా హాజరవుతూ వినాయకుడి లడ్డూను దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తన గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఏకదంతుణ్ణి ప్రార్థించినట్లు వంగాల అవినాష్ అన్నారు..

# భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 05 :** మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల,హాజుపూర్, లక్షెట్టిపేట,దండేపల్లి, మండలంలోని వినాయక మండపం నుంచి భక్తులు,భక్తి శ్రద్ధలతో పూజించి,కోలాటం ఆడుతూ.నూత్యలు చేస్తూ ఊరేగింపు కొనసాగించారు. ఇలాంటి అల్లర్లు కాకుండా, పోలీస్ బందోబస్తు, నిర్వహించారు.దగ్గరలో వున్న గోదావరి నదిలో నిమజ్జని వహించారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com